

ఆదివారం బతుకమ్మ అనుబంధానికి బదులుగా శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగం అందుకోండి.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

ఆదివారం
SUNDAY
15.3.2026

హైదరాబాద్
HYDERABAD


పేజీలు: 12+4+52 పేజీల ఆదివారం అనుబంధం
Pages: 12+4+52 pages sunday supplement

సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 279 ‖ వెల (Price) రూ.8.00

ఆదివారం, సూర్యోదయం: 6-24, సూర్యాస్తమయం: 6-26. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం శిశిర రుతువు ఫాల్గుణ మాసం కృష్ణ పక్షం తిథి: ఏకాదశి ఉదయం 9-16 వరకు, తదుపరి ద్వాదశి. నక్షత్రం: శ్రవణం తెల్లవారుజామున 5-57 వరకు. వర్జ్యం: ఉదయం 9-00 నుంచి ఉదయం 10-40 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-55 నుంచి సాయంత్రం 6-24 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-49 నుంచి సాయంత్రం 5-36 వరకు. అమృతకాలం: రాత్రి 7-02 నుంచి రాత్రి 8-43 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



ఖర్గ్ ఐలాండ్‌పై భీకర దాడి

ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బకొట్టే లక్ష్యంతో అమెరికా దాడులు

ప్రతిగా సౌదీలోని అమెరికా బేస్‌పై విరుచుకుపడ్డ ఇరాన్ › 8



మూసీలో మురుగు కలువకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఎస్టీపీ


కేసీఆర్ సర్కార్ సిద్ధం చేసిన మూసీ సుందరీకరణ నమూనా

కేసీఆర్ విజన్.. రేవంత్ విధ్వంసం

పేదల ఇండ్లు కూల్చి మూసీలో కాంగ్రెస్ రియల్ దందా

లక్షన్నర కోట్లు కొల్లగొట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ గురి: కేటీఆర్

పవర్ పాయింట్ వర్సెస్ పబ్లిక్ పాయింట్

మూసీ బ్యూటిఫికేషన్ పేరిట రియల్ ఎస్టేట్ లూటీకి తెరలేపిన కాంగ్రెస్ ప్రభుత్వం స్టార్ హోటల్‌లో 'పవర్' పాయింట్ ప్రజెంటేషన్ పేరిట ఫక్తు రియల్ ఎస్టేట్ సమ్మిట్ నిర్వహించింది. నిర్వాసితులను కాకుండా వైట్ కాలర్ ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను పిలిచి అబ్రకదబ్ర గారడీతో రంగుల ప్రపంచాన్ని 'తెర'పై చూపింది. ధనార్జనే ధ్యేయంగా భావించేవాళ్లు పాలకులుగా ఉంటే జరిగే విధ్వంసాన్ని కండ్లకుగట్టింది.

మరోవైపు మానవత్వం ఉన్న నాయకులు అధికారంలో ఉంటే ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి ప్రజలకు మేలు కలిగిస్తుందనే వాస్తవం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన 'పబ్లిక్ పాయింట్' ప్రజెంటేషన్‌తో సుస్పష్టమైంది.

మూసీ డీపీఆర్‌లో కనీసం నిర్వాసితుల అభిప్రాయాలు కూడా పరిగణనలోకి తీసుకోకుండా రేవంత్ సర్కార్ నియంతృత్వానికి పోతే.. నదీ పరీవాహక ప్రాంత బాధితుల గోడు స్వయంగా వారి నోటి వెంటే కేటీఆర్ ప్రపంచానికి వినిపించారు. ప్రాజెక్టుతో ఎవరైతే సర్వస్వం కోల్పోతున్నారో వారి మధ్యకే వచ్చి వాస్తవాలు బయటపెట్టారు.

లక్షలాది మంది ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న 'మూసీ పునరుజ్జీవ'నాన్ని ఒక్క ఇటుక కూడా కూల్చకుండా ఎలా చేసి చూపించాలో.. ఇందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమేం చేసిందో కూలంకశంగా వివరించారు.

- కేసీఆర్ పాలనలో 16 వేల కోట్లతోనే మూసీకి ప్రణాళికలు
- ఇప్పుడు రేవంత్ సేకరించే 3 వేల ఎకరాల విలువ లక్షన్నర కోట్లు
- హామీలు నెరవేర్చకుండా మూసీకి లక్షల కోట్లు ఏడికెల్లి తెస్తరు?
- ఒక్క ఇల్లూ కూల్చకుండా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌ది
- రియల్ ఎస్టేట్ కోసం లక్ష ఇండ్లు కూల్చే కుట్రలు కాంగ్రెస్‌వి
- అసలు డీపీఆరే లేనప్పుడు ఇండ్లకు రెడ్ మార్కులు ఎందుకు?
- 'మధు పార్క్ రిడ్జ్'లా మిగతా పేదలకు భూమికి భూమి ఇవ్వరా?
- మధు పార్క్‌కు వర్తించే బఫర్‌జోన్ అక్కడకట్టే బిల్డింగ్‌లకు వర్తించదా?
- ఒక్క ఇల్లుకట్టే తెలివిలేని రేవంత్‌కు వేల ఇండ్లు కూలగొట్టే అర్హతున్నదా?
- 2 వేల కిలోమీటర్ల నమామి గంగే ప్రాజెక్టుకు రూ.42వేల కోట్లు..
- మరి 250 కిలోమీటర్ల మూసీకి లక్షన్నర కోట్లు ఎట్లయితయ్? › 2
- టీడీఆర్ అంటే 'తిరుపతిరెడ్డి డెవలప్‌మెంట్ రైట్స్'లా మారింది

ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై పీపీటీ

కేసీఆర్ ప్రభుత్వం ఒక్క ఇంటినీ కూల్చకుండా.. పేదోడి గుంట భూమి తీసుకోకుండా.. చుక్క మురుగునీరు మూసీలో కలువకుండా వరల్డ్ క్లాస్ డిజైన్లతో రూ.16,634 కోట్లతో మూసీ సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మూసీ వెంబడి కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపిన సీఎం రేవంత్‌రెడ్డి, చేప పేరు చెప్పి చెరువును మింగే కుట్రలు చేస్తున్నడు.

రెండు వేల కిలోమీటర్ల మేర ప్రవహించే గంగా నది ప్రక్షాళన కోసం చేపట్టిన నమామి గంగే ప్రాజెక్టుకు రూ.42వేల కోట్లు ఖర్చుపెడితే.. కేవలం 55 కిలోమీటర్ల పొడవైన మూసీ నది సుందరీకరణకు లక్షన్నర కోట్ల ఖర్చు ఎట్లయితది?

మేధా పాట్కర్ లాంటి మేధావులు, మహాత్ముడి మునిమనుమడైన తుషార్ గాంధీ లాంటి వ్యక్తులే గాంధీ సరోవర్.. మూసీ పేరిట జరిగే విధ్వంసానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నరు. అయినా మహాత్ముడి పేరుతో లక్షల కోట్ల విలువ చేసే భూములు కొల్లగొట్టి, లక్షలాది మందిని రోడ్డున పడేసే కుట్రలకు రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నడు. -కేటీఆర్



ప్రజలను రోడ్డున పడేయడమే అభివృద్ధా?

- మా జీవితాల కంటే టూరిజమే ముఖ్యమా?
- పీపీటీ అంటే సీఎం భరోసా ఇస్తరనుకున్నం
- ఏఐ గ్రాఫిక్స్ చూపెట్టి.. మా ఇండ్లు, స్థలాలకు జీరో వాల్యూ అని చెప్పి వెళ్లిపోయిండు
- మూసీ బాధితురాలు రమ్య ఆవేదన

› 2



విలువలేని టీడీఆర్‌లను ఏం చేసుకోమంటరు?

- విలువైన ఇండ్లు కూల్చి టీడీఆర్ ఇస్తమంటున్నరు
- కోటి విలువైన టీడీఆర్‌కు రూ.10 లక్షలూ రావు
- పేపరును అమ్ముకోవడానికి ఎక్కడ తిరగాలి?
- గంట సేపు పీపీటీలో పరిహారం గురించి సీఎం ఒక్కమాట మాట్లాడలే: సైంటిస్ట్ శరత్‌బాబు

› 2

రైతులు వరి సాగు చేయొద్దు

- వరిని వదలకపోతే మీకే నష్టం › 5
- వడ్లు కొనబోమని కేంద్రం చెప్పింది
- ఆయిల్‌పామ్ లాభదాయక పంట
- 22న నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం.. మంత్రి తుమ్మల వెల్లడి


26 తర్వాత ఆర్టీసీలో మెరుపు సమ్మె

› 7

- ఉద్యోగుల్లో పెరుగుతున్న అసంతృప్తి
- ముంచుకొస్తున్న ఎలక్ట్రిక్ ప్రైవేటీకరణ
- విలీనం తప్ప మరో దారి లేదంటున్న కార్మికులు.. ఉద్యోగ భద్రతపైనే గురి

హెచ్‌సీఏ నుంచి కోట్లు కొల్లగొట్టే కుట్ర

- రాజీవ్‌గాంధీ పేరు పెట్టినందుకు రూ.70 కోట్ల నష్టపరిహారం
- 'విశాఖ'కు లబ్ధి చేకూర్చే యత్నం
- గడ్డం సోదరులపై బాబూరావు సాగర్ ఆరోపణ › 6
- ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్



హిమాయత్‌సాగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మూసీ సుందరీకరణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న కేటీఆర్



బీఆర్ఎస్ హయాంలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన మూసీ సుందరీకరణ పనులు



మూసీ సుందరీకరణకు బీఆర్ఎస్ సర్కార్ నిధుల ప్రణాళిక వివరాలు

కేసీఆర్ విజన్.. రేవంత్ విధ్వంసం

పేదల ఇండ్లు కూల్చి మూసీలో కాంగ్రెస్ రియల్ వ్యాపారం • లక్షన్నర కోట్లు కొల్లగొట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ గురి: కేటీఆర్

- కేసీఆర్ పాలనలో 16 వేల కోట్లతోనే మూసీకి ప్రణాళికలు
- ఒక్క ఇల్లు కూల్చకుండా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌ది
- రియల్ ఎస్టేట్ కోసం లక్ష ఇండ్లు కూల్చే కుట్రలు కాంగ్రెస్‌వి
- అసలు డీపీఆర్ లేనప్పుడు ఇండ్లకు రెడ్ మార్కులు ఎందుకు?
- 2 వేల కిలోమీటర్ల నమామి గంగే ప్రాజెక్టుకు 42వేల కోట్లు
- మరి 250 కిలోమీటర్ల మూసీకి లక్షన్నర కోట్లు ఎట్లయితయ్?
- టీడీఆర్ అంటే తిరుపతిరెడ్డి డెవలప్‌మెంట్ రైట్స్
- అభివృద్ధికి కాదు.. పేదల ఇండ్లు కూల్చివేసే దోపిడీకి వ్యతిరేకం
- ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై నిర్వాసితుల మధ్య కేటీఆర్ పీపీటీ

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 14(నమస్తే తెలంగాణ): మూసీ వెంబడి ఉన్న ఇంటికి జీరో వాల్యూ ఉన్నదంటూనే రేవంత్‌రెడ్డి సర్కార్ సేకరించే మూడు వేల ఎకరాల భూముల విలువే రూ.లక్షన్నర కోట్లు ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. పేదల ఇండ్లు కూల్చి, ఖజానా నింపుకొనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలను, కాంగ్రెస్ కుట్రలను అడ్డుకుంటామని మరోసారి స్పష్టంచేశారు. మూసీ సుందరీకరణకు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని, అయితే, ప్రాజెక్టు పేరిట వేల ఎకరాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తామంటే సహించేది లేదని హెచ్చరించారు. శనివారం మూసీ పరీవాహక ప్రాంత బాధితులతో హిమాయత్‌సాగర్‌లో ఏర్పాటు చేసిన 'పవర్ పాయింట్ వర్సెస్ పబ్లిక్ పాయింట్' చర్చా వేదికలో ఆయన పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి, పాలనలో కూలిన ఇండ్లు, మూసీ పేరిట కూల్చబోయే నిర్మాణాలు, బఫర్ జోన్ పేరిట పేదలను ఆగం చేస్తున్న విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేటీఆర్ వివరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మూసీ పునరుజ్జీవానికి కేసీఆర్ చేపట్టిన నిర్మాణాత్మక ప్రణాళికలు, బడ్జెట్ వివరాలు, ప్రతిపాదనలు, అంతర్జాతీయ స్థాయిలో రూపొందించిన డిజైన్ల వివరాలను బాధితుల ఎదుట ప్రదర్శించారు. 400 ఏండ్ల చరిత్ర కలిగిన హైదరాబాద్ మహానగరానికి, మూసీ నదితో ఉన్న బంధం ఎన్నటికీ విడదీయలేనిదని కేటీఆర్ పేర్కొన్నారు. నిజాం కాలంలో జీవనదిలా నగరంలో ప్రవహించిన మూసీని, ఆ తర్వాత కాలంలో కాలుష్య కాసారంగా, ఆక్రమణలకు నిలయంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన నిర్లక్ష్యం ఆ తర్వాత వచ్చిన ముంపు ఘటనలకు కారణమని పేర్కొన్నారు. జీవనది మూసీని మొదటి నుంచి 2013 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలా మార్చుకుని, పునరుజ్జీవం పేరిట మనుగడ లేకుండా చేసిందని ఆరోపించారు. స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాతే కేసీఆర్ హయాంలో నీళ్లు, నిధులు, ప్రాజెక్టులకు ఆదరణ వచ్చిందని వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకునే క్రమంలో ప్రజాధనం దుర్వినియోగానికి తావు లేకుండా అతి తక్కువ అంచనా వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను హైదరాబాద్ నగరం నెత్తిన ఉన్న జంట జలాశయాలకు తీసుకొచ్చే ప్రణాళికలు వేశారని వివరించారు. కేసీఆర్ హయాంలో కేవలం రూ.1,100 కోట్ల అంచనా వ్యయంతోనే నిత్యం 2 టీఎంసీల నీటిని గ్రావిటీలా మార్చితే... అవే ప్రతిపాదనలను రూ.10వేల కోట్లకు రేవంత్‌రెడ్డి పెంచారని విమర్శించారు. నగరంలో రూ.16,634 వేల కోట్లతో, ఒక్క ఇంటిని కూడా కూల్చకుండా, పేదోడి గుంట భూమిని కూడా తీసుకోకుండా, చుక్క మురుగు నీరు మూసీలో కలవకుండా వరల్డ్ క్లాస్ డిజైన్లతో మూసీ సుందరీకరణ కోసం సిద్ధం చేసిన ప్రణాళికలను కాంగ్రెస్ సర్కార్ పక్కనపెట్టిందని దుయ్యబట్టారు. మూసీ వెంబడి రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపిన సీఎం రేవంత్‌రెడ్డి, మూసీ బఫర్ జోన్ పేరిట రూ.లక్షన్నర కోట్ల విలువ చేసే భూములను తీసుకునే కుట్రకు తెరలేపారని ఆరోపించారు.

> మూసీ నిర్వాసితులు లేకుండా కేవలం వైట్ కాలర్ ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వేదిక తరహాలో ఫైవ్ స్టార్ హోటళ్లలో మూసీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన రేవంత్ రెడ్డి.. అసలు మూసీ బాగు కోసం చూస్తున్నారా? లేక మూసీ వెంట విస్తరించి ఉన్న భూముల కోసం పనిచేస్తున్నారా?
> -కేటీఆర్

ఇచ్చిన హామీలకు పైసల్లేవు

ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయలేని సీఎం రేవంత్‌రెడ్డి... అందాల పోటీలకు వందల కోట్లు, ఫుట్‌బాల్ కోసం రూ.200 కోట్లు ఖర్చు చేశారని కేటీఆర్ విమర్శించారు. హామీలు అమలు చేసేందుకు రూపాయి పుట్టడంలేదని, అప్పు కోసం పోతే దొంగల్లా చూస్తున్నారని చెప్పిన రేవంత్‌రెడ్డి సర్కార్కు... మూసీ సుందరీకరణ కోసం లక్షల కోట్ల నిధులు ఎట్లా వస్తాయని ప్రశ్నించారు. పేదల భూములను తీసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి... వారికి పరిహారం ఎక్కడి నుంచి ఇస్తారని నిలదీశారు.

కేసీఆర్ పాలనలోనే వరల్డ్ క్లాస్ డిజైన్లు

కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే మూసీ ప్రక్షాళనకు ప్రత్యేక చొరవ తీసుకున్నారని, ఈ నదిపై ఇన్నాళ్లు జరిగిన దోపిడీని నిలువరించేలా, ప్రణాళికాబద్ధమైన విధానంతో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని కేటీఆర్ వివరించారు. దీనికి ప్రత్యేక నిధులు కేటాయించి, అసలు మూసీ నదిని ఎలా డెవలప్ చేయాలనే నిర్మాణాత్మకమైన ఆలోచనతో బీఆర్ఎస్ అడుగులు వేసిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నదీ పరీవాహక ప్రాంతాలను సందర్శించి, అక్కడ జరిగిన అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని, ఒక ప్రత్యేక విధివిధానాలతో మూసీ పునరుజ్జీవానికి బీజం వేశామని తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రాజెక్ట్ డిజైన్ సంస్థలను గ్లోబల్ టెండర్ల ద్వారా ఆహ్వానించి, అత్యుత్తమ డిజైన్లను ఎంపిక చేశామని పేర్కొన్నారు. సుదీర్ఘ చర్చలు, అధ్యయనాల తర్వాత... మూసీ నది జలావరణం దెబ్బతినకుండా, మూసీ రివర్ బెడ్‌లో ఉండే నిర్మాణాలకు తప్ప.. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉండే ఏ ఒక్క ఇంటికీ ఇబ్బంది లేకుండా గ్లోబల్ డిజైన్లు తయారు చేశామని చెప్పారు. మూసీపై 15 చెక్‌డ్యాములు, బ్రిడ్జిలు, రిక్రియేషనల్ జోన్లు, 57 కిలోమీటర్ల పొడవునా ఉండే ఎక్స్‌ప్రెస్ వేలూ, వాకింగ్ ట్రాక్‌లు, మురుగునీరు చేరకుండా మూసీ పార్కులతో పొందుపరిచామని వివరించారు. నాగోల్-ఉప్పల్ మార్గంలో 5 కిలోమీటర్ల పొడువున రూ.6 కోట్లతో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన మూసీ సుందరీకణలో భాగంగా కూలగొట్టే పరిస్థితి వస్తే ముందుగా నాగోల్-ఉప్పల్ మధ్యన 5 కిలోమీటర్ల మేర పైలట్ ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ఒకనొక సందర్భంలో పేదోడి ఇంటికి నష్టం లేని డిజైన్లు రూపొందించాలని, లేదంటే ఆ మూసీ అభివృద్ధి పేరిట విధ్వంసం చేయాల్సిన అవసరం లేదని కేసీఆర్ అప్పట్లోనే స్పష్టం చేశారని పేర్కొన్నారు. 'మురుగు నీటి శుద్ధికి రూ.4వేల కోట్లతో 31 సీవరేజ్ ప్లాంట్లు నిర్మించాం. రూ.543 కోట్లతో 15 బ్రిడ్జిల కిందనే చెక్ డ్యామ్‌లూ నిర్మించేలా చర్యలు తీసుకున్నాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా రూ.16,634 కోట్ల అంచనా వ్యయంతో 2016-17లో మూసీ పునరుజ్జీవానికి పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాం. మంచిరేవుల నుంచి ఓఆర్ఆర్ వరకు 57 కిలోమీటర్ల మేర ఎక్స్‌ప్రెస్ వేలను ఒక్క ఇంటిని కూడా కూల్చకుండానే నిర్మించే డిజైన్లు బీఆర్ఎస్ రూపొందించింది' అని కేటీఆర్ వివరించారు.



ఒక్క ఇంటినీ కూల్చకుండానే ముంపు నివారణ

మూసీ పేరిట 10 వేల నిర్మాణాలను కూల్చివేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నారని, కానీ, కేసీఆర్ పాలనలో ఒక్క ఇటుక కూడా కదల్చకుండానే మూసీ సుందరీకరణ, నాలాల అభివృద్ధి చేశామని కేటీఆర్ వివరించారు. ఒక్క ఇంటిని కూడా కూల్చకుండానే ముషీరాబాద్ నియోజకవర్గంలో 400 కుటుంబాలను వరద ముంపు నుంచి బయటపడేశామని తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో, నాలాల వెంబడి భారీ రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించడంతో ఏ ఒక్క ఇంటికీ వరద ముంపు లేదని పేర్కొన్నారు. నగరంలో 13 కాలనీలను వరద ముంపు నుంచి బయటపడేసిన ఎస్ఎన్‌డీపీ రెండో దశను రద్దు చేసి, మూసీ పేరిట రూ.లక్షల కోట్లు దోచుకునే రియల్‌ఎస్టేట్ వ్యాపారాన్ని అడ్డుకుంటామని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ చేసిన సుందరీకరణలో చుక్క మురుగు నీరు కూడా మూసీలో కలిసే అవకాశం లేదని, నగరంలో నిత్యం ఉత్పత్తయ్యే రెండు వేల ఎంఎల్‌డీల మురుగు నీటిని శుద్ధి చేసుకునేలా, నాలాలు, మూసీ వెంబడి ఎస్టీపీలను నిర్మించామని వివరించారు. వాటిని పూర్తి చేయకుండా వేల కోట్ల భూముల కోసం మూసీ సుందరీకరణ అంటే సహించేది లేదని హెచ్చరించారు.

> మూసీకి రూ.16,634 కోట్లతో పునరుజ్జీవం పోసేలా కేసీఆర్ పనులు చేపట్టి.. కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యిలా రేవంత్‌రెడ్డి చేతిలో పెడితే.. ఆయన మాత్రం తొలి దశలోనే 3,320 ఎకరాల భూముల స్వాధీనం చేసుకుంటున్నడు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎవరి కొంపలు కూల్చాలని చూస్తున్నడు?
> -కేటీఆర్



బీఆర్ఎస్ హయాంలో వివిధ ప్రాంతాల్లో మూసీపై నిర్మించిన ఎస్టీపీలు

రెడ్డికుంట ఎఫ్‌టీఎల్‌లో ఉన్న రేవంత్ ఇంటి సంగతేమిటి?

'దశాబ్దాల కిందట కట్టుకున్న ఇండ్లను... సీఎం రేవంత్‌రెడ్డి బఫర్ జోన్లో ఉన్నాయంటూ కూల్చే ప్రయత్నం చేస్తున్నారు. మరి, కోస్గి మండల కేంద్రంలోని రెడ్డికుంట ఎఫ్‌టీఎల్‌లో ఆయన నిర్మించిన సొంత ఇంటి సంగతేమిటి? సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి సొంతిల్లు దుర్గం చెరువులో ఉన్నది వాస్తవం కాదా? జంట జలాశయాల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో విస్తరించి ఉన్న మంత్రి పొంగులేటి ఫామ్‌హౌస్, మంత్రి గడ్డం వివేక్, పట్నం మహేందర్‌రెడ్డి కట్టుకున్న ఇండ్ల సంగతేమిటి?' అని కేటీఆర్ ప్రశ్నించారు. నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉండే అమీన్‌పూర్ చెరువు శిఖంలో వందలాది ఇండ్లు ఉన్నాయంటూ రాత్రికిరాత్రే కూలగొట్టిన హైడ్రా... దుర్గం చెరువులో కట్టుకున్న తిరుపతిరెడ్డి ఇంటిని కూలగొట్టే దమ్ముందా? అని ప్రశ్నించారు. 20 ఏండ్ల కిందట కట్టుకున్న మధుపార్క్ రిడ్జ్ భవనాన్ని కూల్చివేసి, వందలాది మంది జీవితాలను మూసీలో కలిపే కుట్రలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా మూసీ వెంబడి నిర్మించిన ఫామ్‌హౌస్‌లు, ప్యాలెస్‌లను కూలగొట్టాలని సవాల్ చేశారు.

> మూసీ పరీవాహకంలోని బస్తీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల భూములకు జీరోవాల్యూ అని నిర్వాసితులను రేవంత్‌రెడ్డి భయభ్రాంతులకు గురిచేస్తున్నడు. పాకిస్థాన్ నిషేధించిన ఓ కంపెనీకి మూసీ డిజైన్లు తయారు చేసే కాంట్రాక్టు కట్టబెట్టి ఏకంగా రూ.160 కోట్లు ముట్టజెప్పిండు. అసలు రేవంత్‌రెడ్డి మాటలకే వాల్యూలేదు.
> -కేటీఆర్

55 కిలోమీటర్ల మూసీకి లక్షన్నర కోట్లా?

రెండు వేల కిలోమీటర్ల మేర ప్రవహించే గంగా నది ప్రక్షాళనకు 'నమామి గంగే' ప్రాజెక్టు కింద రూ.42వేలు కోట్లు ఖర్చుపెడితే... 55 కిలోమీటర్ల పొడవున మూసీ సుందరీకరణకు రూ.లక్షన్నర కోట్లు ఎలా ఖర్చు చేస్తారని కేటీఆర్ ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు మొత్తానికి రూ.16,634 కోట్లతో పునరుజ్జీవం పోసేలా కేసీఆర్ ప్రణాళికలు సిద్ధం చేస్తే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తొలి దశలోనే 3,320 ఎకరాల భూముల స్వాధీనం, లక్షన్నర కోట్లు ఖర్చు చేసే ప్రణాళికలతో ఎవరి కొంపలు కూల్చాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. మూసీ బాధితులు లేకుండా, కేవలం వైట్‌కాలర్ ప్రతినిధులు, రియల్‌ఎస్టేట్ వ్యాపార వేదిక తరహాలో ఫైవ్‌స్టార్ హోటళ్లలో మూసీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి... అసలు మూసీ కోసం చేస్తున్నారా? లేక మూసీ వెంబడి విస్తరించి ఉన్న భూముల కోసం పనిచేస్తున్నారా? అనే విషయం ఇప్పటికీ అంతు చిక్కడం లేదని దుయ్యబట్టారు. మేధాపాట్కర్ లాంటి మేధావులు, మహాత్మా గాంధీ మునిమనుమడైన తుషార్‌గాంధీ లాంటి వ్యక్తులే మూసీ పేరిట జరుగబోయే విధ్వంసానికి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే, గాంధీజీ విగ్రహాన్ని పెట్టి రూ.లక్షల కోట్ల విలువ చేసే భూములు, లక్షలాది కుటుంబాలను రోడ్డునపడేసే కుట్రలకు రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నారని విమర్శించారు.

జీరోవాల్యూ పేరిట... లక్షన్నర కోట్లకు గురి!

మూసీ నదికి దశల వారీగా పునరుజ్జీవం కల్పిస్తామంటూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించిన సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం వేరే ఉన్నదని కేటీఆర్ విమర్శించారు. మొదటి ఫేజ్‌లోనే 22 కిలోమీటర్ల పరిధిలో 3,320 ఎకరాలను స్వాధీనం చేసుకునే పనిలో ఉన్నారని తెలిపారు. ఎకరం రూ.50 కోట్ల చొప్పున 3,320 ఎకరాల భూముల విలువ రూ.లక్షన్నర కోట్లు దాటుతుందని, అందుకే బస్తీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల భూములను జీరో వాల్యూ పేరిట భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని మండిపడ్డారు. పాకిస్తాన్ నిషేధించిన ఓ కంపెనీకి మూసీ డిజైన్లను కట్టబెట్టి రూ.160 కోట్లు ఖర్చు చేసిన రేవంత్‌రెడ్డి... మూసీ ప్రాజెక్టు ద్వారా వేల కోట్లు సంపాదించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. గోదావరి నీళ్లను నగరానికి తరలించేందుకు 2023లోనే బీఆర్ఎస్ క్యాబినెట్ రూ.1,100 కోట్లకు ఆమోదం తెలిపితే... అదే ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని పదింతలు పెంచి రూ.10వేల కోట్ల దోపిడీకి కాంగ్రెస్ సర్కార్ ప్లాన్ చేస్తున్నదని దుయ్యబట్టారు. మూసీ పునరుజ్జీవానికి తాము వ్యతిరేకం కాదని, కేవలం రేవంత్‌రెడ్డి దోపిడీ ఆలోచన విధానాలను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టంచేశారు. మూసీ వెంబడి ఉన్న ఆస్తులకు జీరో వాల్యూ ఉన్నదంటున్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలకే విలువ లేదని ఎద్దేవా చేశారు. అమాంతం నిర్మాణ వ్యయాన్ని ఎందుకు పెంచారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

టీడీఆర్ అంటేనే తిరుపతిరెడ్డి!

మూసీ పరీవాహక ప్రాంతంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం ఇస్తామంటున్న సీఎం రేవంత్‌రెడ్డి... కనీసం భూసేకరణ చట్టం-2013 గురించి ముందుకు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. కోల్పోతున్న భూములకు ఏ విధంగా పరిహారం ఇవ్వాలో కూడా తెలియని ముఖ్యమంత్రి, మూసీ పరిహారంగా టీడీఆర్ ఇస్తామంటున్నారని మండిపడ్డారు. టీడీఆర్‌కు ఎలాంటి విలువ లేకుండా చేసిన కాంగ్రెస్ సర్కార్... తిరుపతిరెడ్డి వద్దనున్న టీడీఆర్‌లకు మాత్రమే విలువ ఉన్నదని, ఇప్పుడు టీడీఆర్ అంటేనే తిరుపతిరెడ్డి అనే చందంగా పరిస్థితి మారిందని ఎద్దేవా చేశారు. డీపీఆర్ లేకుండా, పర్యావరణంపై ప్రభావం అంచనాలు లేకుండా ఏవిధంగా మూసీకి పరిహారాన్ని చెల్లిస్తారని ప్రశ్నించారు. మీరిచ్చే టీడీఆర్‌లకు ఆయన సోదరుడి చేతికి వచ్చేంత వరకూ విలువ రాదని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్ వాళ్లను విభజిస్తూ... కొంతమందికి పక్కనే ఏడెకరాల్లో అద్భుతమైన భవనాన్ని నిర్మించి ఇస్తామంటున్న సీఎం రేవంత్‌రెడ్డి... మూసీ వెంబడి భూములు, ఇండ్లు కోల్పోతున్న మిగతావారికి అదే పరిహారం ఇస్తారా? అని ప్రశ్నించారు. పేదల ఇంటిని కూల్చబోమని చెప్తూనే, 500 మీటర్ల దూరంలోని ఇండ్లు, బస్తీలకు ఎందుకు రెడ్‌మార్క్ వేశారని ప్రశ్నించారు.

అభివృద్ధి అంటే కూల్చివేతలా?

బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి నమూనాతో పరిపాలిస్తే, కాంగ్రెస్ మాత్రం విధ్వంస నమూనాతో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ పేరిట బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని, కాంగ్రెస్ సృష్టించిన విధ్వంసాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు.

బీఆర్ఎస్ అభివృద్ధి నమూనా

1. మూసీని సుందరీకరించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.16,634 కోట్ల అంచనాతో ప్రారంభించింది.
2. మూసీ మురుగును పారదోలి, పూర్తిగా పునరుద్ధరించి గత వైభవం తీసుకొచ్చేలా ప్రణాళికలు రచించింది.
3. మూసీ ప్రాజెక్టులకు ప్రపంచ స్థాయి డిజైన్లతో పనులు మొదలు పెట్టింది.
4. పరీవాహక ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా, ఏ ఇంటినీ కూల్చకుండా సుందరీకరించాలనేది కేసీఆర్ పాలసీ
5. బీఆర్ఎస్ సర్కార్ పక్కా ప్రణాళిక ప్రకారం, పకడ్బందీ వ్యూహంతో ప్రతిపాదనలు చేసి అనురించింది.

కాంగ్రెస్ విధ్వంస మాడల్

1. కాంగెస్ సర్కార్ మూసీ సుందరీకరణ బడ్జెట్‌ను రూ.లక్షన్నర కోట్లకు పెంచింది.
2. మూసీ సుందరీకరణను రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టుగా మార్చేసింది. రివర్ ఫ్రంట్‌ను ఒక ల్యాండ్ బ్యాంకుగా చూస్తున్నది.
3. బ్లాక్ లిస్టులో ఉన్న మెయిన్‌హర్డ్ట్ అనే డిజైనింగ్ కంపెనీకి కట్టబెట్టి రూ.160 కోట్లు కేటాయించింది.
4. దాదాపు లక్ష నిర్మాణాల కూల్చివేతలు, వేల మంది నిర్వాసితులను చేస్తున్నది.
5. డీపీఆర్, ప్రజాభిప్రాయం లేవు, సామాజిక దృక్పథం లేకుండా చేస్తున్నది.

గాంధీ బొమ్మతో గోల్‌మాల్

గాంధీ వారసులు, మేధావులు వ్యతిరేకిస్తున్న మూసీ ప్రాజెక్టును గాంధీ విగ్రహం పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి గోల్‌మాల్ చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మధుపార్క్ రిడ్జ్ బఫర్ జోన్‌లో ఉంటే, మరీ గాంధీ సరోవర్‌ను ఎక్కడ కడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ కట్టే నిర్మాణాలకు బఫర్ జోన్ నిబంధనలు వర్తించవా? ఒక్క ఇంటిని కూడా కట్టని రేవంత్‌రెడ్డి వేల ఇండ్లను కూల్చి, లక్షలాది మందిని ఎలా రోడ్డునపడేస్తారని ప్రశ్నించారు. మూసీ విషయంలో ఐక్యంగా ఉంటేనే రేవంత్ ఆగడాలకు కళ్లెం పడుతుందని చెప్పారు. రెండేండ్లు ఓపిక పట్టి, బుల్డోజర్ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత వచ్చే బీఆర్ఎస్ సర్కార్ మీ ఇంటి మీద ఉన్న సున్నాన్ని కూడా ముట్టుకోకుండా మూసీ సుందరీకరణ చేసి చూపిస్తుందని చెప్పారు.


> దశాబ్దాల కింద కట్టుకున్న ఇండ్లను ఇప్పుడొచ్చిన రేవంత్‌రెడ్డి బఫర్‌జోన్‌లో ఉన్నాయని కూల్చే ప్రయత్నం చేస్తున్నడు. మరి కోస్గిలోని రెడ్డి కుంట ఎఫ్‌టీఎల్‌లో రేవంత్‌రెడ్డి సొంతిల్లు సంగతేంది? రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు దుర్గం చెరువులో ఉన్నది వాస్తవం కాదా? జంట జలాశయాల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న పొంగులేటి ఫామ్ హౌస్, మంత్రి గడ్డం వివేక్, పట్నం మహేందర్ రెడ్డి కట్టుకున్న ఇండ్ల సంగతేంది?
> -కేటీఆర్

ప్రజలను రోడ్డున పడేయడమే అభివృద్ధా?



ప్రజలను రోడ్డున పడేసి పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలనుకుంటారా? ప్రజల జీవితాల కంటే ప్రభుత్వానికి టూరిజమే ముఖ్యమా? ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ప్రాజెక్టులు కడతామనడం ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నాం. డీపీఆర్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పెడుతున్నామంటే, మాకు ఏమైనా భరోసా కల్పించేలా సీఎం మాట్లాడుతారని ఆశగా ఎదురుచూశాం. కానీ, ఏఐ గ్రాఫిక్స్ చూపించి, మా ఇండ్లు, స్థలాలకు జీరో వాల్యూ మాత్రమేనని చెప్పి వెళ్లిపోయారు. వేల మంది ప్రజలు రోడ్డున పడ్డా పర్వాలేదు, తాము అనుకున్నదే చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నారు. **-రమ్య, మూసీ బాధితురాలు**

విలువ లేని టీడీఆర్‌లను ఏం చేసుకోవాలి?



కష్టపడి పైసాపైసా కూడబెట్టుకుని అన్ని అనుమతులతో ఇండ్లు కట్టుకుంటే కూల్చేసి టీడీఆర్ ఇస్తామంటున్నారు. టీడీఆర్ పేరుతో ఒక సర్టిఫికెట్ ఇస్తే దాన్ని మేం ఏం చేసుకోవాలి? రూ.కోటి విలువైన టీడీఆర్‌కు రూ.10 లక్షలు కూడా రావడం లేదు. మేం అన్ని అనుమతులతో కట్టుకున్న ఇండ్లను కూల్చి ఒక పేపరు చేతిలో పెడితే దాన్ని అమ్ముకోవడానికి మేం ఎక్కడ తిరగాలి. 2016లో పట్టా భూముల్లో మేం అన్ని అనుమతులు పొంది విల్లా కొనుక్కున్నాం. ఇప్పుడు వచ్చి దాని స్థానంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామంటే మేం ఎక్కడికి పోవాలి? ఇచ్చే పరిహారం గురించి ఒక్కమాట కూడా మాట్లాడకుండా సీఎం వెళ్లారు. **-శరత్‌బాబు, సైంటిస్ట్, రిచ్‌మండ్ విల్లాస్**


శనివారం హిమాయత్ సాగర్‌లో జరిగిన కేటీఆర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, నగర వాసులు, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు

అమ్మకానికి గ్రేహౌండ్స్ భూములు!

ఆ విభాగాన్నే మూసివేసే దిశగా ప్రతిపాదనలు • గ్రేహౌండ్స్ అధీనంలో 550 ఎకరాల భూమి

- వీటిని అమ్మే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- 20వేల కోట్లకుపైగా నిధులు వస్తాయని అంచనా
- ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్న అధికారులు



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): నక్సలైట్ల ఏరివేతలో అత్యంత కీలకపాత్ర పోషించిన గ్రేహౌండ్స్ విభాగాన్ని మూసివేయాలని ప్రభుత్వం భావిస్తున్నదా? గ్రౌహౌండ్స్ ఆధీనంలో ఉన్న 550 ఎకరాల భూములను అమ్మకానికి పెట్టాలని నిర్ణయించిందా? ఈ ప్రశ్నలకు అవును అనే సమాధానమే వస్తున్నది. దేశంలో ఈ నెలాఖరుకు (మార్చి 31 డెడ్‌లైన్) నాటికి మావోయిస్టులను సంపూర్ణంగా నిర్మూలించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆ లక్ష్యాన్ని దాదాపు పూర్తి చేసింది. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో పలువురు కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో చనిపోవడం, మరి కొందరు అగ్రనేతలు లొంగిపోవడంతో మావోయిస్టు పార్టీ దాదాపు ఉనికి కోల్పోయే స్థితికి చేరుకున్నది. ఈ నేపథ్యంలో మావోయిస్టుల కదలికలను కట్టడి చేసేందుకు ఏర్పాటు చేసిన గ్రేహౌండ్స్ దళాలతో పనిలేదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న వారిని పోలీసు శాఖలోని ఇతర విభాగాల్లోకి బదిలీ చేయాలని, గ్రేహౌండ్స్‌కు కేటాయించిన భూములను ఇతర అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఆ భూములను అమ్మేస్తే ప్రభుత్వానికి భారీ మొత్తంలో నిధులు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్న ప్రభుత్వం.. ఆ మేరకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు.. గ్రేహౌండ్స్‌కు రాష్ట్రంలో ఎక్కడెక్కడ భూములున్నాయి? వాటిలో విలువైన భూములు ఎక్కడ ఉన్నాయనే అంశంపై దృష్టిపెట్టారు. గ్రేహౌండ్స్‌కు హైదరాబాద్ చుట్టుపక్కల అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో మొత్తం 550 ఎకరాల భూమి ఉన్నదని అధికారులు గుర్తించారు. ఈ భూముల విలువ ఇప్పుడు కొన్నివేల కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు చెప్తున్నారు. సగటున రూ.50 కోట్లకు ఎకరం చొప్పున అమ్మినా రూ.20 వేల కోట్లకుపైగా ప్రభుత్వానికి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇందులో కొంత భూమిని ప్రభుత్వం ఉంచుకున్నా, కనీసం 500 ఎకరాల భూమిని సులువుగా అమ్ముకోవడానికి అనుకూలంగా ఉన్నదని అధికారులు చెప్తున్నారు. ఈ లెక్కన రూ.20 వేల కోట్లు సమకూరుతాయని భావిస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియను వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొదలుపెట్టాలని, ఒక ఏడాదిలోపు మొత్తం అమ్మేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

1989లో గ్రేహౌండ్స్ ఆవిర్భావం

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పీపుల్స్‌వార్ ప్రస్తుత మావోయిస్టుల ప్రాబల్యాన్ని అడ్డుకొనేందుకు ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చొరవతో 1989లో గ్రౌహౌండ్స్ దళాన్ని ఏర్పాటు చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి కేఎస్ వ్యాస్ గ్రేహౌండ్స్ విభాగానికి రూపకల్పన చేశారు. గ్రేహౌండ్స్ దళాలకు శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్ శివారులోని ప్రేమావతిపేటలో సుమారు 150 ఎకరాల్లో శిక్షణ కేంద్రం ఏర్పాటుచేశారు. దీంతోపాటు మరో శిక్షణ కేంద్రం, పరిపాలనా కేంద్రం మంచిరేవులలో సుమారు 400 ఎకరాల్లో విస్తరించి ఉన్నది. నిరంతరం ఇక్కడ పోలీసులకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. 1989 నుంచి ఇప్పటివరకు వేలాది మంది పోలీసులు గ్రేహౌండ్స్‌లో శిక్షణ పొందారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో జరిగిన అనేక కూంబింగ్ ఆపరేషన్లలో గ్రేహౌండ్స్ దళాలు పాల్గొన్నాయి.

మావోయిస్టులు లేనందున మూసేద్దాం!

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న డెడ్‌లైన్ ప్రకారం దేశవ్యాప్తంగా మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమం దాదాపు విజయవంతమైన నేపథ్యంలో ఇంకా గ్రేహౌండ్స్‌తో పని ఏమిటని పోలీసు అధికారులను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ప్రశ్నించారని తెలిసింది. గ్రేహౌండ్స్ పార్టీలు ఇప్పుడు పెద్దగా కూంబింగ్ కూడా చేయడంలేదని, ఇక వీరితో పని ఉండదని, మొత్తానికి మొత్తం గ్రేహౌండ్స్ విభాగాన్ని ఎత్తేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందని సమాచారం. ఇప్పుడు సుమారు పన్నెండు వందల మందికిపైగా ఉన్న సిబ్బందిని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, ఏఆర్, సివిల్ తదితర విభాగాలకు పంపించివేస్తున్నారు. చాలామంది కానిస్టేబుళ్లు, ఇతర అధికారులను పోలీసు శాఖలోని వివిధ విభాగాల నుంచి గ్రేహౌండ్స్‌కు గతంలో పంపించారు. అలాంటివారిని వారివారి మాతృవిభాగాలకు పంపించివేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

విభాగాన్ని మూసేయొద్దు

గతంలో గ్రేహౌండ్స్‌లో పనిచేసిన అధికారులు, సిబ్బంది మాత్రం గ్రేహౌండ్స్‌ను పూర్తిగా మూసివేయొద్దని ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రేహౌండ్స్‌ను పోలీసు అధికారులు తీర్చిదిద్దారని, దేశంలోనే తెలంగాణ గ్రేహౌండ్స్‌కు మంచి పేరున్నదని, అలాంటిది ఇప్పుడు మావోయిస్టులు లేరన్న పేరుతో ఇప్పటికిప్పుడు తీసివేయడం తగదని చెప్తున్నారు. ఇదే గ్రేహౌండ్స్‌ను మరో విధంగా వాడుకోవచ్చని, దీనిపై ప్రభుత్వ స్థాయిలో చర్చ జరగాలని భావిస్తున్నారు. అంతేకాకుండా, గ్రౌహౌండ్స్‌కు ఉన్న విలువైన భూమిని ప్రైవేట్‌పరం చేయొద్దని, భవిష్యత్‌లో పోలీసు అవసరాలకు భూమి దొరకడం కష్టమని, దీనిని పోలీసు శాఖకు సంబంధించిన భవిష్యత్ అవసరాలకు ఉపయోగిస్తే మంచిదని, ఇతరత్ర శిక్షణ కార్యక్రమాలను ఇక్కడ నిర్వహించాలని సూచిస్తున్నారు.



శనివారం తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావును ఎర్రవెల్లి నివాసంలో కలిసి, ఆయన ఆశీర్వాదం తీసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి.

ఆర్‌అండ్‌బీ ఆశలు ఈసారైనా తీరేనా?

- బడ్జెట్‌లో భారీగా నిధులు కోరుతూ ప్రతిపాదనలు
- ట్రిపుల్ ఆర్, హ్యామ్ రోడ్లకు నిధులివ్వాలని వినతి
- గతంలో పావు వంతు కూడా విడుదల చేయని సర్కార్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బడ్జెట్ అనగానే నిధుల కోసం వివిధ శాఖల అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం, వాటిలో కొన్ని ప్రాజెక్టులకు సర్కార్ నిధులు కేటాయించడం, ఆ తర్వాత ఆ నిధులు విడుదల చేయకపోవడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలోనే వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్), హైబ్రిడ్ యాన్యుటీ మాడల్ (హ్యామ్) రోడ్ల ప్రాజెక్టుకు, గ్రామీణ రోడ్లు, భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆర్‌అండ్‌బీ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. కానీ, గత అనుభవాల దృష్ట్యా ఆ శాఖకు ఈసారైనా నిధులు విడుదలవుతాయా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలో దాదాపు 90% వరకు భూసేకరణ పూర్తయినట్టు ప్రభుత్వం చెప్తున్నప్పటికీ ఇంతవరకు రైతులకు నష్టపరిహారం చెల్లించలేదు. ఈ చెల్లింపులకు రాష్ట్ర వాటా కింద రూ.2 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేసిన ఆర్‌అండ్‌బీ శాఖ.. బడ్జెట్‌లో ఈ నిధులు కేటాయించాలని కోరింది. వీటితోపాటు హ్యామ్ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేసే రోడ్లకు రూ.3 వేల కోట్లు, గ్రామీణ రోడ్లకు రూ.480 కోట్లు, భవనాల నిర్మాణానికి రూ.650 కోట్లు, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర వాటా కింద రూ.320 కోట్లు, సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్‌ఐఎఫ్) కింద రూ.600 కోట్లు, రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టే పనులకు రూ.800 కోట్లు కేటాయించాలని, ప్లాన్, నాన్-ప్లాన్ గ్రాంట్ల కింద రూ.5 వేల కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. కాంగ్రెస్ సర్కార్ నిరుడు 2025-26 బడ్జెట్‌లో ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.5,907 కోట్లు కేటాయించినప్పటికీ అందులో కనీసం రూ.1,000 కోట్లు కూడా విడుదల చేయలేదు. దీంతో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని రోడ్లను పటిష్టపర్చడం, వాటిని విస్తరించడం, కొత్త బ్రిడ్జీలు, రోడ్ల నిర్మాణం, సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేయడం, ట్రిపుల్‌ఆర్‌కు సంబంధించిన భూసేకరణ, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రోడ్ల అభివృద్ధి చేయడం లాంటి ప్రాజెక్టుల్లో ఏ ఒక్కటీ పూర్తికాలేదు. కనీసం వర్షాకాలంలో పాడైపోయిన రోడ్ల మరమ్మతులకు కూడా రేవంత్‌రెడ్డి సర్కార్ నిధులు విడుదల చేయలేదని అధికార వర్గాలు చెప్తున్నాయి.

‘ఎల్పీజీ సరఫరా’పై కమాండ్ కంట్రోల్ సెంటర్

అందుబాటులోకి 1967 టోల్‌ఫ్రీ నంబర్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ఎల్పీజీ సరఫరాలో అనిశ్చితి నేపథ్యంలో రాష్ట్రంలో 24/7 ‘మల్టీ ఏజెన్సీ కమాండ్ కంట్రోల్ సెంటర్’ను శనివారం సివిల్ సప్లై శాఖ ఏర్పాటుచేసినట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. సరఫరాలోని ఇబ్బందులు గుర్తించేందుకు 1967 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా గ్యాస్ సరఫరాను ఈ కేంద్రం పర్యవేక్షిస్తుందని, సరఫరాలో ఉన్న అడ్డంకులను గుర్తించి సమస్యలను పరిష్కరించనున్నట్టు తెలిపారు. రవాణా, లాజిస్టిక్స్, అందుబాటులో ఉన్న గ్యాస్ సిలిండర్ల నిల్వను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో పారదర్శకత కోసం చమురు కంపెనీలు వెంటనే జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థలను అందుబాటులోకి తేవాలని కోరారు. సరఫరాలో ఇబ్బందులను అధిగమించేందుకు ఇండియన్ ఆయిల్ (ఐవోసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం(హెచ్‌పీసీఎల్) ప్రతినిధులు, పోలీసులు, పరిశ్రమలు, పంపిణీదారులు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిరంతరం అందుబాటులో ఉండి పర్యవేక్షించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి14 (నమస్తే తెలంగాణ): ఎల్పీజీ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. సచివాలయంలో ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్‌తో శనివారం ఆయన ప్రత్యేక భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్‌కు వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందస్తు భయాందోళనతోనే బుకింగ్స్ రెట్టింపయ్యాయని తెలిపారు. పౌరసరఫరాల శాఖ భవన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటు, ఫిర్యాదుల స్వీకరణకు1800-428-00-333 టోల్ ఫ్రీ నంబర్, పరిస్థితుల పర్యవేక్షణకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. కమర్షియల్ సిలిండర్ల సరఫరా 20 శాతానికే అందుతున్నదని, గృహ వినియోగదారులకు సరఫరా నిలకడగా సాగేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

అదనంగా కమర్షియల్ సిలిండర్లు ఇవ్వండి

రాష్ట్రానికి అదనంగా కమర్షియల్ సిలిండర్లు కేటాయించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం శనివారం లేఖ రాసింది. డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్‌కు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. బ్లాక్ మార్కెట్‌కు సిలిండర్లను తరలిస్తే సహించేది లేదని పేర్కొన్నది.



గ్యాస్ కొరతను అరికట్టాలని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం కార్యకర్తలు

గ్యాస్ ధరల పెంపుపై రేపు సీపీఐ నిరసన

హైదరాబాద్, మార్చి 14 (నమస్తేతెలంగాణ): గ్యాస్ సిలిండర్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. యుద్ధంతోపాటు కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే సిలిండర్ ధరలు పెరిగాయని ఆరోపించారు. ధరల పెరుగుదలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం స్పందించి గ్యాస్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆదిలాబాద్‌లోని గ్యాస్ ఏజెన్సీ వద్ద ఖాళీ సిలిండర్లతో క్యూలో నిల్చున్న వినియోగదారులు

గ్యాస్ బండ కష్టాలు

- సిలిండర్ల కోసం ఎదురుచూపులు
- ఏజెన్సీల చుట్టూ కష్టమర్ల ప్రదక్షిణలు
- హోటళ్లలో కట్టెల పొయ్యిల దర్శనం

జడ్చర్ల టౌన్/మూసాపేట/భూత్పూరు/ ఆదిలాబాద్, మార్చి 14(నమస్తే తెలంగాణ) : పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో చిరు వ్యాపారస్తులు గ్యాస్ సిలిండర్లు అందక అవస్థలు పడుతున్నారు. ఏజెన్సీల వద్ద వినియోగదారులు బారులుతీరుతున్నారు. జడ్చర్లలో సర్వర్ సమస్య ఉందంటూ ఏజెన్సీ నిర్వాహకులు చెప్పడంతో గ్యాస్ కోసం నిరీక్షిస్తున్నారు. గోదాంలో నిల్వలు ఉన్నా.. బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు స్టాక్ లేదంటూ చెబుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూత్పూరు గ్యాస్ ఏజెన్సీ వద్ద నో స్టాక్ బోర్డు దర్శనమిచ్చింది. భూత్పూర్ చౌరస్తాలో నిత్యం రద్దీగా ఉండే టిఫిన్ సెంటర్లు గ్యాస్ కొరతతో శనివారం మూత పడ్డాయి. హోటళ్లు, దాబాల్లో నిత్యం వండటానికి కమర్షియల్ సిలిండర్ల కొరత ఉండటంతో కట్టెల పొయ్యిల మీద వంట చేయాల్సి పరిస్థితి ఏర్పడిందని నిర్వాహకులు వాపోతున్నారు. మూసాపేట మండలం సంకలమద్ది వద్ద హైవే-44పై లక్ష్మమ్మ, ఆమె కూతురు చిన్నపాటి చాయ్, బజ్జీ హోటల్ నిర్వహిస్తున్నారు. గ్యాస్ కొరతతో చేసేది లేక కట్టెల పొయ్యిపై వండుతున్నారు. హాస్టళ్లు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ గ్యాస్ సమస్య నెలకొన్నది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి ఏజెన్సీ కేంద్రం వద్ద వినియోగదారులు బారులుదీరారు. స్టాక్ లేకపోవడంతో నిర్వాహకులు బుక్ చేసుకున్న వారికి రసీదులు ఇచ్చి స్టాక్ వచ్చిన తర్వాత సిలిండర్‌లు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వినియోగదారులు చేసేదేమీ లేక ఖాళీ సిలిండర్లతో వెనుదిరిగారు.



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరులో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద షెట్టర్లకు అంటించిన నోస్టాక్ బోర్డు

మనకేదీ విద్యుత్తు సబ్సిడీ



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశంలో గ్యాస్ కొరత తీవ్రమైన నేపథ్యంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్‌కు ముందుచూపు కరువయ్యిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు రాష్ట్రం ప్రత్యామ్నాయాల దిశగా ఆలోచించడంలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్యాస్ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు మన పక్క రాష్ట్రం తమిళనాడు విద్యుత్తు సబ్సిడీని ప్రకటించింది. యూనిట్‌కు రూ.2 చొప్పున రాయితీనిస్తున్నట్టు ప్రకటించింది. రెస్టారెంట్లు, హోటళ్లు, టీ షాప్‌లకు ఈ విద్యుత్తు రాయితీ వర్తిస్తుందని తమిళనాడు తెలిపింది. ఇదే తరహాలో మన దగ్గర సైతం గ్యాస్ సబ్సిడీ ఇవ్వాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. గ్యాస్ సరఫరా చేయలేక చేతులెత్తేసిన సర్కార్.. కనీసం విద్యుత్తు సబ్సిడీ ఇచ్చి అయినా ఈ సంక్షోభం నుంచి బయటపడేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో తమిళనాడులో రాయితీ

యూనిట్‌కు రూ.2 సబ్సిడీ ఇస్తున్నట్టు ప్రకటించిన స్టాలిన్

మన దగ్గర సబ్సిడీ కోసం పెరుగుతున్న డిమాండ్లు

పెరుగుతున్న వాడకం..

గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లతోపాటు కమర్షియల్ వినియోగదారులు ఎలక్ట్రిక్ స్టౌలను ఆశ్రయిస్తున్నారు. సాధారణ ప్రజలు సైతం ప్రత్యామ్నాయం వైపు మొగ్గు చూపుతున్నారు. ఇండక్షన్ స్టౌలను వాడుతున్నారు. గతంలో నెలకు 1.8 లక్షల ఇండక్షన్ స్టౌలు అమ్ముడవుతుండగా, శనివారం ఒక్కరోజే ఆమెజాన్‌లో 1.34 లక్షలకు పైగా స్టౌలు అమ్ముడయ్యాయి. టీజీ ఎస్పీడీసీఎల్ అధికారులు గ్రేటర్‌లో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లల్లో తనిఖీలు నిర్వహించగా, ఎలక్ట్రిక్ స్టౌలను వినియోగిస్తున్నట్టు గుర్తించారు.

‘లోడ్’ దడ..

రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం, పీక్ డిమాండ్ టెన్షన్ పెడుతున్నది. వ్యవసాయ పంపుసెట్ల వాడకం, ఎండల తీవ్రతతో విద్యుత్తు వినియోగం అమాంతం పెరిగింది. గ్యాస్ కొరతతో ఎలక్ట్రిక్ స్టౌల వినియోగం తీవ్రమవుతున్నది. ఇప్పుడున్న లోడ్‌కు ఇది అధికం. గ్యాస్ కొరత కారణంగా ఎలక్ట్రిక్ హీటర్లు, ఎలక్ట్రిక్ స్టౌలు, ఎలక్ట్రిక్ కుక్కర్లు, కెటిల్స్ వంటి వాటి వాడకం పెరుగుతున్నది. సాధారణంగా ప్రతి ఏడాది ఈ సమయంలో విద్యుత్తు లోడ్ క్రమంగా పెరుగుతుంది. దీనికి ఇప్పుడు వంటింట్లో విద్యుత్తు పరికరాల వాడకం తోడవడంతో ఈ లోడ్ మరింత పెరుగుతున్నది. శుక్రవారం రాష్ట్రంలో ఒక్కరోజే రికార్డు స్థాయిలో 344 మిలియన్ యూనిట్లకు విద్యుత్తు వినియోగం చేరుకున్నది. గురువారం 341, బుధవారం 336, మంగళవారం 338 మిలియన్ యూనిట్ల చొప్పున విద్యుత్తు వినియోగమయ్యింది.

లోకం పోకడ



మీరేం తప్పు చేయలేదు సారూ..
మీకు ఓటేసి మేమే తప్పు చేశాం!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	40.2°c	20.7°c
రంగారెడ్డి	39.0°c	17.5°c
మహబూబ్‌నగర్	39.0°c	21.0°c
నిజామాబాద్	38.8°c	22.5°c
హైదరాబాద్	37.6°c	22.9°c
మెదక్	36.8°c	22.0°c
ఖమ్మం	36.0°c	20.0°c
వరంగల్	36.0°c	21.0°c
కరీంనగర్	36.0°c	23.0°c
నల్లగొండ	35.8°c	21.4°c



గాయపడిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మాదాను మోహిజ్‌ను పరామర్శించిన నాయకులు

బీఆర్‌ఎస్ నేతపై కాంగ్రెస్ సర్పంచ్ దాడి

- తలకు తీవ్రగాయాలతో దవాఖానలో చేరిక
- సర్పంచ్ పై పోలీసులకు ఫిర్యాదు
- నల్లగొండ జమ్మపురంలో ఉద్రిక్తత

భువనగిరి కలెక్టరేట్, మార్చి 14 : నల్లగొండ జిల్లా జమ్మపురంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మాదాను మోహిజ్‌పై కాంగ్రెస్ సర్పంచ్ లూర్దయ దాడి చేసిన ఘటన కలకలం రేపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. పాత కక్షలను మనసులో పెట్టుకున్న కాంగ్రెస్ సర్పంచ్ లూర్దయ శనివారం మాదాను మోయిజ్ ఇంటికి వచ్చి దుర్భాషలాడాడు. ఇదేమిటని ప్రశ్నించిన మోయిజ్ పై లూర్దయ కర్రలతో విచక్షణారహితంగా దాడిచేశాడు. దీంతో మొయిజ్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బాధితుడిని హైదరాబాద్‌లోని దవాఖానకు తరలించారు. మోహిజ్‌ను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగాం పాండు, మాజీ ఎంపీపీ కేశపట్నం రమేశ్, సిలివేరు మధు పరామర్శించారు.ఈ ఘటనపై భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా కురుమూర్తి ఆలయం వద్ద నిరసన దీక్షలో పాల్గొన్న కొండల పరిరక్షణ సమితి, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు

కురుమూర్తి కొండలపై మైనింగ్ నిలిపివేయాలి

ఆలయ సమీపంలో నిరసన దీక్షలు ప్రారంభం

కౌకుంట్ల(చిన్న చింతకుంట), మార్చి 14 : రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కురుమూర్తి ఆలయ సమీపంలోని కొండలపై మైనింగ్ నిలిపివేయాలని కోరుతూ నిరసన దీక్షలు చేపట్టారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ కురుమూర్తి ఆలయం వద్ద కొండల్లో అక్రమ మైనింగ్‌కు అనుమతులు ఇవ్వడాన్ని నిరసిస్తూ కురుమూర్తి స్వామి ఏడు కొండల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దీక్ష ప్రారంభమైంది. బీఆర్‌ఎస్‌తోపాటు ఇతర పార్టీ నాయకులు, ప్రజలు, భక్తులు భారీగా తరలివచ్చారు. కొండలను ముట్టుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కురుమూర్తి స్వామి కోట్లాది మందికి ఆరాధ్య దైవమని, భక్తుల విశ్వాసాన్ని దెబ్బతినేలా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. సీఎం కలుగజేసుకుని వెంటనే మైనింగ్ అనుమతులు రద్దు చేసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

పీడక పాలన నుంచి 'సేవ్ తెలంగాణ'

కరువు కాలం మీద పడి తరుముతుంటే.. తెలంగాణ జనం వలవల ఏడ్సుకుంట బొంబాయ్, దుబాయ్ వలసలు పోతున్నప్పుడు చూసి గుండెలు బాదుకున్నోడు కేసీఆర్. పల్లెపల్లెన పల్లేర్ల దారులు..బీడుబారిన పొలాలు.. పొక్కిలైన వాకిళ్లు..కన్నీరింకిన ముఖాలు చూసి బావురుమన్నోడు కేసీఆర్. ఆ వలపోత నుంచి, ఆ దుఃఖధార నుంచి పుట్టిన నినాదమే 'జై తెలంగాణ'. దగా పడిన వర్గాలతో దండుకట్టించి, తిరుగుబాటు జెండా పట్టించి, బరిగీసి కొట్లాడి తెలంగాణ తెచ్చింది కేసీఆర్. ఆయన ఎవరికి జాతిపిత అని ఇప్పుడు అడుగుతున్నవాళ్లు..పల్లెపల్లె పిడికిళ్లెత్తిన నాడు ఎక్కడున్నరు? 'సారు'తో గొంతు కలిపి జై తెలంగాణ అని ఒక్కరోజైనా నినదించిండ్రా? ఇయ్యాల పచ్చబడ్డ తెలంగాణ మీద పెత్తనం చేస్తున్నరు. చేయనీ..! జనం బమిసిండ్రు..ఓటేసిండ్రు. అధికారం ఇచ్చిండ్రు. అధికారం దొరికినప్పుడు ఎట్ల చేయాలె? పాడి బర్రె తీరు రాష్ట్రాన్ని సాకి సవరిచ్చి ఇంకింత పెంపు చేయాలె. ఎకరం ఎక్కువ పారించో..బస్తా ఎక్కువ పండించో.. చూపించాలె. గోడు, గోస లేని రాజ్యంగా నిలబెట్టాలె. రెట్టింపు సంక్షేమాన్ని, సంతోషాన్ని నింపాలె, అంతకుముందు పాలించిన పాలకుడిని మరిపించాలె. అగో..! అదీ పరిపాలన తరీక.



వర్ధెల్లి వెంకటేశ్వర్లు

కాంగ్రెస్ రెండేండ్ల ఏలుబడి ఏం చేసింది? 880 మంది రైతులను మింగింది. 126 మంది పసిపిల్లల చావులతో బడులనే వల్లకాడు చేసింది. తెలంగాణను మళ్లీ మృత్యుముఖంలో నిలిపింది. పల్లెపల్లెన మళ్లీ చావు డప్పు మోగించింది. అయినా ఈ మానవ పెను హననంతో వారికేం పని? ఖజానాల పడ్డ ఇత్తు పడ్డట్టుగా కడగ నాకాలె. అంతో ఇంతో మిగిలితే ఢిల్లీకి మూట గట్టాలె. అంతకుమించి ఈ తెలంగాణతో వాళ్లకేం పని? ఇక్కడి జీవితాలతో వాళ్లకేం పట్టి?


అధికారం అప్పజెప్పిన పొద్దు నుంచి ఈ పొద్దు వరకు గురుకులాలే మృత్యుకుహరాలై..126 మంది పసిబిడ్డల గొంతు నులిమింది. 'సారు' పూనుకొని, సాగును సక్కదిద్ది, సావు కోరల నుంచి రైతును బయటకు తీసినట్టే అనుకున్న ఆనందం కండ్ల ముందే ఆవిరైపోతున్నది. భరోసా దొరకని రైతు మళ్లీ చావు దిక్కే మొగ్గుతున్నడు. మిత్తికి పోయి, అప్పులపాలై బలవన్మరణాల బాట పడుతున్నడు. కేసీఆర్ దిగిపోయే చివరి ఏడాది నాటికి రైతు ఆత్మహత్యలను 56కు కుదించి ఆకుపచ్చ తెలంగాణను కాంగ్రెస్ పాలకుల చేతుల్లో పెట్టిండు. వాళ్లేమో ఈ రెండేండ్లలో 880 మంది రైతు ఆత్మహత్యలను ముందు పెట్టిండ్రు.

కట్టుకున్న ఇండ్లను పట్టపగలే పాలకుల బుల్డోజర్ నేలమట్టం చేస్తుంటే దిక్కుతోచక బిక్కచచ్చిన జనం గగ్గోలు పెడుతున్నరు. ఆయన కొలువు కూటం మీదకి ఎక్కిన దినం నుంచి ఖమ్మం జిల్లా వెలుగుమట్ల విధ్వంసం వరకు 4 వేల ఇండ్లు కూలగొట్టినట్టు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ లెక్కలు చెప్తున్నది. మూసీ ప్రక్షాళన పేరుతో మరో 10,017 వేల ఇండ్లు నేలమట్టం చేసేదాకా నిద్రపోమని ఏలికలు గెజిట్ పత్రం పట్టుకొని తిరుగుతున్నరు.

సింగపూర్ కన్సల్టెంట్లు రూపొందించిన ప్రజెంటేషన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాలిలో గ్రాఫిక్స్ మేడలు కడుతుంటే..అచ్చంగా అమరావతి డిజైన్ల చంద్రబాబే పూనినట్టు అనిపించింది. మూసీ బాధిత జనులను, వారికి అండగా నిలిచిన ఉద్యమకారులను గృహనిర్బంధం చేసి శుక్రవారం తాజ్ కృష్ణా హోటల్‌లో కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య చేసిన గ్రాఫికల్ పవర్ పాయింట్‌లో రేవంత్‌లో ఆసాంతం అబ్రకదబ్ర చంద్రబాబు నాయుడే కనిపించాడు. అభివృద్ధిని విస్మరించి, విధ్వంసాలను విస్తరించాలనే కుతూహలాన్ని..ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్‌తో నింపేసిన పవర్ పాయింట్ రంగులరాట్నం బయటపెట్టింది.

2025 డిసెంబర్‌లో రైతుల ఖాతాల్లో జమ చేయవలసిన రైతు భరోసా డబ్బులు 2026 మార్చి వరకు కూడా దిక్కులేదు. ఇంకో నెల రోజులు పోతే ఖరీఫ్ సీజన్ అందుకుంటది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిపోతున్నది. ఎన్ని దేవుండ్ల మీద ఒట్టేసి చెప్పినా..ఇప్పట్లో ఇచ్చే సూచనలైతే కనిపించటం లేదు. 'నేనైతే రైతు భరోసా వేసిన! కానీ రైతుల ఖాతాల్లో పడ్డయో, లేదో నాకైతే తెల్వది' అని ముఖ్యమంత్రి అమాయకపు ప్రకటన వెనుక మర్మమేమిటి? కేసీఆర్ ఉన్నప్పుడు సరిగ్గా నాటుకు, నాటుకు మధ్య రైతుబంధు పడ్డది. రేవంత్‌రెడ్డి వచ్చి ఓటుకు, ఓటుకు మధ్య భరోసా పెట్టిండు. ఎప్పుడు ఓట్లొస్తే అప్పుడు, ఎక్కడ ఓట్లొస్తే అక్కడ నిధులు జమ చేస్తున్నడని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఇదే ముఖ్యమంత్రి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు..'కేసీఆర్ రైతుబంధు రూ.5 వేల చొప్పున రెండు పంటలకే ఇచ్చిండు. మూడు పంటలు పండిస్తే మూడుసార్లు రైతుబంధు ఎందుకు ఇస్తలేవు? అతి తెలివి తేటలా?' అని నోటికి ఎంతొస్తే అంత అన్నడు. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కౌలు రైతుకు, కమతం రైతుకు ఇద్దరికీ రైతు భరోసా! ఇప్పుడు తీసుకుంటే రూ.10 వేలే! అదే మా ప్రభుత్వం వచ్చాక రైతుభరోసా తీసుకుంటే రూ.15 వేలు!' అని నమ్మబలికిండు. గద్దెనెక్కి అసలు రంగు బయటపెట్టిండు. కౌలు రైతుకు, కమతం రైతుకు ఇద్దరికీ మొండి చెయ్యి చూపించిండు.



రేవంత్ పాలనలో అంతమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం వైపు నుంచి ఒక్క ప్రకటన కూడా లేదు. నిన్నటికి నిన్న ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లోని వెల్కిచర్లలో భగీరథ ప్రయత్నంలో దగాపడిన ఓ కుటుంబం మూకుమ్మడి ఆత్మహత్యకు పాల్పడ్డది. 6 ఎకరాల భూమిలో 300 ఫీట్ల లోతుకు బోరు వేసినా నీళ్లు పడలేదు. భర్త మరో బోరు వేయించేందుకు సిద్ధమైన నేపథ్యంలో అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నామనే భయంతో ఆ రైతు భార్య శైలజ తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఈ పాటికి పూర్తయి ఉంటే, సాగునీళ్లు అందుంటే..ఆ సావులు ఉండేవా? ఆ సామూహిక హననానికి కారణం కాంగ్రెస్ సర్కార్ కాదా?

కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులు మొదలు పెట్టారు. 170 టీఎంసీల జలాలను ఒడిసిపట్టి ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో 90 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన ఇంకో 10 శాతం పనులు ఇప్పటి పాలకులు పూర్తి చేసి ఉంటే పాలమూరు పచ్చబడేది. రైతు ఆత్మహత్యలు ఆగేవి. ఇటువంటి ఆలోచనలు కేసీఆర్ తప్ప ఎవరు చేస్తారు? 'గాంధీ' కుటుంబానికి కష్టమొస్తే రూ.1,000 కోట్లు పోగేసి మూటగట్టి ఢిల్లీకి మోయాలనే ఆలోచన చేస్తారు. కానీ. రైతు కష్టాలు వాళ్లకు ఎందుకు తడుతయ్.

కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులు మొదలు పెట్టారు. 170 టీఎంసీల జలాలను ఒడిసిపట్టి ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో 90 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన ఇంకో 10 శాతం పనులు ఇప్పటి పాలకులు పూర్తి చేసి ఉంటే పాలమూరు పచ్చబడేది.

ప్రత్యేక రాష్ట్రం వచ్చేనాటికి తెలంగాణలో 294 గురుకులాలు ఉండేవి. పదేండ్లలో కేసీఆర్ వాటిని 1,023 చేసి, పిల్లల ప్రతిభకు పదును పెడితే దేశమంతా తెలంగాణ వైపు చూసింది. ఎంసెట్‌తో సహా, నీట్, జేఈఈ, సీయూఈటీ లాంటి జాతీయ ఎంట్రెన్స్ టెస్టుల్లో గురుకుల విద్యార్థులు తమ సత్తా చాటారు. ఏడుగురు తెలంగాణ గురుకుల విద్యార్థులు ఆఫ్రికాలోకెల్లా అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించి, ఆ కొండ కొమ్మున 100 అడుగుల జాతీయ జెండా, ఆ పక్కనే కేసీఆర్ చిత్రపటాన్ని నిలబెట్టి సెల్యూట్ కొట్టి గుండెల నిండా గాలి పీల్చుకున్న సన్నివేశాలు చూశాం. ఆ తర్వాత తెలంగాణ గురుకులాల నుంచి పర్వతారోహకులు వరుస కట్టారు. ఇపుడు కాంగ్రెస్ హయాంలో కేవలం రెండేండ్లలో గురుకులాలు ఎకాఎకిన పాతాళానికి దొర్లిపడి మరణం అంచున మూలుగుతున్నాయి.

చదువుల సంగతి దేవుడెరుగు.. కనీసం విద్యార్థుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతున్నది. గురుకులాల్లో కలుషితాహారం, విషపు కీటకాదుల భౌతిక దాడితో విద్యార్థులు తలలు వాలుస్తున్నారు. ఈ రెండేండ్ల కాలంలో 54 మంది బాలికలు, 72 మంది బాలురను గురుకులాలు మింగేశాయి. నిన్నటికి నిన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గుండుగులపల్లి ఏకలవ్య పాఠశాలలో విషాహారం తిని 40 మంది విద్యార్థులు అస్వస్థత బారిన పడ్డారు. అంతకుముందు జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో నెల రోజుల వ్యవధిలో ఆరుగురు విద్యార్థులను పాము కాటేసింది. వీరిలో ఇద్దరు చనిపోయారు. ఖమ్మం జిల్లా దానవాయిగూడెం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థినికి ఎలుకలు కరిచాయి. ఒకసారి రెండుసార్లు కాదు..ఏకంగా 15సార్లు ఎలుకలు కరిచినట్టు చెబుతున్నారు. అయినా ప్రభుత్వం గురుకులాల్లో విద్యార్థుల భద్రత కోసం ఒక్క ప్రణాళిక కూడా రూపొందించిన దాఖలాలు లేవు.

పరిపాలనపై ముద్ర వేయడం అంటే సుతారం లేకుండా తెలంగాణ సాంస్కృతిక ప్రతీకలను విధ్వంసం చేయటం కాదు. మూసీ నది ప్రక్షాళన పేరుతో ఇండ్లను ఆగం, అంగడి చేయడమూ కాదు. కపాలంలో మెదడు కరిగేటట్టు రాష్ట్ర వికాసం కోసం ఆలోచనలు చేయటం. కడుపుల పేగులు కదిలే దాకా పనిచేయటం. కడుపు కట్టుకొని నిలబడి వ్యవస్థలను ప్రక్షాళన చేయటం. కూలిపోయిన చెరువులను పునరుద్ధరించటం. నదులకు నడకలు నేర్పి, పరుగెత్తే నీళ్లను కరువు నేల మీదికి మళ్లించటం. బడిపిల్లల భవిష్యత్తుకు హామీ ఇవ్వటం. కరోనా లాంటి విలయం వచ్చినా..మా సీఎం ఉన్నడు..తడకలు అడ్డం పెట్టయినా ప్రళయాన్ని ఆపుతాడనే నమ్మకం, ధైర్యం సామాన్యునిలో కల్పించటం. ఒక్కొక్క రంగాన్ని చక్కదిద్ది జనజీవన ప్రమాణాల్లో మార్పు తీసుకరావడం, అట్టడుగు వ్యక్తి కూడా పురోగమించగలిగే సాధికార వాతావరణం కల్పించడం.

మనకు బీడువడ్డ తెలంగాణ వద్దు. నిన్నటి బంగారు తెలంగాణ కావాలి. ఆనాడు సబ్బండ జాతులం, సకల జనులం ఏకమై కేసీఆర్ నాయకత్వంలో జై తెలంగాణ అని ఎట్లైతే నినదించామో.. ఇప్పుడు అదే 'సారు' నాయకత్వంతో 'సేవ్ తెలంగాణ' అని రణనినాదం చేద్దాం. ప్రాకృతిక, మానవ వనరుల సంపూర్ణ విధ్వంసం జరుగకముందే తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకుందాం.



నదిలో నీరు పారాలి.. కన్నీరు కాదు. ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వమే ఆ కన్నీటిని పారిస్తే! మూసీ సుందరీకరణ ప్రాజెక్టు ప్రణాళిక నేపథ్యంలో పరీవాహక ప్రాంతంలోని ప్రజలు ఎవరిని కలిసినా నిర్వేదమే. నిస్సహాయ స్థితిలో మిగిలిపోయామన్న ఆవేదన. తమ అభిప్రాయాలను తెలుసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడమేమిటన్నది ప్రజల ఆక్రోశం. ప్రభుత్వం అర్థం చేసుకోకపోగా, అసలు పట్టించుకోవడమే లేదు. ఎవరికో కనువిందు చేయడానికి మా కడుపు కొట్టాలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పేదల కన్నీళ్లతో మూసీకి ముస్తాబా?



గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817

మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఉన్నవారంతా మధ్య తరగతి, నిరుపేద వర్గాలే. నిరుపేదలంతా 50, 60 గజాల స్థలంలో చిన్న గుడిసెలో, రేకుల షెడ్లో వేసుకున్నవారే. పేదల పొట్టగొట్టి ప్రభుత్వం గాంధీ విగ్రహం పెడుతామంటే కనీసం మహాత్ముడి ఆత్మ అయినా శాంతిస్తుందా? ఇల్లంటే అదొక ఆర్థిక లావాదేవీ మాత్రమే కాదు. అదొక అనుబంధం. కష్టార్జితాన్ని కండ్లారా చూసుకునే సందర్భం. అసలు బఫర్ జోన్ అంటే ఏమిటి? నదిలో వచ్చే వరదకు గురికాకుండా, పరిసరాల మురికి నీరు నదిలో కలవకుండా నిరోధించాలన్న ఉద్దేశంతో ఒకప్పుడు బఫర్ జోన్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఎక్కడికక్కడ మురికి నీటిని శుద్ధి చేసుకునే అవకాశాలు ఉన్నాయి. శుద్ధ జలాన్ని నదిలో చేర్చే సాంకేతిక నైపుణ్యం ఉన్నది. అపార్టుమెంటు స్థాయిలోనే నీటిని శుద్ధి చేసే ఏర్పాట్లు చేసుకోవచ్చు. ఈ కోణంలో ఆలోచించకుండా బఫర్‌జోన్ పేరిట నిర్మాణాలను తొలగిస్తామనడం సబబేనా? అసలు మూసీ నదిలో వరద ఎక్కడ ఉన్నది? అలాంటి పరిస్థితిలో బఫర్‌జోన్‌ను ఏ ప్రాతిపదికన నిర్ధారించారన్నది ప్రశ్న.

కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజలకు 58, 59 జీవో ద్వారా దశాబ్దాల నుంచి 30, 40 గజాల్లో ఇల్లు కట్టుకున్న పేద బస్తీ జనాలకు పట్టాలిచ్చి రెగ్యులరైజ్ చేసింది. బస్తీలలో బస్తీ దవాఖానలు పెట్టి పేదలకు వైద్యం అందేలా చూసింది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా నీళ్లు అందించింది. ఇప్పుడు ప్రభుత్వాన్ని ఆ ప్రజలంతా అడుగుతున్న ప్రశ్న ఒకటుంది. మూసీ వెడల్పును కొంచెం తగ్గించి సుందరీకరణ పనులు చేపడితే ఏమైనా ఇబ్బందా? అని. ఇళ్లను పడగొట్టకుండా, నదికి రెండువైపులా కరకట్టలు, రక్షణ గోడలు కట్టి అభివృద్ధి చేయకూడదా అని అడుగుతున్నారు. ప్రజలను ఆకర్షించేది నదిలో నిండుగా ప్రవహించే నీరు తప్ప, పక్కనున్న పార్కులు కాదు. దాన్ని పట్టించుకోకుండా ఇల్లు పీకి పందిరి వేస్తామంటే నమ్మేవారు ఎవరు ఉంటారు?

మూసీ సుందరీకరణ అంటే చరిత్రను కూడా మనసులో పెట్టుకోవాలి. హైదరాబాద్ అంటే ప్రేమకు చిహ్నం. దానికి సూత్రధారి మూసీ నది. కుమారుడు నర్తకి అయిన అనార్కలిని ప్రేమిస్తే ఆమెను అక్బరు చక్రవర్తి సజీవ సమాధి చేసినట్టు చరిత్రలో చదివాం. కులీ కుతుబ్‌షా-భాగమతి ప్రేమ చరిత్రాత్మకం. కుతుబ్‌షా ప్రేమ కోసం ఆయన తండ్రి నగరాన్నే నిర్మించాడు. గోల్కొండ నుంచి కుతుబ్‌షా రాకపోకల కోసం మూసీపై వంతెనను నిర్మించాడు. 'పురానా పూల్'గా ఇప్పటికీ అది సేవలు అందిస్తోంది. నిజానికి అది 'పూల్ ఎ మొహబ్బత్'. దానికి ఆ పేరే పెట్టాలి. ప్రపంచంలోనే ఇదొక అద్భుతం. దీన్ని కేవలం ఓ బ్రిడ్జిగా వదిలేయకుండా 'ప్రేమ వారధి'గా అభివృద్ధి చేస్తే హైదరాబాద్ వచ్చినవారెవరూ దీన్ని చూడకుండా తిరిగి వెళ్లలేరు. పురానాపూల్ అద్భుతమైన నిర్మాణం. దానిని పర్యాటకంగా అభివృద్ధి చేయవచ్చు.

రాజేంద్రనగర్‌కు హైకోర్టు తరలిపోతుండడంతో పాత భవనాన్ని రాజ దర్బారుగా తీర్చిదిద్దితే అది కూడా పర్యాటక ప్రాంతమే. పురానాపూల్ ప్రాంతం పెద్ద ఆకర్షణ కేంద్రంగా మారుతుంది. ఎలాంటి కూల్చివేతలు లేకుండానే ఇది సాధ్యపడుతుంది. తొలుత ఇలాంటి చారిత్రక విషయాలపై దృష్టి పెట్టాలి. ఇవన్నీ ప్రజలు చెప్పిన సూచనలే. నిపుణుల సిఫారసులను కొట్టిపారేయకూడదు. హంకాంగ్‌లోనో, బ్యాంకాక్‌లోనే ఇలా చేశారంటే కుదరదు. ఎందుకంటే హైదరాబాద్ ప్రత్యేకత.. హైదరాబాద్‌దే. మూసీ సుందరీకరణ కేవలం ఆర్థిక, పర్యావరణ, పర్యాటక అంశమే కాదు. అన్నింటికన్నా ముఖ్యంగా సామాజిక సమస్య. ఈ విషయాన్ని ప్రభుత్వం గమనించడం లేదు. నిజంగా గుర్తించి ఉంటే ఈ పాటికే ప్రజల అభిప్రాయాలు స్వీకరించి ఉండేది.

హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణంలో స్టేషన్‌కు ఒక మోడల్‌ను రూపొందించాల్సి వచ్చింది. యూనిఫారంగా అన్ని స్టేషన్లకు ఒకే తరహా మోడళ్లను డిజైన్ చేయలేదు. అందుకే నగరంలో ఏమి చేయాలన్నా స్థానిక స్థితిగతులను అధ్యయనం చేయాల్సిందే. యూనిఫారంగా చేస్తామంటే అమలు సాధ్యం కాదు.

నదుల సుందరీకరణ కొత్తది కాదు. గుజరాత్‌లోని నర్మద సహా, దేశంలో చాలా చోట్ల జరిగాయి. అందరూ అందంగా మారిన నదులను చూసి వస్తున్నారే తప్ప పునరావాసం పొందిన బాధితుల తాజా పరిస్థితి ఏమిటన్నది అధ్యయనం చేయాలి. ఇప్పటికే విదేశాలకు వెళ్లి వచ్చినవారికి ఇతర రాష్ట్రాలకు వెళ్లడం పెద్ద పనేమీ కాదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నది ఏంటంటే మొదటి దశలో గాంధీ ఘాట్ అభివృద్ధి చేస్తుందట. గాంధీ సరోవర్‌ను నిర్మించి, సుమారు రూ.5 వేల కోట్లు అన్నది ఒక అంచనా. ఇందులో ఇంకా స్పష్టత లేదు. పెద్ద గాంధీ విగ్రహం ఏర్పాటు చేసి, ఉద్యానవనాలు ఏర్పాటు చేస్తామని మాత్రం ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

ఎక్కడెక్కడివారో వీటిని చూసి ఆహ్లాదం పొందుతారట. పర్యాటకులు వస్తారు కాబట్టి ఆయా ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, ఆదాయ మార్గాలు పెరుగుతాయన్నది ప్రభుత్వ ఆర్భాటపు ప్రచారం చేస్తున్నది. కొందరి ఆహ్లాదం కోసం మరికొందర్ని ఇంట్లోంచి గెంటేసి, ఇండ్లను కూల్చుతామని అనడం సామాజిక న్యాయం అనిపించుకోదు. సామాజిక న్యాయం లేని అభివృద్ధి అభివృద్ధే కాదు. 'జస్టిస్ హరీడ్ ఈజ్ జస్టిస్ బరీడ్' అన్న మాటను ప్రభుత్వం గుర్తుంచుకోవాలి.

(వ్యాసకర్త: తెలంగాణ బస్తీ జేఏసీ చైర్మన్)

మోదీ వైఫల్యం.. భారత్ మూల్యం!

ప్రధాని నరేంద్రమోదీ విదేశాంగ విధానాల వైఫల్యం కారణంగా భారతదేశం మూల్యం చెల్లించుకుంటున్నది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం చేస్తున్న తరుణంలో మోదీ అనుసరించిన వైఖరి ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తున్నది. ఇజ్రాయెల్ వెళ్లిన మోదీ ఆ దేశ ప్రధాని నెతన్యాహూతో అతి చనువుగా వ్యవహరించడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 'భారత్ మాతృభూమి, ఇజ్రాయెల్ పితృభూమి' అంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు దేశవ్యాప్తంగా వీధి వీధిన గ్యాస్ సిలిండర్ల కోసం ప్రజలు క్యూ కట్టడానికి పశ్చిమాసియా దేశాల విషయంలో అనుసరించాల్సిన విధానాల్లో మోదీ తప్పటడుగులే ప్రధాన కారణమని విదేశాంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.



సుక్కన్న

ఫిబ్రవరి చివరి వారంలో ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో యుద్ధం ప్రారంభించాయి. ఈ పరిణామం యావత్తు ప్రపంచాన్ని అత్యంత వేగంగా ఆర్థిక అత్యయిక పరిస్థితిలోకి నెట్టింది. బ్యారెల్ చమురు ధర 121 డాలర్లు దాటింది. చమురు సరఫరా వ్యవస్థలు విచ్ఛిన్నమవుతున్నాయి. దీంతో అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆందోళనలో పడ్డాయి. ఈ ప్రభావం భారత్‌లోని ప్రతీ వీధిలోనూ కనిపిస్తున్నది. డీజిల్, వంట గ్యాస్ సిలిండర్ల ధరలు నిలకడ కోల్పోవడం, కొరత కారణంగా రాజధాని ఢిల్లీ నుంచి ఆర్థిక నగరం ముంబై వరకు ప్రజాజీవనం ప్రభావితమవుతున్నది. హోటళ్లు, తినుబండారాల దుకాణాలు మూతపడుతున్నాయి, సేవలను తగ్గిస్తున్నాయి. మార్కెట్లో వంటగ్యాస్ సిలిండర్లు కనిపించడంలేదు. గ్యాస్ కొరతతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏజెన్సీల ముందు క్యూ కడుతున్నారు. ఎల్ఎన్‌జీతో నడుస్తున్న ఆటోలు, ట్యాక్సీల యజమానులు గ్యాస్ ధరలను భరించలేక చాలావరకు వరకు సేవలు నిలిపివేశారు. కేంద్రంలో మోదీ సర్కార్ వైఫల్యం చెందడమే ఈ దుస్థితికి కారణం.

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న పరిస్థితుల్లో భారతదేశం నిర్మాణాత్మక పాత్ర పోషించే అవకాశం లభించింది. కానీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రయోజనాలను కాపాడటంలో దారుణంగా విఫలమయ్యారు. ఈ సంవత్సరం బ్రిక్స్‌కు భారతదేశం అధ్యక్షత వహిస్తున్నది. అమెరికా, ఇరాన్‌తో భారత్ స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉన్నది. ఇరాన్, రష్యాల నుంచి చమురును కొనుగోలు చేస్తున్నది. అయినప్పటికీ ప్రతీ కీలక దశలో మోదీ అనుసరించిన తీరు సమర్థనీయం కాదు. ఎందుకంటే ధైర్యమైన దౌత్యం కంటే నిశ్శబ్దం వైపే మొగ్గారు. రెండు మిత్రపక్షాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు ఏకపక్షంగా అమెరికా పక్షం వహించడం వల్ల వ్యూహాత్మక శూన్యత ఏర్పడింది. ఈ చర్య భారత ప్రయోజనాలను తీవ్రంగాదెబ్బతీసింది.

ప్రస్తుతం భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యకు పునాది ఫిబ్రవరి చివరి వారంలో పడింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధానికి కొన్ని రోజుల ముందు మోదీ విఫల విధానానికి బీజం వేశారు. ఫిబ్రవరి 25-26 తేదీలలో ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న మోదీ, ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను ఆలింగనం చేసుకున్నారు. ఈ పర్యటన రక్షణ, వాణిజ్య సంబంధాల బలోపేతం కోసం జరిగినట్టుగా పెద్దఎత్తున ప్రచారం జరిగింది. మోదీ పర్యటన ముగిసిన రెండు రోజుల్లోనే అమెరికా మద్దతుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు మొదలుపెట్టింది. ఇరాన్ అధినేత అలీ ఖమేనీని హత్య చేసి, సంక్షోభానికి ప్రేరేపించింది. కానీ సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలు తగ్గించాలని భారత్ తరపున ప్రధాని మోదీ ఒక్కసారి కూడా బహిరంగ ప్రకటన చేయలేదు.

యుద్ధంలో భాగస్వాములైన దేశాల నేతలకు మోదీ ఫోన్ కాల్ కూడా చేయలేదు. పశ్చిమాసియా దేశాల వ్యవహారాల్లో సంబంధం లేనట్టుగానో, తటస్థ వైఖరినో అనుసరించలేదు. ఒకవైపు మొగ్గు చూపినట్టుగా వ్యవహరించారు. నిశ్శబ్దం ద్వారా యుద్ధానికి ఆమోదం తెలిపినట్టయింది. ఇజ్రాయెల్ పర్యటన ద్వారా ఇరాన్ యుద్ధానికి మోదీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా? అంటూ విపక్షనేతలు, విదేశాంగ నిపుణులు అడుగుతున్న ప్రశ్నలు సరైనవే. మోదీ పర్యటన ఉద్దేశపూర్వకమైనా కాకపోయినా ఆ సమయం ఓ ఘోరమైన దుర్దశ అని మాత్రం చెప్పగలం.

యుద్ధం ఉధృతమైన తర్వాత నెలకొన్న నిశ్శబ్దం కూడా మరింత దారుణంగా ఉన్నది. మార్చి 3-4 తేదీలలో హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికాకు చెందిన జలాంతర్గామి ముంచివేసింది. ఈ ఘటనలో 87 మంది ఇరాన్ నావికులు చనిపోయారు. ఈ దాడి భారతదేశ సముద్ర తీరానికి దగ్గర జలాల్లోనే జరిగింది. అంతేకాకుండా దాడి జరిగిన ప్రదేశం భారత్‌కు వ్యూహాత్మకంగా, ఆర్థికంగా కీలక ప్రాముఖ్యం కలిగిన ప్రాంతం. ఇలాంటి ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు సమీపంలోని ఏ దేశ ప్రభుత్వమైనా ఆందోళన వ్యక్తం చేస్తూ స్పందించాలి. కనీసం ప్రకటన విడుదల చేయాలి. కానీ మోదీ ప్రభుత్వం అసలు స్పందించలేదు. నిరసన తెలుపలేదు, దర్యాప్తును కోరలేదు. కనీసం విచారం వ్యక్తంచేయలేదు. ఉద్దేశపూర్వకంగా ఎంచుకున్న మౌనం మన వైఖరిని తేటతెల్లం చేసినట్టయింది. స్వతంత్ర విధానాలు అవలంబించే దేశంగా భారతదేశానికి ఉన్న విశ్వసనీయతను దెబ్బతీసింది.



యుద్ధంపై సరైన విధంగా స్పందించేందుకు, ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు భారత్‌కు అవకాశం ఉన్నప్పటికీ మోదీ ప్రభుత్వం ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేదు. ఈ ఏడాది బ్రిక్స్‌కు ఇండియానే నేతృత్వం వహిస్తున్నది. బ్రిక్స్ కూటమిలో రష్యా, చైనా కూడా ఉన్నాయి. ఆ రెండు దేశాలు ఇరాన్‌కు బహిరంగంగా మద్దతు ఇస్తున్నాయి. ప్రపంచ చమురు డిమాండ్‌లో ఈ రెండు దేశాలు బలమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. అంతేకాకుండా అంతర్జాతీయ దౌత్య సంబంధాల్లో కీలక స్థానం కలిగి ఉన్నాయి. ఈ నేపథ్యంలో బ్రిక్స్ తరపున ఉమ్మడి ప్రకటన విడుదల చేయడం, అత్యవసరంగా వర్చువల్ శిఖరాగ్ర సమావేశం నిర్వహించాల్సింది. లేదా ఇరాన్, సౌదీ అరేబియా, అమెరికా మధ్య దౌత్య ప్రయత్నం చేయాల్సింది. కానీ ఇవేమీ కార్యరూపం దాల్చలేదు. బ్రిక్స్ అధ్యక్ష స్థానాన్ని ఉపయోగించుకొంటూ యుద్ధంలో భాగస్వాములైన దేశాలు కాల్పుల విరమణ పాటించాలని చర్చలు జరపాల్సింది. హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతలు తగ్గించాల్సింది. కానీ మోదీ ప్రభుత్వం నిష్క్రియాపరంగా వ్యవహరించింది. ఇదే సమయంలో చైనా వేగంగా స్పందించి, ఇరాన్‌కు మద్దతు తెలిపింది. తన ప్రయోజనాలను కాపాడుకున్నది. కానీ మోదీ ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహించింది.

భారతదేశ చారిత్రక విదేశాంగ వారసత్వం అలీన విధానం, వ్యూహాత్మక ప్రతిపత్తి. కానీ అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ వివాదంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరించిన తీరు చూస్తుంటే ఆ చారిత్రక, వారసత్వ విధానాల నుంచి పక్కకు జరిగినట్టు కనిపిస్తున్నది. దురాక్రమణదారులతో చాలా సన్నిహితంగా ఉన్నట్టు కనిపించింది. బ్రిక్స్ అధ్యక్ష స్థానాన్ని ఉపయోగించి అంతర్జాతీయ వేదికలపై శాంతిని డిమాండ్ చేయడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బయటదేశాల్లో ప్రాంతీయ సంఘర్షణపై సరిగ్గా స్పందించకుండా మన దేశ అస్తిత్వాన్నే సంక్షోభంలో పడేసిన ఘనత మోదీ సర్కారుది.

ప్రస్తుతం భారతదేశంలో చమురు, గ్యాస్ కొరత తీవ్రమైంది. చాలా రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. కొవిడ్ దెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న హోటళ్లు, రెస్టారెంట్లు వంట గ్యాస్ కొరత కారణంగా మూతపడుతున్నాయి. కొన్ని హోటళ్లు సిబ్బందిని తొలగిస్తున్నాయి, మరికొన్ని పనివేళలు తగ్గిస్తున్నాయి. పర్యాటక ప్రాంతాల్లోని తినుబండారాల దుకాణాలు తాత్కాలికంగా మూసివేసినట్టు బోర్డులు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. మన దేశానికి అవసరమైన ముడి చమురులో 85 శాతం దిగుమతి ద్వారా లభిస్తుంది. ఆ దిగుమతి రవాణా కూడా గల్ఫ్ మార్గంతో ముడిపడి ఉన్నది. యుద్ధం వల్ల కొరత ఏర్పడటంతో సిలిండర్ల బ్లాక్ మార్కెట్ దందా జోరుగా నడుస్తున్నది. ఎల్ఎన్‌జీతో నడిచే ఆటోలు, ట్యాక్సీల వ్యాపారం పతనావస్థకు చేరుకున్నది. రవాణా వ్యవస్థ దెబ్బతింటున్నది. మోదీ ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారం చేసుకుంటున్న 'ఇంధన భద్రత' ప్రచారం హాస్యాస్పదంగా, అబద్ధంగా మారిపోయింది. ముందుజాగ్రత్తగా పెట్టుకున్న నిల్వలు కూడా కరిగిపోతున్నాయి. సంక్షోభ నివారణకు అనుసరించాల్సిన చర్యలపై మోదీ ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు కనిపించడంలేదు.

అమెరికా-ఇజ్రాయెల్ దేశాలు కలిసి సాగిస్తున్న యుద్ధంలో ఇరాన్ అధినేత అలీ ఖమేనీని హత్య చేయడం ఒక మలుపు. కనీసం అప్పుడైనా మోదీ ప్రభుత్వం స్వతంత్రంగా వ్యవహరించాల్సింది. సంయమనం పాటించాలని పిలుపునివ్వాల్సింది. గతంలో గల్ఫ్ యుద్ధాలు జరిగినప్పుడు భారతదేశంలోని వివిధ ప్రభుత్వాలు సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు దోహదపడ్డాయి. కానీ యుద్ధం తీవ్రంగా రగులుకున్న దశలో కూడా అంతర్జాతీయ వేదికపై మోదీ ప్రభుత్వం కనిపించకుండానే పోయింది. బీజేపీ సర్కార్ నిష్క్రియాపరత్వం వల్ల అనేక రంగాలపై ప్రభావం కనిపిస్తున్నది. దిగుమతి బిల్లులు పెరగడంతో కరెంట్ అకౌంట్ లోటు పెరిగింది. అంతర్జాతీయంగా డాలర్‌తో పోల్చినప్పుడు రూపాయి విలువ పతనం, ద్రవ్యోల్బణ ఒత్తిడితో ఆర్బీఐ కఠిన నిర్ణయాలు తీసుకోకతప్పని పరిస్థితికి నెట్టివేయవచ్చు. అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ వ్యవహారం దౌత్యపరమైన తప్పిదమా? లేకపోతే ఒక ప్రధాన శక్తిగా ఉన్న భారత్ తన బాధ్యత నుంచి వెనుకడుగు వేసిందా? అనే విషయాలపై తీర్పును చరిత్ర చెప్తుంది.

9 వేల కోట్లు ఏమైనట్టు?

గత నెల 10న ఆర్బీఐ నుంచి రుణం తీసుకున్న ప్రభుత్వం

- రైతుభరోసా కోసమేనని అనుకూల మీడియాలో ప్రచారం
- నెలదాటినా అన్నదాతల ఖాతాలకు చేరని నయా పైసా
- సేకరించిన రుణాన్ని ఏం చేసిందో చెప్పని కాంగ్రెస్ సర్కార్
- యాసంగి పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టారని రైతుల ఆగ్రహం



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 10వ తేదీన ఆర్బీఐ నుంచి రూ.9 వేల కోట్ల రుణం సేకరించింది. యాసంగి రైతుభరోసా వేయడానికేనంటూ అనుకూల మీడియా ద్వారా ఊదరగొట్టింది. ఇప్పటికీ నెల గడిచిపోయింది. కానీ రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా వేయలేదు? మరి ఆ రూ.9వేల కోట్లు ఏమైనట్టు? తెచ్చిన డబ్బులను రైతులకు ఇవ్వకుండా ఎవరికి ఇచ్చింది? అన్నదాతలకు మొండిచేయి చూపించి వ్యాపారవేత్తలకు మేలు చేసిందా? తద్వారా ప్రభుత్వ పెద్దలు కమీషన్ల రూపంలో రూ.వందల కోట్లు వాటాలు పంచుకున్నారా? కేరళ ఎన్నికలకు సమర్పించాల్సిన రూ.వెయ్యి కోట్ల మూటలకు ఈ సొమ్మును సర్దుబాటు చేశారా? ప్రస్తుతం వినిపిస్తున్న ప్రశ్నలు ఇవే. చివరికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పేరుతోనూ దోపిడీకి తెగబడుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైతుల పేరుతో రుణం

గత నెల 10న ఆర్బీఐ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.9 వేల కోట్ల రుణం తీసుకున్నది. ఇందులో 13 ఏండ్ల కాలపరిమితితో రూ.2 వేల కోట్లు, 16 ఏండ్ల కాలపరిమితితో రూ.2 వేల కోట్లు, 21 ఏండ్ల కాలపరిమితితో రూ. 2,500 కోట్లు, 27 ఏండ్ల కాల పరిమితితో మరో రూ.2,500 కొట్లు ఇలా మొత్తంగా రూ.9వేల కోట్ల రుణం సేకరించింది. రైతులకు యాసంగి రైతుభరోసా పంపిణీ కోసం ఈ రుణం తీసుకుంటున్నట్టు ప్రభుత్వం లీకులు ఇచ్చింది. పచ్చ పత్రికలు, వంత పత్రికల్లో ప్రచారం కూడా చేయించింది. కానీ నెలరోజులు గడుస్తున్నా ఇప్పటికీ కనీసం ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. రైతుల కోసం రుణ సేకరణ అనేది ఎన్నికల డ్రామా అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం గత నెల 10న ప్రభుత్వం ఈ రుణం సేకరించింది. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరుగగా, 13న ఫలితాలు వచ్చాయి. మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే సర్కార్ ఈ రకమైన లీకులిచ్చిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తద్వారా రైతుల ఓట్లు కొల్లగొట్టారని, ఆ తర్వాత పక్కన పడేసిందని చర్చ జరుగుతున్నది.

బడాబాబుల బిల్లులు క్లియర్?

రైతుభరోసా పేరుతో ప్రభుత్వం గత నెల 10న సేకరించిన నిధులు ఎక్కడికి వెళ్లాయనేది పెద ప్రశ్నగా మారింది. ప్రభుత్వం ఇప్పటివరకు రైతుభరోసా వేయలేదని, సాయం పంపిణీ చేయలేదని గుర్తు చేస్తున్నారు. రైతుల పేరు చెప్పి అప్పులు తేవడంపై మండిపడుతున్నారు. ఆ నిధులు ఏమైనట్టు? ఏం చేసినట్టు? అని ప్రశ్నిస్తున్నారు. రైతులకు పంపిణీ చేస్తే ఏం లాభం? కాంట్రాక్టర్లకు పంపిణీ చేస్తే కనీసం కమీషన్లు అయినా వస్తాయనే ఆలోచనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టుగా తెలిసింది. అందుకే బడాబాబులకు బిల్లులు క్లియర్ చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యనేత, మరో మంత్రికి సంబంధించిన బంధువులకు, అనుచరులకు చెందిన కంపెనీలకు కాంట్రాక్టుల బిల్లులు చెల్లించినట్టుగా సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. తద్వారా వందల కోట్ల కమీషన్లు కొల్లగొట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పథకం రద్దుకు కుట్ర

ఓ వైపు రైతుభరోసా కోసం తీసుకొచ్చిన 9వేల కోట్ల రుణం రైతులకు పంపిణీ చేయకపోవడం, మరోవైపు యాసంగి ముగింపు దశకు చేరుకున్నా ప్రభుత్వం రైతుభరోసా ఊసెత్తకపోవడంతో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైతుభరోసా పథకాన్ని రద్దు చేసే దిశగా కాంగ్రెస్ సర్కార్ అడుగులు వేస్తున్నదని మొదటి నుంచీ అనుమానాలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది మొదలు రైతుభరోసా పథకంపై ఒక అడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అనే విధంగానే కొనసాగుతున్నది. ఐదు సీజన్లలో ఒకే ఒక్క సీజన్‌లో మాత్రమే పూర్తిగా భరోసా ఇచ్చింది. మిగిలిన నాలుగు సీజన్లలో ఒక సీజన్ పూర్తి ఎగవేయగా, రెండు సీజన్లు సగం మందికి కూడా ఇవ్వకుండా ముగించేసింది. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో కూడా 'రైతుభరోసా ఎందుకు' అనే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఈ పథకం అమలు వల్ల ప్రభుత్వంపై ఏటా మోయలేనంత ఆర్థిక భారం పడుతున్నదని, అందువల్ల పథకాన్ని రద్దు చేసి పంటలకు బోనస్ ఇచ్చే పథకం గురించి ఆలోచించాలని కలెక్టర్లకు సూచించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే కాంగ్రెస్ సర్కార్ రైతుభరోసా పథకాన్ని చరిత్రలో కలిపేయబోతున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్లలో ఎమ్మెల్యే కవ్వంపల్లిని సమస్యలపై నిలదీస్తున్న గ్రామస్థులు

ఎమ్మెల్యే కవ్వంపల్లికి నిరసన సెగ

- 'రైతుభరోసా' ఇంకెప్పుడిస్తరు? వల్లంపట్లలో నిలదీసిన గ్రామస్తులు
- చెరువులు నింపాలని వినతి
- సమాధానం చెప్పకపోవడంతో ప్రజల్లో ఎమ్మెల్యేపై అసహనం

ఇల్లంతకుంట రూరల్, మార్చి 14: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు నిరసన సెగ తగిలింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్లలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు శనివారం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన్ను పలు సమస్యలపై నిలదీశారు. గ్రామంలోని వందలాది మంది రైతులకు ఉపయోగపడే బతుకమ్మ చెరువును ఎందుకు నింపడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రూ.15 వేల రైతు భరోసా ఇస్తానని రేవంత్‌రెడ్డి అన్నాడు.. ఇప్పుడు నాలుగు సీజన్ల రైతుభరోసా ఇయ్యలేదు.. ఇంకెప్పుడిస్తారని నిలదీశారు. గ్రామంలో రెండేండ్ల క్రితం రూ.20 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మిస్తే.. ఇంత వరకు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌ను అడగండి.. అంటూ ఎమ్మెల్యే సమాధానం చెప్పడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంపై మండిపడుతున్నారు.



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పరిధిలోని ఆరెపల్లిలో వరి ఎండిపోవడంతో పశువులను మేపుతున్న రైతు గొర్ల కొమురయ్య

రెండెకరాల్లో పొలం ఎండిపాయె..



నాకున్న రెండున్నరెకరాల భూమిలో రెండెకరాల్లో వరి వేసిన. పంట చేతికొచ్చే సమయంలో బాయి, బోరు రెండు ఒకేసారి అడుగంటాయి. నీళ్లు తగ్గుతూ వస్తున్నకొద్దీ రోజుకింత వరి ఎండిపోయింది. రెండెకరాల్లో ఒక ఎకరం వరకు పూర్తిగా ఎండిపోవడం వల్ల పశువులను మేపుతున్నా. మా భూములకు దగ్గరలో ఉన్న కుంట మత్తడి తెగిపోయి అందులో నీళ్లు లేకుండాపోయాయి. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదు. కుంటలో నీళ్లు లేకపోవడంతో మా బాయిలు, బోర్లలో నీళ్లు అడుగంటినయి. మిగిలిన ఎకరం కూడా ఎండిపోయేటట్టు ఉన్నది. గొలుసులు వేసి కోతకు వచ్చే ముందు పంట ఎండిపోవడం బాధనిపిస్తంది. పెట్టుబడులు రాక అప్పులు పెరిగే పరిస్థితి ఉన్నది. సర్కారోళ్లు ఏమైనా సాయం చేస్తే బయటపడుతం.

-గొర్ల కొమురయ్య, రైతు, ఆరెపల్లి, హుస్నాబాద్ (సిద్దిపేట జిలా)




రామ్‌లాల్ తండాలో నేలవాలిన మక్క పంటను చూపిస్తున్న రైతులు

నకిలీ విత్తనాలతో నట్టేట మునిగిన రైతులు

- మక్కపంట దెబ్బతినడంతో ఆందోళన

ఇనుగుర్తి, మార్చి 14 : నకిలీ విత్తనాలతో మక్క పంట నేలవాలి రైతులు నష్టపోయిన ఉదంతం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం తారాసింగ్ తండా జీపీ పరిధి రామ్‌లాల్ తండాలో వెలుగు చూసింది. తండాకు చెందిన ముగ్గురు రైతులు మూడు నెలల క్రితం వరంగల్‌లోని అమూల్య ఆగ్రోస్ ట్రేడర్స్ వద్ద మక్క విత్తనాలు కొనుగోలు చేసి 4 ఎకరాల్లో సాగు చేశారు. పంట చేతికొచ్చే దశలో చేను నేలవాలింది. గాలి.వానలు లేకున్నా నకిలీ విత్తనాలతోనే పంట దెబ్బతిన్నదని బాధిత రైతులు ఆవేదన చెందారు. దీనికి కారణమైన షాప్ యాజమాన్యంపై కేసు పెడతామని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించిన షాపు నుంచి తమకు పరిహారం అందించాలని అధికారులను కోరారు.



మాట్లాడుతున్న రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు రామారావు

హామీలు నెరవేర్చాలని నిరవధిక నిరాహార దీక్ష

హుజూరాబాద్, మార్చి 14 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతు ప్రజాసంఘాల సమాఖ్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకుడు ముచ్చా సమ్మిరెడ్డి శనివారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు రామారావు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోగా రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.



గాజులమల్కాపురంలో ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న గుండు వెంకన్నవరలక్ష్మి దంపతులు



పెన్‌పహాడ్ మండలం గూడెపుకుంట తండాలో గొర్లకు ఆహారం అవుతున్న ఎండిన వరి

కాళేశ్వరాన్ని పండబెట్టి.. పంటలెండబెట్టి

- కాంగ్రెస్ సర్కార్ తీరుపై రైతుల ఆగ్రహం
- వరుసగా మూడోసారి ఎండుతున్న వరి
- వేలాది ఎకరాలకు పారని గోదావరి
- ట్యాంకర్ల నీటితో పంటలను దక్కించుకునేందుకు రైతుల యత్నం
- ఎండిన పంటలు పశువులకు మేతగా
- నీళ్లు లేకపోవడంతో లక్షకుపైనే ఎకరాల్లో దెబ్బతింటున్న పంటలు
- ఆందోళనలో సూర్యాపేట జిల్లా రైతులు

నీళ్లు రాక ఐదెకరాలు ఎండింది



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నీళ్లివ్వక నేను వేసిన వరి ఎండిపోతూనే ఉన్నది. ఈ సారి కూడా ఐదెకరాలు వేస్తే మొత్తానికి మొత్తం ఎండిపోయింది. పంటలు వేసే సమయంలోనైనా నీళ్లివ్వలేమని చెబితే మరేదైనా పంట వేసేటోళ్లం. ఏదీ చెప్పకుండా ఉంటే కేసీఆర్ ఇచ్చినట్టే నీళ్లిస్తారనే ఆశతో వరి వేస్తున్నం. కానీ నీళ్లు రావట్లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను కరుణించి నీళ్లిచ్చి ఆదుకోవాలి.

- అబ్బగాని లింగయ్య, ఆత్మకూర్.ఎస్

సూర్యాపేట, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో నీటి చుక్కకు ఎరుగని ప్రాంతం గత బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యమా అని సస్యశ్యామలం కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండున్నరేండ్లలో తిరిగి రైతులకు గడ్డు పరిస్థితులు దాపురించాయి. చిన్నపాటి సాకును చూపించి కాళేశ్వరం ప్రాజెక్టును పండబెట్టి తమ నోట్లో మట్టికొడుతుందని.. వరుసగా మూడోసారి పంటలను ఎండబెడుతున్నదని రైతులు కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడుతున్నారు. సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఎస్సారెస్పీ ఫేజ్-2 కింద సుమారు 2.21 లక్షల ఎకరాలకు కాలువల ద్వారా నేరుగా చెరువులు, కుంటలు నింపడం ద్వారా మరో 45 వేలు మొత్తం 2.66 లక్షల ఎకరాలకు నీరందించాలనేది లక్ష్యం. 2004 నాటికే ప్రాజెక్టు లేకుండా నికర జలాల లెక్క తేలకుండానే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం ఎస్సారెస్పీ కాలువలు తవ్వగా 2018 వరకు ఒక్క చుక్క నీరు రాలేదు. పోరాడి సాధించిన తెలంగాణకు ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ ఇంచు భూమి వదలకుండా సస్యశ్యామలం కావాలని కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయడంతో 2018లో జిల్లాకు తొలిసారి నీళ్లు చేరాయి. అంతకుమునుపు యాసంగిలో 2.66 లక్షల ఆయకట్టుకు గాను 50వేల ఎకరాలకు మించి వరి పండించలేదని వ్యవసాయశాఖ లెక్కలే చెప్తుండగా కాళేశ్వరం పూర్తయిన తరువాత 2023 వరకు యాసంగిలో వందశాతం వరి పంట పండుతూ వచ్చింది. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తుంగతుర్తి, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, నాగారం, మద్దిరాల, నూతనకల్ ఆరు మండలాలతోపాటు సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూర్.ఎస్, చివ్వెంల, సూర్యాపేట, పెన్‌పహాడ్ నాలుగు మండలాలు, కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతె, నడిగూడెం, మునగాల మూడు మండలాలు మొత్తం జిల్లాలోని 13 మండలాలకు కాళేశ్వరం నీళ్లు వచ్చాయి. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిన్న సాకును చూపి కాళేశ్వరాన్ని పండబెట్టడంతో 2024 యాసంగిలోనే జిల్లాలో దాదాపు 75 వేలకుపైనే ఎకరాల్లో వరి పంట ఎండటం... ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్ తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో పంటలను పరిశీలించివెళ్లిన విషయం తెల్సిందే. తదనంతరం 2025 యాసంగిలో లక్ష ఎకరాల వరకు ఎండింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వచ్చిన మూడో యాసంగిలో ఇప్పటికే జిల్లావ్యాప్తంగా వరి ఎండుతుంది. జిల్లాలో ఎండిన వరిని గాలికి వదిలేసి ఇప్పుడిప్పుడే ఎండిపోతూ కాస్త పచ్చగా ఉన్న వరి పొలాలను రైతులు ఎకరా ఒక్కంటికి రూ.వెయ్యి నుంచి రూ.1,500కు గొర్లు, పశువుల మేతకు విక్రయిస్తున్నారు. అంతేకాకుండా 40 రోజుల క్రితం నాట్లు వేసిన పొలాలు దాదాపు 10 వేల ఎకరాల్లో ఎండిపోయినట్టు తెలుస్తున్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఎస్సారెస్పీ ఆయకట్టులో మరో లక్షకు పైనే ఎకరాల్లో ఎండిపోయి తీవ్ర నష్టం చేకూరే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపులుమాని కాళేశ్వరం పంపులను ఆన్‌చేసి పంటలను కాపాడాలని, లేనిపక్షంలో ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రానికి 'వడగండ్ల' ముప్పు

- ఈ నెల 16 నుంచి 23 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ద్రోణి ప్రభావంతో రాష్ట్రానికి వారంపాటు వడగండ్ల వాన ముప్పు పొంచి ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఈనెల 16 నుంచి 23 వరకు పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఆది, సోమవారాల్లో కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో అకాల వర్షాలు పడతాయని తెలిపింది. రానున్న నాలుగైదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీలు తగ్గే అవకాశాలున్నాయని పేర్కొన్నది. వరుస వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా పశువులు, పంట ఉత్పత్తులు, వ్యవసాయ పరికరాలు సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని పేర్కొన్నది. ఇదిలా ఉండగా, వారంపాటు వడగండ్ల వానలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలులతో కూడిన వానలకు మామిడి కాయలు రాలిపోయే ప్రమాదమున్నదని వాపోతున్నారు. ఇంతకాలం కాపాడుకున్న పంట నేలపాలై తీవ్ర నష్టం సంభవిస్తుందేమోనని మదనపడుతున్నారు. అకాల వర్షాలతో పొట్టదశలో ఉన్న వరిలో తెగుళ్ల ఉధృతి పెరిగే అవకాశం ఉంటుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

కరెంట్ కోతలతో రైతన్న పరేషాన్

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వచ్చే రెండు నెలలు గడ్డురోజులే
- వరంగల్ జిల్లా రైతుల ఆందోళన

వరంగల్, మార్చి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'ఎట్లున్నవే నా పల్లె.. ఎట్లున్నవే నా తల్లీ' అని తెలంగాణ పల్లెను మళ్లీ ఇవ్వాళ మందలివ్వాల్సిన పరిస్థితి దాపురించిందా? అంటే క్షేత్రస్థాయిలో నెలకొన్న వాతావరణం అవుననే అంటున్నది. రేవంత్ సర్కార్ పుణ్యమా అని ఏ రైతును కదిలించినా జిల్లాలో అగమ్యగోచరమైన పరిస్థితులే కండ్ల ముందు దర్శనమిస్తున్నాయి. ఇప్పుడే గిట్లుంటే.. వచ్చే రెండు నెలలు 'చావుమర్నమే' ఉన్నది అని జయశంకర్ – భూపాపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం గణేశ్‌పల్లి రైతు లడే రవీందర్ వెలిబుచ్చిన ఆవేదనతో రాష్ట్ర రైతాంగం ఏకీభవించే పరిస్థితులు నెలకొన్నాయి. కరెంట్ ఉన్నకాడ నీళ్లు ఉండవు.. నీళ్లున్నకాడ కరెంట్ ఎప్పుడొస్తదో తెలియని దుస్థితి వరంగల్ జిల్లాలో నెలకొన్నది. అసలే చాలీచాలనీ నీళ్లు ఆపై అప్రకటిత కరెంట్ కోతలు అన్నట్టే ఉన్నది. వరంగల్ జిల్లా ఒక్క సంగెం మండలంలోనే బొల్లికుంట, కాపులకనిపర్తి, ఆశాలపల్లి, గవిచర్ల, లోహిత, రామచంద్రాపురం సహా 13 గ్రామాల్లో దేవాదుల నీరు రాక పంటలు ఎండుతున్నాయి. దేవాదుల ప్రాజెక్టుతో అనుసంధానమైన కాలువ ద్వారా చెరువులు నిండితే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదు. నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవటంతో మక్కజొన్న, వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంకో 20 రోజులైతే మక్కజొన్న, నెలన్నర, రెండు నెలలైతే వరి చేతికి వస్తుందని, ఇప్పుడు ఎలాగోలా తడి తప్పిచ్చి తడి పెట్టినా పంటలను కాపాడుకోవచ్చు.. కానీ, పొట్టకొచ్చాక మాత్రం నీళ్లు పెట్టుకపోతే కష్టమంతా ఆవిరైపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జయశంకర్–భూపాలపల్లి, వరంగల్, ములుగు జిల్లాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. జయశంకర్–భూపాలపల్లి జిల్లాలో సగటును మూడు మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయని, ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న 15–20 రోజుల్లో ఎండల తీవ్రత పెరిగి, వేసిన పంటలకు నీటి అవసరం పెరిగే అవకాశం పుష్కలంగా ఉంటే భూగర్భ జలాలు మరింత కిందికి పోయే ప్రమాదం ఉందనే ఆందోళన నెలకొన్నది.

పంటలు ఎండితే వాళ్లకేంది?



కాలువ అంచున చేను. అయినా నీళ్లు లేక పంట ఎండిపోయింది. మొన్న వానకాలంలో మూడున్నర ఎకరాల్లో మక్కజొన్న వేసిన. అప్పుడు వానలెక్కువై జాలువట్టి పంట దిగుబడి రాలే. ఇప్పుడు యాసంగిలో కూడా అదే మక్కజొన్న వేసిన. కాలువ పక్క ఉన్న పంట మంచిగ పండుద్ది అనుకున్న. కానీ, నీళ్లు రాక ఎండిపోయింది. ఎలక్షన్లప్పుడు నాయకులు వత్తరు కని.. పంటలప్పుడు వాళ్లకేం అక్కెర. పంట కోసం బావికాడనే ఉంటం. బుక్కెడు బుక్కెడు నీళ్లు తాగి పనులు చేసుకుంటం. పంట ఎండిపోయింది.. పెట్టుబడి కూడా రాకపాయే.

-మద్దూరి కట్టమల్లు, రామచంద్రాపురం, సంగెం మండలం వరంగల్ జిల్లా

అసలు కాలం ముందున్నది



ఎండాకాలం మొదలు మొదలే గిట్లుంటే వచ్చే రెండునెలలు (ఏప్రిల్, మే) మరింత అధ్వానమే ఉండేటట్టు ఉన్నది. కరెంట్ కోత షురువైంది. కరెంట్ ఇష్టమొచ్చినట్టు వస్తుంది. ఇష్టమొచ్చినట్టు పోతుంది. అడిగినా పట్టిచ్చుకునేడే లేడు. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ పోవుడు అన్న ముచ్చటే లేకపోయేది.

-లడే రవీందర్, మొగుళ్లపల్లి మండలం గణేశ్‌పల్లి, భూపాలపల్లి జిల్లా

కిలో టమాట రూపాయి

నర్సింహులపేట, మార్చి 14 : మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో టమాట సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. 25 కిలోల టమాట పెట్టెకు రూ.25 నుంచి రూ.50 మాత్రమే ధర పలుకుతున్నది. అంటే కిలోకు రూపాయి నుంచి రెండు రూపాయలలోపే. టమాట సాగు చేస్తే పెట్టుబడికి, కూలీలకు కూడా సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నర్సింహులపేట మండలం జయపురం, పెద్దనాగారం స్టేజీ జీపీ పరిధిలో టమాట సాగు చేస్తున్న రైతులు యాకూబ్, అశోక్‌రెడ్డి పంటలను వదిలేశారు. టమాట అవసరమైన వారు తోటలో ఉచితంగా తీసుకెళ్లొచ్చంటూ సోషల్ మీడియాలో పోస్టుచేయడం వైరల్‌గా మారింది.





సిద్దిపేట జిల్లా నంగునూరు మండల నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అధికారులు

రైతులు వరి సాగు చేయొద్దు

- వరిని వదలకపోతే మీకే నష్టం
- వడ్లు కొనబోమంటున్న కేంద్రం
- ప్రత్యామ్నాయ పంటలు వేయాలి
- ఆయిల్‌పామ్ సాగు మేలు
- 22న నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- మంత్రి తుమ్మల వెల్లడి

సిద్దిపేట, మార్చి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'తెలంగాణ నుంచి వడ్లు కేంద్రం కొనేపరిస్థితి లేదు. బియ్యం ఇక నుంచి కొనుగోలు చేయబోం. ఇక మీ ఇష్టం' అని కేంద్ర ప్రభుత్వం నిక్కచ్చిగా చెప్పిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట మార్పిడి పాటించకపోతే రైతులు భవిష్యత్తులో బాగా నష్టపోతారని పేర్కొన్నారు. వరి వేస్తే నీటి సమస్యతోపాటు వడగండ్ల వర్షాలతో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు చెప్పారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఉద్యాన, వాణిజ్య పంటలు వేసుకోవాలని, వరి మాత్రం సాగు చేయొద్దని సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయిల్‌ఫెడ్ అధికారులతో కలిసి తుమ్మల పరిశీలించారు. ఫ్యాక్టరీ ప్రారంభానికి రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు వస్తారని, మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధికంగా తెలంగాణలోనే వరి సాగు అవుతుందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఎప్పుడు ఇంత వరి పండిన సందర్భం లేదని, పంజాబ్‌లోనూ వరి ఇంతగా లేదని పేర్కొన్నారు. వరి వేయడం వల్ల అందరికి కష్టాలు తెచ్చే పరిస్థితి వస్తుందని తెలిపారు. అందుకే పంటల మార్పిడి తప్పనిసరి అని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో ఆయిల్‌పామ్ తప్ప మరో పంట లేదని చెప్పారు. అర్జెంట్‌గా ఇంత ఆదాయం వచ్చే మరో పంట లేదని పేర్కొన్నారు. నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఈనెల 22న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్టు మంత్రి తుమ్మల తెలిపారు. ఏప్రిల్ నుంచి సీజన్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఉత్తర తెలంగాణతోపాటు మిగతా జిల్లాల నుంచి వచ్చే పంట మొత్తం నర్మెట ఫ్యాక్టరీకే రావాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో పండే ప్రతి గెలా నష్టపోకుండా ప్రాసెస్ చేసే విధానం ఇక్కడ ఉన్నదని తెలిపారు. తెలంగాణలో క్రూడాయిల్ ఉన్నప్పటికీ రిఫైండ్ లేదని, సీఎంను అడిగి రిఫైండ్ కూడా ఇక్కడే ఏర్పాటు చేసుకోబోతున్నామని చెప్పారు. అదేరోజు దానికి భూమి పూజ చేస్తామని వెల్లడించారు.

ఇరిగేషన్‌లో పైరవీల ప్రవాహం!


నెలాఖరున ఖాళీ కానున్న 2 ఈఎన్సీ పోస్టులు • కీలక స్థానాల కోసం కొనసాగుతున్న పైరవీలు

- ఇప్పటికే అడ్డదారిలో పోస్టుల భర్తీ
- ప్రభుత్వం తీరుపై సంఘాల అభ్యంతరం

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): నీటిపారుదల శాఖలో పైరవీల జోరు మొదలైంది. రెండు కీలక ఈఎన్సీ పోస్టులు ఈ నెలాఖరులో ఖాళీ కానున్నాయి. ఈఎన్సీ రమేశ్‌బాబు, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్‌ఎం) ఈఎన్సీ శ్రీనివాస్ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. వాటిని దక్కించుకునేందుకు పలువురు ఇంజినీర్లు పోటీ పడుతున్నారు. సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, స్థాయికి తగ్గట్టుగా పైరవీలు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా అడ్డదారుల్లో వచ్చిన వారినే అందలం ఎక్కిస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈఎన్సీ పోస్టులు అర్హులకు దక్కుతాయా? లేదా ప్రభుత్వ పెద్దలు సీనియార్టీతో సంబంధం లేకుండా తమకు నచ్చినవారికి పట్టం కడతారా? అని జలసౌధలో జోరుగా చర్చ జరుగుతున్నది.

అర్హులు ఉన్నా..

ప్రభుత్వం రెండు నెలల కిందటే డీపీసీ (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) ద్వారా పలువురు సీఈలకు ఈఎన్సీలుగా ఉద్యోగోన్నతి కల్పించింది. వారిలో రమేశ్‌బాబు కూడా ఉన్నారు. ఆయనతోపాటు ఈఎన్సీ అడ్మిన్ తమటం శ్రీనివాస్, కరీంనగర్ ఈఎన్సీ, నిజామాబాద్ సీఈ మధుసూదన్‌రావు, వాలంతరీ డీజీ అనితకు ప్రమోషన్ కల్పించింది. నెలాఖరున ఖాళీ కానున్న రెండు ఈఎన్సీ పోస్టులు అత్యంత కీలకమైనవి కావడంతో వీరిని పరిగణనలోకి తీసుకుంటారా? లేదా అనే చర్చ జరుగుతున్నది. ఈఎన్సీ మధుసూదన్ పేరు పరిశీలనలో ఉన్నా, ఆయన ఏపీ క్యాడర్ కావడంతో అవకాశం ఇస్తారా? అన్న సందేహం నెలకొంది. ఆయన ఇప్పటికే నిజామాబాద్ సీఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం వాలంతరీ డీజీగా కొనసాగుతున్న అనితకు అవకాశాలున్నాయని అంటున్నారు. అయితే అడ్మిన్‌లో డిప్యూటీ ఈఎన్సీగా పనిచేసిన ఆమెను గతంలోనే ప్రభుత్వం కావాలని పక్కన పెట్టినట్టు చర్చ జరుగుతున్నది. ఆమె కూడా ఈఎన్సీ పోస్టుపై అంత సుముఖంగా లేరని చెప్పుకుంటున్నారు. మరోవైపు మరో ఆరు నెలల దాకా డీపీసీ వేయడానికి అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఖాళీ కాబోతున్న ఈఎన్‌సీ జనరల్, ఓ అండ్ ఎం పోస్టుల నియామకంపై ఆసక్తి నెలకొన్నది.



ప్రభుత్వంపై ఇంజినీర్ సంఘాల ఆగ్రహం

ప్రభుత్వ తీరుపై ఇంజినీరింగ్ సంఘాలు ఇప్పటికే గుర్రుగా ఉన్నాయి. సీనియర్లను పక్కనపెడుతూ జూనియర్లకు కీలక బాధ్యతలను అప్పగించడాన్ని ఆక్షేపిస్తున్నాయి. ఎన్నికల సందర్భంగా ఎక్స్‌టెన్షన్లను ఇవ్వబోమని చెప్పినా, తాజాగా పలువురికి ఎక్స్‌టెన్షన్లు ఇచ్చిందని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఖాళీ అవుతున్న ఈఎన్సీ పోస్టుల భర్తీకి సైతం ఇంజినీరింగ్ సంఘాలు పలు డిమాండ్లను వినిపిస్తున్నాయి. ఇరిగేషన్‌శాఖలో దీర్ఘకాలంగా ప్రమోషన్లు నిలిచిపోవడంతో అనేకమంది సీనియర్లు ఇప్పటికే నష్టపోయారని, ఈఈ, ఎస్‌ఈలుగా విరమణ పొందారని గుర్తుచేస్తున్నారు. నిరుడు 13మంది ఎస్‌ఈలకు సీఈలుగా ఆలస్యంగా ప్రమోషన్లను కల్పించారని, అందులో అనేకమంది సీనియర్లు ఉన్నారని చెప్తున్నారు. సీఈగా ఏడాది కాలం సర్వీసు పూర్తిచేయాలనే నిబంధనను సాకుగా చూపి డీపీసీ ఏర్పాటు చేయడం లేదని అంటున్నారు. దీంతో వారు ఈఎన్సీగా అవకాశం పొందని పరిస్థితి నెలకొన్నదన్నారు. ప్రభుత్వం ఎక్స్‌టెన్షన్లు ఇవ్వకుండా, జూనియర్లకు ఈఎన్సీలుగా అవకాశమివ్వకుండా, సీనియర్లకే మొదటి ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నారు. వనపర్తి సీఈ పీవీ నాగేంద్ర, సీఈ సీడీవో ఎం సత్యనారాయణరెడ్డి, మహబూబ్‌నగర్ సీఈ ఏ సత్యనారాయణరెడ్డి తదితర సీనియర్లకే ఎఫ్‌ఏసీలుగా అవకాశం కల్పించాలని ఇంజినీర్ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సీఈ ఖాళీలను భర్తీ చేయాలని కోరుతున్నాయి.

పైరవీల జోరు..

ఖాళీ అవుతున్న ఈఎన్సీ పోస్టుల కోసం పలువురు ఇంజినీర్లు జోరుగా పైరవీ చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. ఓఅండ్‌ఎం విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు సీఈలు సచివాలయంలోని ఓ కీలక అధికారి ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్టు జలసౌధలో చర్చ జరుగుతున్నది. కొందరు సీనియర్ సీఈలు సీఎంవో స్థాయిలో, మరికొందరు తమకు తెలిసిన ప్రజాప్రతినిధుల ద్వారా పోస్టుల కోసం లాబీయింగ్ చేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. దీనికి ప్రభుత్వ శైలి కారణమనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఇరిగేషన్ శాఖలో ఇప్పటికే అనేక చోట్ల ఎస్‌ఈలు, అనేక సర్కిళ్లలో ఈఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. ప్రమోషన్లను కల్పించి ఆయా పోస్టులను భర్తీ చేయాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. డీపీసీ ఏర్పాటు చేయకుండా, అర్హులైన ఇంజినీర్లకు ప్రమోషన్లు కల్పించకుండా చోద్యం చూస్తున్నది. ఇన్‌చార్జులు, ఇతరులకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ నెట్టుకొస్తున్నది. వాస్తవానికి ఈఎన్సీ, సీఈ, ఎస్‌ఈ, ఈఈ ఇలా ఏ పోస్టు ఖాళీ అయినా వెంటనే సీనియారిటీ జాబితాలో అక్కడే ఉన్న ఇంజినీర్‌కు, ఒకవేళ అక్కడ సీనియర్ ఇంజినీర్ లేకుంటే ఆ బాధ్యతలను పక్కనే ఉన్న ఇతర సీఈ, ఎస్‌ఈ, ఈఈలకు అప్పగించడం ఆనవాయితీ. కానీ ప్రభుత్వం ఆ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కిందని విమర్శలు ఉన్నాయి. నచ్చినోళ్లకు, పైరవీలు చేసినోళ్లకే బాధ్యతలను అప్పగిస్తూ వస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే తరహాలో నెలాఖరున ఖాళీ కానున్న రెండు ఈఎన్సీ పోస్టులను సైతం అడ్డదారిలో వచ్చినవారితో భర్తీ చేస్తారనే ప్రచారం జరుగుతున్నది. ఆశావాహ ఇంజినీర్లు తమవంతుగా పైరవీలను ముమ్మరం చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.



భట్టి ఇంటికి చంద్రబాబు

నవదంపతులకు ఆశీర్వాదం

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ఏపీ సీఎం నారా చంద్రబాబు శనివారం హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నివాసానికి వచ్చారు. నవదంపతులైన భట్టి కుమారుడు సూర్య విక్రమాదిత్య, కోడలు సాక్షికి పుష్పగుచ్ఛాలు అందించి ఆశీర్వదించారు. ఈనెల 5న సూర్య విక్రమాదిత్య వివాహం జరుగగా, బిజీ షెడ్యూల్ కారణంగా చంద్రబాబునాయుడు హాజరు కాలేకపోయారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

మహిళలు మార్పునకు నాయకత్వం వహించాలి : సీతక్క

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): 'దేశాభివృద్ధిలో మహిళలు భాగస్వాములుగా మాత్రమే ఉండవద్దు.. మార్పుకు నాయకత్వం వహించాలి.. ఉద్యోగార్థులుగా కాదు.. ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలి' అని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. శనివారం ఢిల్లీలో యువర్ స్టోరీ వ్యవస్థాపకురాలు శ్రద్ధాశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన 'షీ స్పార్క్స్-2026' కార్యక్రమానికి శనివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నేతలను ఒకే వేదికపై తీసుకొచ్చిన యువర్ స్టోరీ జాతీయ మీడియా సంస్థ బాధ్యులను ఆమె అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో సెర్ప్ ద్వారా 46 లక్షలకుపైగా మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి సామాజిక, ఆర్థిక మార్పుల్లో కీలకభూమిక పోషిస్తున్నారని తెలిపారు. మహిళలు ఆర్థిక బలోపేతంతోనే కుటుంబాలు బాగుపడుతాయని అభిప్రాయపడ్డారు.

యూ వీసాల కోసం ఫేక్ దోపిడీలు

11 మంది భారతీయుల అరెస్ట్

వాషింగ్టన్, మార్చి 14: అమెరికాలో వీసాల జారీ ఆంక్షలు కఠినతరం కావడంతో అక్కడ అమల్లో ఉన్న నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ఫేక్ దోపిడీలకు పాల్పడిన 11 మంది భారతీయులను అమెరికా ఫెడరల్ అధికారులు అరెస్ట్ చేశారు. యూ వీసా కోసం దరఖాస్తు చేసుకుంటూ బాధితుల హోదాను తప్పుగా పొందేందుకు దుకాణాల్లో సాయుధ దోపిడీలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై వీరిని మాసాచుసెట్స్, బోస్టన్‌లో యూఎస్ అధికారులు అరెస్ట్ చేశారు. అసలు ఇదంతా ఎలా జరుగుతుందంటే.. కొన్ని చిన్న స్టోర్లలో నకిలీ దొంగతనానికి ఉద్యోగులు ప్రణాళిక వేస్తారు. దీనిని నిర్వహించేందుకు వారే దోపిడీ దొంగల అవతారం ఎత్తుతుంటారు. దీని ప్రకారం వారిలో ఒక వ్యక్తి ముసుగు ధరించి చేతిలో ఆయుధంతో స్టోర్‌లోకి ప్రవేశించి అక్కడ ఉన్న సిబ్బందిని బెదిరించి కొంత సొమ్ము అపహరించుకుపోతాడు. ఈ దోపిడీ అంతా అక్కడ ఉన్న సీసీటీవీల్లో రికార్డు అవుతుంది కాబట్టి, దర్యాప్తునకు వచ్చిన పోలీసులు అక్కడ చోరీ జరిగినట్టు నివేదిస్తారు. ఇక్కడే అసలు మర్మం ఉంది. అలా దోపిడీకి గురైన ఉద్యోగులను ఒక బాధిత క్యాటగిరీగా భావిస్తారు. అలాంటి వారు యూ నాన్ ఇమిగ్రెంట్ వీసా (యూ వీసా)కు దరఖాస్తు చేసుకుంటే సులువుగా మంజూరు చేస్తారు. యూ వీసా పొందడం కోసం కొందరు భారతీయులు ఇలా తప్పుడు దారిలో ప్రయత్నించి అడ్డంగా బుక్కయ్యారు. మసాచుసెట్స్‌లో ఆరుగురు, బోస్టన్‌లో నలుగురు భారతీయులను అరెస్ట్ చేశారు. నిందితులు 2023 నుంచి ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

హెచ్‌సీఏ నుంచి కోట్లు కొల్లగొట్టే కుట్ర

గడ్డం సోదరులపై బాబూరావు సాగర్ ఆరోపణ

- రాజీవ్‌గాంధీ పేరు పెట్టినందుకు 70 కోట్ల నష్టపరిహారం
- హెచ్‌సీఏ పదవుల్లో ఉంటూ విశాఖ సంస్థకు లబ్ధి చేకూర్చే యత్నం
- ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్



ఖైరతాబాద్, మార్చి 14: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) మాటున మంత్రి గడ్డం వివేక్, ఆయన సోదరుడు గడ్డం వినోద్ రూ. కోట్లు కొల్లగొట్టారని సాగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి చాతిరి బా బూరావుసాగర్ ఆరోపించారు. హెచ్‌సీఏ లో 20 ఏండ్లపాటు వివిధ పదవుల్లో ఉన్న వివేక్, వినోద్ లోపాయికారిగా తమకు అనుకూలమైన ఒప్పందాలు చేసుకొని నిధులను తమ విశాఖ సంస్థకు మళ్లించుకున్నారని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బాబూరావు శనివారం మీడియాతో మాట్లాడారు. ఉప్పల్‌లో నిర్మించిన క్రికెట్ స్టేడియానికి నాటి తెలుగుదేశం ప్రభుత్వం భూమి కేటాయించిందని, స్టేడియం నిర్మాణానికి స్పాన్సర్‌గా విశాఖ ఇండస్ట్రీస్ ముందుకొచ్చిందని తెలిపారు. స్టేడియం నిర్మాణానికి రూ.6 కోట్లు ఇస్తామని విశాఖ సంస్థ అధిపతి వివేక్ తెలిపారని, తమ ప్రయోజనాలకు భంగం కలిగితే ఆరు రెట్లు నష్టపరిహారం చెల్లించాలని ఒప్పందం చేసుకున్నారని వివరించారు. ఈ ఒప్పందంలో నాటి కార్యదర్శి శివలాల్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్‌గా జీ వినోద్, వివేక్ భాగస్వాములని తెలిపారు. ఈ ఒప్పందం గురించి కమిటీ సభ్యులెవరికీ తెలుపలేదని, జనరల్ బాడీలో చర్చించలేదని చెప్పారు. ఒప్పందంలో భాగంగా స్టేడియానికి విశాఖ పేరు పెట్టాలని ప్రతిపాదించారని, ఇందుకు నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంగీకరించలేదని తెలిపారు. మధ్యేమార్గంగా రాజీవ్‌గాంధీ పేరు పెట్టారని గుర్తుచేశారు. ఈ మార్పు ఇష్టం లేనప్పుడు వివేక్, వినోద్ అప్పుడే వైదొలగాల్సి ఉండేదని అన్నారు. స్టేడియానికి పేరు మార్పు సీఎం నిర్ణయమని, ఇందులో హెచ్‌సీఏ తప్పిదమేమీ లేదని చెప్పారు. ఈ క్రమంలో లీజు రద్దు కావడంతో తమకు నష్టపరిహారం చెల్లించాలని వివేక్ కోర్టుకు వెళ్లారని తెలిపారు. అప్పటికీ వారు స్టేడియం కోసం వెచ్చించింది రూ.4.32 కోట్లు మాత్రమేనని వివరించారు. 2004 నుంచి 2017 వరకు వినోద్, వివేక్ హెచ్‌సీఏలో వివిధ పదవుల్లో ఉంటూనే తమ విశాఖ సంస్థ తరపున హెచ్‌సీఏపై కేసులు వేశారని చెప్పారు. ఇటు హెచ్‌సీఏ తరపున తమకు అనుకూలమైన న్యాయవాదిని నియమించి విశాఖకు అనుకూలంగా తీర్పు వచ్చేలా ప్రయత్నించారని వివరించారు. 2016లో కోర్టు తీర్పు వచ్చినప్పుడు కూడా వివేక్ హెచ్‌సీఏ ఎగ్జిక్యూటివ్ కమిటీలో ఉన్నారని, కానీ ఆ సమస్యను పరిష్కరించేందుకు బదులుగా విశాఖ తరపున లబ్ధిదారుడు తానే గనుక ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. 2017లో హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా ఉన్న వివేక్ విశాఖ సంస్థకు అనుకూలంగా మాట్లాడారని ఆరోపించారు. విశాఖ సంస్థ తరపున నష్టపరిహారంగా రూ.70 కోట్లు క్లెయిమ్ చేస్తూ మరోవైపు హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా ఉంటూ ఆ పరిహారం చెల్లించేవిధంగా చర్యలు తీసుకున్నారని వివరించారు. కేవలం రాజీవగాంధీ పేరు పెట్టినందుకు డ్యామేజ్ సూట్ వేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. 20 ఏండ్లుగా హెచ్‌సీఏలో రూ. కోట్లు మంత్రి సంస్థకు బదిలీ అయ్యాయని విమర్శించారు.

ప్రభుత్వం విచారణ జరపాలి:

హెచ్‌సీఏలో రూ. కోట్ల నిధుల కుంభకోణం విషయంలో ప్రభుత్వం దర్యాప్తు జరపాలని బాబూరావు డిమాండ్ చేశారు. అసోసియేషన్‌లో జమచేసిన రూ.100 కోట్ల నిధులు మంత్రి సంస్థకు చెందిన ఖాతాకు వెళ్లాయని అన్నారు. సీఎం రేవంత్ వెంటనే కలుగజేసుకోవాలని కోరారు.



నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో చెంచుల ఆర్థిక పరిస్థితులను గవర్నర్‌కు వివరిస్తున్న కలెక్టర్ సంతోష్, అధికారులు

చెంచుల జీవన ప్రమాణాలపై గవర్నర్ ఆరా

అమ్రాబాద్, మార్చి 14 : నల్లమల అడవుల్లో నివసిస్తున్న చెంచుల జీవన ప్రమాణాలు, వారి ఆర్థిక పరిస్థితులపై రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆరా తీశారు. శనివారం కుటుంబ సమేతంగా శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జునస్వామి దర్శన అనంతరం తిరుగు ప్రయాణంలో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని తెలంగాణ టూరిజం మృగవణి విశ్రాంతి భవనంలో కొద్దిసేపు ఆయన విరామం తీసుకున్నారు. కలెక్టర్ సంతోష్, డీఎఫ్‌వో రేవంత్ చంద్రతో కలిసి గవర్నర్‌కు స్వాగతం పలకగా.. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. గవర్నర్ దత్తత తీసుకున్న చెంచుపెంటల్లో చేపడుతున్న సోలార్ విద్యుత్, తాగునీటి సదుపాయాలు, నిధుల వినియోగం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంక్షేమ పథకాల గురించి అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ఏటీఆర్ పరిధిలో ఉన్న సహజ వనరులు, జలపాతాలు, వన్యమృగ సంపద, శైవక్షేత్రాలు, చారిత్రక కట్టడాలు, ఎకో టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలపై కలెక్టర్ వివరించారు. అడవుల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణుల, టూరిజం డెవలప్‌మెంట్ ప్రణాళికలను డీఎఫ్‌వో వివరించారు. అనంతరం పెద్దపులి ఛాయాచిత్రం జ్ఞాపికను గవర్నర్‌కు అధికారులు అందజేశారు.

'స్థానిక' ఎన్నికల్లో అక్రమాల పర్వం

రూ.13 కోట్లకుపైగా నగదు, ఇతర వస్తువులు సీజ్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అభ్యర్థులు సిద్ధం చేసిన వివిధ రకాల వస్తువులు భారీ స్థాయిలో పట్టుబడ్డాయి. వాటి విలువ రూ.13 కోట్ల పైమాటే. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వ్యవస్థాపకుడు పల్నాటి రాజేంద్ర ఆర్టీఐ చట్టం ద్వారా ఎస్‌ఈసీ నుంచి ఈ వివరాలు సేకరించి, శనివారం మీడియాకు విడుదల చేశారు. జీపీ ఎన్నికల్లో రూ.2,48,08,440 నగదుతోపాటు రూ.7,35,14,683 బంగారం, మద్యం, డ్రగ్స్ పట్టుబడ్డాయి. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్నికల్లో రూ.1,56,29,170 నగదు, రూ.1,99,46,440 బంగారం, మద్యం, డ్రగ్స్ ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై 2,547 కేసులు నమోదు చేశారు.

ఎన్నికలు	సీజ్ చేసిన నగదు (రూ.కోట్లలో)	సీజ్ చేసిన వస్తువుల విలువ (రూ.కోట్లలో)	నమోదైన కేసులు
పంచాయతీ	2.48	7.35	4,246
మున్సిపల్	1.56	1.99	2,547
మొత్తం	4.04	9.34	6,793

పట్టణపేదల 'ఇంటి' గోస!

- కేంద్రం నుంచి మంజూరైన ఇండ్లు 1.3లక్షలు.. దరఖాస్తులు 25 లక్షలు
- పట్టణాల్లో దొరకని ఇండ్ల స్థలాలు దూరప్రాంతాలకెళ్లేందుకు విముఖం
- పేదల ఇండ్లు పూర్తయ్యేది ఎప్పడో?



హైదరాబాద్, మార్చి 14(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్రంలోని పట్టణ పేదలకు అందని ద్రాక్షగానే మిగిలేలా ఉన్నది. ఎన్నికల ముందు నుంచి ఊరిస్తూ వచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా పట్టణాల్లో ఆ పథకం అమలు ఊసే ఎత్తలేదు. కేంద్రం ఇప్పటివరకు కేవలం 1.31లక్షల ఇండ్లు మాత్రమే మంజూరు చేయగా, పట్టణ పేదల నుంచి వచ్చిన దరఖాస్తులు మాత్రం 25 లక్షలకు పైగా ఉండటమే అందుకు నిదర్శనం. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వ నిధులపై ఆధారపడుతున్న రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్, రానున్న రెండున్నరేండ్లలో కనీసం పదో వంతు మందికైనా ఇండ్లు నిర్మిస్తుందో? లేదో? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఐదేండ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వగా, రెండున్నరేండ్లు గడిచినా, ఒక్క ఇల్లు నిర్మాణం కూడా పూర్తికాలేదు. మొదటి విడతలో 4.5లక్షల ఇండ్లు మంజూరు చేయగా, నిర్మాణంలో ఉన్న ఇండ్లు కేవలం 2.70 లక్షలు మాత్రమే. స్థలాల లభ్యత లేకపోవడం వల్ల హైదరాబాద్ సహా ఇతర పట్టణ ప్రాంతాల్లో ఇంతవరకు ఇండ్ల నిర్మాణం చేపట్టనేలేదు. పేదలు నివసిస్తున్న బస్తీల్లోనే వారిని ఖాళీ చేయించి టవర్లు నిర్మించాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ నిర్మాణం సకాలంలో పూర్తవుతుందో? లేదో? అనే అనుమానంతో చాలామంది ఒప్పుకోవడం లేదు. దీంతో ప్రస్తుతానికి గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే ఇండ్ల నిర్మాణం కొనసాగుతున్నది.

ఇదీ పట్టణ ఇండ్ల పరిస్థితి

పట్టణ పేదల కోసం కేంద్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద ఇప్పటివరకు రాష్ట్రానికి 1,31,213 ఇండ్లు మంజూరు చేసింది. తొలి విడతలో నిరుడు 1.13 లక్షల ఇండ్లకు రూ.1,500 కోట్లు, రెండో విడతలో 18,213 ఇండ్లకు మరో రూ.27 3 కోట్లు మంజూరు చేసింది. మొత్తం కలిపి కేంద్రం నుంచి రూ.1,773 కోట్లు రానున్నాయి. ఒక్కో ఇంటికి రాష్ట్ర సర్కార్ రూ.5లక్షల చొప్పున ఇస్తున్నది. అందులో కేంద్రం వాటా రూ.1.5 లక్షలు కాగా, మిగతా రూ.3.5 లక్షలు రాష్ట్ర సర్కార్ భరించాల్సి ఉంటుంది. ఇండ్ల నిర్మాణం చేపడితేనే కేంద్రం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉన్నది. నిధులు, స్థలాల కొరత కారణంగా పట్టణ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణం ఇంకా చేపట్టలేదు.

పదోవంతు ఇండ్లు నిర్మించేనా?

ఇందిరమ్మ ఇండ్ల కోసం 80 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అందులో 25 లక్షలకు పైగా దరఖాస్తులు నగర, పట్టణ పేదల నుంచే వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఇంకా రెండున్నరేండ్ల గడువు మాత్రమే ఉన్నది. ఇప్పటికిప్పుడు ఇండ్ల నిర్మాణం చేపట్టినా కేంద్రం మంజూరు చేసిన ఇండ్ల కన్నా ఎక్కువ ఇండ్లు నిర్మించే అవకాశం కనిపించడమే లేదు. దీంతో దరఖాస్తుల్లో పదో వంతు మందికి కూడా ఇండ్లు నిర్మించే వచ్చే ఆస్కారం కనిపించడంలేదు. హైదరాబాద్ సహా వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ తదితర నగరాల్లో ఇండ్ల నిర్మాణానికి కొన్ని బస్తీలను ఎంపిక చేసినప్పటికీ అక్కడ ఇండ్లు నిర్మించేందుకు బస్తీలవాసులు ఒప్పుకోవడం లేదు. వారు ఉంటున్న గుడిసెలను ఖాళీ చేయించి అక్కడే అపార్ట్‌మెంట్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే రెండున్నరేండ్లలో ఇండ్ల నిర్మాణం పూర్తికాకుంటే తాము రోడ్డుపాలవుతామని బస్తీల వాసులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ముందుకు సాగే అవకాశాలు కనిపించడం లేదు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం వివరాలు

- పీఎంఏవై(యూ) 2.0లో భాగంగా 2025 జూలైలో 1.13 లక్షల ఇండ్లు మంజూరు
- వీటి నిర్మాణానికి రూ.1,500 కోట్ల కేంద్రం నిధులు మంజూరు
- తాజాగా పీఎంఏవై(యూ) కింద 18,213 ఇండ్లు మంజూరు. వీటి కోసం రూ.273.20 కోట్లు విడుదల చేయనున్న కేంద్రం
- మొత్తం పట్టణ పేదలకు కేంద్రం మంజూరు చేసిన ఇండ్లు 1,31,213
- రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న పట్టణ పేదలు సుమారు 25 లక్షల మంది
- రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ఐదేండ్లలో మొత్తం 20 లక్షల ఇండ్లు
- ప్రస్తుత మొదటి విడతలో మంజూరు చేసిన ఇండ్లు 4.5లక్షలు
- ఇందులో నిర్మాణంలో ఉన్నవి, పూర్తికావచ్చినవి 2.70 లక్షల ఇండ్లు
- రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు లబ్ధిదారులకు విడుదల చేసిన నిధులు సుమారు రూ.3,000 కోట్లు
- ఒక్కో ఇంటి నిర్మాణానికి సర్కార్ ఇస్తున్న నిధులు రూ.5,00,000

ఇందిరమ్మ ఇండ్లకు 28 కోట్లు విడుదల

హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వారంరోజుల్లో 2,764 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సుమారు రూ. 28.50 కోట్లు విడుదల చేసినట్టు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. లబ్ధిదారుల ఆధార్‌నంబర్ బ్యాంక్ అకౌంట్‌కు అనుసంధానించకపోవడం, పేర్లలో తేడాలు ఉండటం, అప్‌లోడ్ చేసిన ఫొటోలు సరిగా లేకపోవడం తదితర కారణాలతో బిల్లుల విడుదల్లో జాప్యం జరుగుతున్నదని తెలిపారు. ప్రజాప్రాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక డ్రైవ్‌లో మొదటి వారం రోజులపాటు పెండింగ్‌లోని బిల్లులు క్లియర్ చేసినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం క్లియర్ చేసిన బిల్లుల్లో ఎల్-3 జాబితాలోని 1200 మందికి రూ.12.06 కోట్లు, బ్యాంక్ వద్ద పేమెంట్ ఫెయిల్ అయిన 653 మందికి రూ. 7 కోట్లు, పలు అభ్యంతరాలతో పెండింగ్‌లోని 911 మందికి రూ. 9.40 కోట్లు ఉన్నట్టు తెలిపారు.

ఫామ్ హౌస్‌లో కాల్పుల కలకం


డ్రగ్స్ పార్టీపై ఈగల్ దాడి
ఎనిమిది మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివారులోని మొయినాబాద్‌లో ఓ ఫామ్ హౌస్‌లో శనివారం రాత్రి కాల్పులు కలకలం సృష్టించాయి. ఆ ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్టు సమాచారం అందుకున్న ఈగల్ టీమ్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూడటంతోనే అక్కడ మత్తులో మునిగి ఉన్న కొందరు కాల్పులకు దిగినట్టు తెలిసింది. అయితే ఆ ప్రాంతాన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు సమాచారం. ఒక రివాల్వర్‌ను, బుల్లెట్లను, కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్తున్నారు. అరెస్టయిన వారిలో ఏపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి, కొందరు రాజకీయ నాయకులు, మరికొందరు వీఐపీలు ఉన్నట్టు తెలిసింది.

జనగణనపై అపోహలు సృష్టించవద్దు

- కారు, బైక్ ఉంటే సంక్షేమ పథకాలు తొలగింపు భయం అసలే అక్కర్లేదు
- వ్యక్తిగత వివరాలపై గోప్యత పాటిస్తాం
- ఎన్‌ఆర్‌ఐల వివరాలు చేర్చడం లేదు
- మే 11 నుంచి జూన్ 9 వరకు ఫస్ట్‌ఫేజ్
- 2027 ఫిబ్రవరి 9 నుంచి సెకండ్ ఫేజ్
- రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ భారతి హోళికేరి
- నిర్భయంగా సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది చేపట్టబోయే జనగణనపై సోషల్ మీడియా వేదికగా ఎవరూ అపోహలు సృష్టించవద్దని రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ భారతి హోళికేరి కోరారు. సెన్సస్ యాక్ట్ ప్రకారం ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచుతామని, వ్యక్తిగత వివరాలను ఏజెన్సీలు, ఇతర సంస్థలకు ఇవ్వబోమని వెల్లడించారు. శనివారం కోఠిలోని సెన్సస్ కార్యాలయంలో ఆమె మీడియాతో పలు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మే 11 నుంచి జూన్ 9 వరకు తొలి విడత ఇండ్లను లెక్కిస్తామని తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌ను ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు సెకండ్ ఫేజ్‌లో జనగణన చేపడుతామని వెల్లడించారు. మొత్తం 88,000 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొంటారని వెల్లడించారు. సెన్సస్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో ఉన్న మౌలిక వసతులను లెక్కించి డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్ బుక్(డీసీహెచ్‌బీ)లో చేరుస్తామని వివరించారు. జనగణనలో భాగంగా ఇల్లు ఉంటే దాని సామర్థ్యం, ఆ ఇంటిలో ఉన్న వసతులు, వారు కలిగి ఉన్న ఆస్తులపై ఎన్యుమరేటర్లు ప్రశ్నలు అడుగుతారని చెప్పారు. కారు, బైక్‌లాంటి వంటివి ఉంటే నిర్భయంగా సమాచారం ఇవ్వొచ్చని, ప్రభుత్వ పథకాల నుంచి తొలగిస్తామనే భయం అక్కర్లేదని స్పష్టతనిచ్చారు. దేశ చరిత్రలో తొలిసారిగా ఈసారి డిజిటల్ పద్ధతిలో జనగణన చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. కులగణన, సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను కూడా చేపడతున్నట్టు వివరించారు.



ప్రపంచంలోనే మనదే అతి పెద్దది

సెన్సస్ యాక్ట్ 1948 ప్రకారం ఈ ప్రక్రియను చేపట్టనున్నట్టు డైరెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. ప్రజాస్వామ్యానికి జనగణన అత్యంత కీలకమని, 140 కోట్ల జనాభా ఉన్న మన దేశం చేపట్టే జనగణన ప్రపంచంలోనే అతి పెద్దదిగా అభివర్ణించారు. కేంద్రానికే జనగణన చేపట్టే అధికారం ఉంటుందని, రాష్ట్రాలు చేస్తే అది కేవలం సర్వే మాత్రమే అవుతుందని స్పష్టంచేశారు. ప్రజల్లో అవగాహనతోనే సెన్సస్-2027 విజయవంతం అవుతుందని తెలిపారు. రాజ్యాంగంలోని 69వ అధికరణలోని 7వ షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టనున్నట్టు తెలిపారు.

మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదు

ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి మొబైల్ యాప్ ద్వారా వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో సైతం ఈ యాప్ పనిచేస్తుందని తెలిపారు. సొంత ప్రాంతాల్లో జనగణన ద్వారా వివరాలు అందించాలని ఆమె ప్రజలను కోరారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌ను వెబ్ పోర్టల్ ద్వారా చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వచ్చే తరాలకు ఈ జనగణన మాస్టర్ ఫ్రేమ్‌గా ఉంటుందని చెప్పారు. తొలిసారిగా రోజూ తినే ఆహార పదార్థాల వివరాలపైనా ప్రశ్నలుంటాయని పేర్కొన్నారు.

26 తర్వాత ఆర్టీసీలో మెరుపు సమ్మె

ఉద్యోగులు, కార్మికుల్లో పెరిగిపోతున్న అసంతృప్తి

- మరోవైపు ముంచుకొస్తున్న 'ఎలక్ట్రిక్' ప్రైవేటీకరణ
- విలీనం తప్ప మరో దారి లేదంటున్న కార్మికులు
- వేతన సవరణలు, ఉద్యోగ భద్రతపైనే ప్రధాన గురి

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో, సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపిస్తూ కార్మిక సంఘాల జేఏసీ నేతలు మరోసారి సమ్మె నోటీసు ఇచ్చారు. కార్మిక సంఘాల నేతలు ఈ నెల 26 వరకు ప్రభుత్వానికి, ఆర్టీసీ సంస్థకు డెడ్‌లైన్ విధించారు. అప్పటిలోగా తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపకపోతే.. మెరుపు సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ లోగా చర్చలకు ఆహ్వానించడంతోపాటు.. సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలని కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే.. 26 తర్వాత సమ్మె తేదీని ప్రకటిస్తామని, అప్పటికీ ఎలాంటి జవాబు లేకపోతే కచ్చితంగా మెరుపు సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

తీవ్రమైన పని ఒత్తిడిలో కార్మికులు..

నాడు తెలంగాణ ఆర్టీసీలో దాదాపు 56 వేల మందికిపైగా కార్మికులు ఉండగా.. ప్రతి రోజూ 30 లక్షల కిలోమీటర్ల వరకు తమ సేవలు అందేవని కార్మికులు అంటున్నారు. సుమారు 18 వేలకు పైగా కార్మికులు రిటైర్ అయినప్పటికీ ఆర్టీసీలో కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో ఆ పని భారమంతా ఉన్న వారిపైనే పడుతున్నదని వాపోతున్నారు. దీంతో 8 గంటలు పనిచేయడమే గగనమైన పరిస్థితుల్లో 14 నుండి 16 గంటల వరకు పని చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎంపీడబ్ల్యూ యాక్ట్‌కు భిన్నంగా యాజమాన్యం తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్నదని ఆరోపిస్తున్నారు. అధిక పని ఒత్తిడిని తట్టుకోలేక కార్మికులు అనారోగ్యం పాలై.. హఠాత్తుగా చనిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికుల సమస్యలు విన్నవించేందుకు కూడా ప్రభుత్వాలు, ఆర్టీసీ యాజమాన్యం సమయం ఇవ్వలేకపోవడంతోనే పరిస్థితి సమ్మె వరకూ వచ్చిందని అంటున్నారు.

అటకెక్కిన ఆర్టీసీ విలీన హామీ

ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా 'ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తాం, ఆ ప్రక్రియ పూర్తి చేసి వెంటనే రెండు పీఆర్సీ బకాయిలు చెల్లిస్తాం, వచ్చే పీఆర్సీ పరిధిలోకి టీజీఎస్‌ఆర్టీసీ కార్మికులను చేరుస్తాం' అని పేర్కొన్నారు. ఆ హామీకి రెండున్నరేండ్లు గడుస్తున్నా.. దాని అమలుకు ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని కార్మికులు మండిపడుతున్నారు. చిత్తశుద్ధి గురించి రెండేండ్లుగా చెప్తున్న కాంగ్రెస్ నాయకులు.. కేసీఆర్ చేపట్టిన విలీన ప్రక్రియను ఎందుకు పూర్తిచేయలేకపోతున్నారని ప్రశ్నిస్తున్నారు. 2023 అక్టోబర్ 30న అపాయింటెడ్ డే ప్రకటిస్తే.. ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఆ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగానే ఆపుతున్నదని ఆరోపిస్తున్నారు. అపాయింటెడ్ డే కోసం వేలాది మంది కార్మికులు ఎదురుచూస్తున్నారు.



ఆర్టీసీలో ఎక్కడి సమస్యలు అక్కడే..

2017 నుంచి వేతన సవరణలు అమలుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఎరియర్స్ అన్నీ లెక్కగట్టి గతంలో ఇచ్చినట్టు ఐదేండ్ల కాలపరిమితికి వడ్డీ సహా చెల్లించాలని కోరుతున్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండానే.. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెచ్ఆర్ఏ కట్ చేస్తున్నారని వాపోతున్నారు. మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు ప్రతినెల కుప్పలుకుప్పలుగా పేరుకుపోతున్నాయని, దీంతో సంస్థపై మరింత భారం పడుతున్నదని పేర్కొంటున్నారు. ఇక ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశంతో ఆర్టీసీలో ప్రైవేటీకరణ ప్రారంభమైందని అంటున్నారు. ఇప్పటికే ఆ బస్‌లకు ప్రైవేట్ డ్రైవర్లను తీసుకుంటున్నారని, డిపోలను ఆక్రమిస్తున్నారని, చార్జింగ్‌పాయింట్ల పేరుతో ఆర్టీసీ స్థలాలను కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటువంటి దారుణ పరిస్థితుల్లో తమను ఉద్యోగ భద్రత కల్పించాలని కోరడం మినహా.. మరో దారి కనిపించడం లేదని కార్మికులు అంటున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపకట్టకపోతే.. సమ్మెలో పాల్గొంటామని హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్ కార్మిక సంఘ నేతకు వేధింపులు?

- ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రశ్నించినందుకే..
- ఐఎన్‌టీయూసీకి రాజీనామా
- తాజాగా స్వచ్ఛంద విరమణ ప్రకటించిన రాజిరెడ్డి

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మిక సంఘాల్లో సుదీర్ఘకాలం పనిచేసిన కే రాజిరెడ్డి ఎస్‌డబ్ల్యూఎఫ్ (ఐఎన్‌టీయూసీ) నుంచి స్వచ్ఛందంగా వైదొలిగారు. తన పుట్టినరోజు సందర్భంగా శనివారం ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సమయం కేటాయించే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. అయితే, ఆయన ఇటీవల కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా కార్మికులకు అనుకూలంగా పోరాట కార్యాచరణ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలను విస్మరించిందని ఆయన పార్టీకి వ్యతిరేకంగా పోరాటం చేశారు. కార్మికుల్లో పెరుగుతున్న అసంతృప్తిని పార్టీ పెద్దలకు, మంత్రికి, సీఎంకు సైతం విన్నవించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అయినా లాభం లేకపోవడంతో ఈనెల 24 నుంచి 26 వరకూ సామూహిక నిరాహారదీక్షలకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆయనను సంప్రదించకుండానే ఐఎన్‌టీయూసీ నేతలు సమావేశమై.. కొత్త కమిటీని ప్రకటించి రాజిరెడ్డిని తీసేశారు. ఈ క్రమంలో ఆయనను తీసివేయడంతో.. ఈనెల 11న ఐఎన్‌టీయూసీకి రాజీనామా ప్రకటించారు. అయినా వేధింపులు ఎక్కువ కావడంతో శనివారం అన్ని యూనియన్ కార్యకలాపాల నుంచి స్వచ్ఛంద విరమణ ప్రకటించారు.

రేపు జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నిరసనలు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు టీఎస్ యూటీఎఫ్ ప్రకటించింది. సమస్యలు పరిష్కారానికి ఈనెల 20న 'చలో అసెంబ్లీ'చేపడుతామని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావా రవి, ఏ వెంకట్ తెలిపారు.



తమ్మినేనిని పరామర్శిస్తున్న సీపీఎం నేతలు

తమ్మినేనికి బీవీ రాఘవులు పరామర్శ

హైదరాబాద్, మార్చి 14 (నమస్తేతెలంగాణ): గుండెజబ్బుతో హైదరాబాద్ గచ్చిబౌలి ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రంను శనివారం ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పరామర్శించారు. వారు ఆ దవాఖాన వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, త్వరలోనే కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో సీపీఎం నేతలు బీ వెంకట్, టీ సాగర్, ఎండీ అబ్బాస్, భూపాల్, ఆర్ వెంకట్రాములు, పీ జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

25న బ్లాక్‌డే పాటిస్తాం

- వ్యాలిడేషన్ యాక్ట్‌పై ఉద్యమిస్తాం
- పెన్షనర్స్ జేఏసీ నాయకుల వెల్లడి



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యాలిడేషన్ యాక్ట్‌ను నిరసిస్తూ ఈనెల 25న బ్లాక్‌డేగా పాటించనున్నట్టు పెన్షనర్స్ జేఏసీ ప్రకటించింది. ఈ యాక్ట్ ద్వారా పెన్షన్‌పై సర్వాధికారాలను కేంద్రం లాగేసుకున్నదని ఆందోళన వ్యక్తంచేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన పెన్షనర్స్ జేఏసీ కార్యవర్గ సమావేశంలో ఆలిండియా పెన్షనర్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ డీ సుధాకర్ మాట్లాడారు. ఈ యాక్ట్‌తో 2026 జనవరి 1 కన్నా ముందు రిటైర్డ్ అయిన వారికి పెన్షన్ హెచ్చింపులు, డీఆర్, పీఆర్సీ ఇవ్వాలా? వద్దా? అనే అధికారం కేంద్ర తన వద్దే పెట్టుకున్నదని ఆరోపించారు. 8వ పే కమిషన్‌లో పెన్షన్ ప్రస్తావనే లేకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. ఇదే అమలైతే పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి తులసి సత్యనారాయణ, కృష్ణప్రసాద్, రాజేంద్రబాబు, భరత్‌రెడ్డి, సాయిరెడ్డి, దేవేందర్, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం

- ఇకనైనా సిక్కు చావ్‌నీ భూములను క్రమబద్ధీకరించాలి
- ప్రభుత్వానికి ఆల్ తెలంగాణ గురుద్వారాస్ కమిటీ విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా అత్తాపూర్‌లోని చారిత్రక సిక్కు చావ్‌నీ భూముల వివాదానికి హైకోర్టు తెరదించడంపై ఆల్ తెలంగాణ గురుద్వారాస్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. హైకోర్టు తీర్పుపై కమిటీ చైర్మన్ గురుచరణ్ సింగ్ బగ్గా మాట్లాడుతూ.. అత్తాపూర్‌లోని మహారాజా రంజీత్ సింగ్ నగర్‌లో 1832 నుంచి సిక్కు సమాజం నివసిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, ఆదాయ వసూళ్ల కోసం సిక్కు దళాలను పంపాలని హైదరాబాద్ నిజాం కోరడంతో పంజాబ్ పాలకుడైన మహారాజా రంజిత్ సింగ్ 14 సిక్కు మిసల్ (బెటాలియన్)లను పంపి, రాంబాగ్, మీర్ ఆలం ట్యాంక్ మధ్య ప్రాంతంలో మోహరించారని, 1950లో సిక్కు దళాలను రద్దు చేసినప్పటికీ వారి వారసులు అక్కడే నివసిస్తున్నారని, దీంతో ఆ ప్రాంతాన్ని సిక్కు చావ్‌నీ అని పిలుస్తున్నారని గుర్తుచేశారు. ఆ స్థలాన్ని క్రమబద్ధీకరించాలని సిక్కు సమాజం ఎన్నో ఏండ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నదని, ఈ క్రమంలో గురుద్వారా కమిటీ వేసిన రిట్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపి అనుకూలంగా తీర్పును వెలువరించిందని పేర్కొంటూ.. ఇప్పటికైనా సిక్కు చావ్‌నీ భూములను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. హైకోర్టు తీర్పుపై గురుద్వారా సాహెబ్ బారాంబాలా చైర్మన్ హర్భన్స్ సింగ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

17న మరో 2,540 కోట్ల అప్పు

- ఈ వేలంలో తీసుకుంటామని ఆర్బీఐకి ప్రభుత్వం ఇండెంట్
- బడ్జెట్‌లో వార్షిక రుణ అంచనా రూ.54,009 కోట్లే
- సర్కార్ తీసుకున్న అప్పులు రూ.83,300 కోట్లు

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ నుంచి తీసుకున్న అప్పు

క్యూ-1లో	రూ.17,400 కోట్లు
క్యూ-2లో	రూ.32,500 కోట్లు
క్యూ-3లో	రూ.18,400 కోట్లు
క్యూ-4లో	
జనవరి 13న	రూ.2,000 కోట్లు
జనవరి 27న	రూ.1,500 కోట్లు
ఫిబ్రవరి 10న	రూ.9,000 కోట్లు
మార్చి 2న	రూ.2,500 కోట్లు
మార్చి 17న	రూ.2,540 కోట్లు
మొత్తం కలిపి	రూ.85,840 కోట్లు



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నది. ఇప్పటికే అప్పుల భారంతో సతమతమవుతున్న రేవంత్‌రెడ్డి సర్కార్, తాజాగా మరోసారి భారీ రుణానికి సిద్ధమైంది. బడ్జెట్ అంచనాలను ఏనాడో అధిగమించిన సర్కార్, ఇప్పుడు నిత్యావసర ఖర్చుల కోసం కూడా అప్పులపైనే ఆధారపడాల్సిన దుస్థితికి చేరుకున్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ నెల 17న నిర్వహించబోయే ఈ-వేలంలో పాల్గొని, మరో రూ.2,540 కోట్ల అప్పు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే ఆర్బీఐకి ఇండెంట్ పంపింది. 19 ఏండ్ల కాల పరిమితితో రూ.540 కోట్లు, 28 ఏండ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 30 ఏండ్ల కాలానికి రూ.1000 కోట్లు తీసుకుంటామని, ఇందుకు అవసరమైన సెక్యూరిటీ బాండ్లు పెడతామని, తమకు ప్రతిపాదనలు పంపించినట్టు ఆర్బీఐ తాజాగా వెల్లడించింది.

అదుపు తప్పిన బడ్జెట్ లెక్కలు

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దేశించుకున్న రుణ అంచనాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ ప్రతిపాదనలు రూ.54,009 కోట్లు ఉండగా, ఇప్పటివరకు సేకరించిన రుణాలు అక్షరాలా రూ.83,300 కోట్లకు (154.23 శాతం)చేరాయి. అంటే, ఆర్థిక సంవత్సరం ముగియక ముందే బడ్జెట్ అంచనాల కంటే దాదాపు రూ.29,000 కోట్లకుపైగా అదనపు అప్పులు చేయడం ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ వైఫల్యానికి అద్దం పడుతున్నది. 17న తీసుకోబోయే రూ.2,540 కోట్ల అప్పు కలుపుకుంటే మొత్తం రూ.85,840 కోట్లకు (158.93 శాతం) చేరనున్నది. రాష్ట్ర సొంత ఆదాయ మార్గాలు సృష్టించుకోవడంలో విఫలమైన రేవంత్ సర్కార్ ప్రతి నెలా అప్పు చేస్తేగానీ బండి నడవని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికే అప్పుల కుప్పగా మారిన తెలంగాణపై ఈ అదనపు భారం భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీసే ప్రమాదం ఉన్నది. సంక్షేమ పథకాలు, జీతభత్యాల కోసం కూడా అప్పుల వైపు చూడటం ఆర్థిక క్రమశిక్షణారాహిత్యమేనని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బైకును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


ముగ్గురి దుర్మరణం

మెదక్ జిల్లాలో విషాదం

కొల్చారం, మార్చి14: ఆర్టీసీ బస్సు బైకును ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హవేళీఘనపూర్ మండలం బూరుగుపల్లికి చెందిన అమృత్ గౌడ్(50) తన కుమారుడు రిషి వర్ధన్‌గౌడ్(13), అల్లుడు, బోడ భూపతిపూర్‌కు చెందిన సాయాగౌడ్(32)తో కలిసి రంగంపేటలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై, బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. రాంపూర్ శివారులోకి రాగానే మెదక్ నుంచి సంగారెడ్డి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తూ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మొయినొద్దీన్ తెలిపారు.

పెండ్లికి నిరాకరించిందని అమానుషం

- యువతికి ఎయిడ్స్ రక్తం ఎక్కించిన యువకుడు
- తనకు దక్కనిది మరెవరికీ దక్కొద్దని ఉన్మాదం
- సినీ తరహాలో పోచారంలో దారుణ సంఘటన



మనోహర్

హైదరాబాద్ సిటీబ్యూరో/పోచారం, మార్చి 14(నమస్తే తెలంగాణ): 'తనకు గిట్టని యువకుడిని తన కూతురు ప్రేమించిందని ఆమె తండ్రి కసి పెంచుకుంటాడు. ఆ యువకుడిపై కోపంతో ఆ ప్రేమ జంటకు ఆనందం లేకుండా చేయాలని భావిస్తాడు. ఆ ఇద్దరికీ పెళ్లి చేస్తానని కూతురితో నమ్మబలికి ఏకంగా తన చేతులతోనే కూతురికి హెచ్ఐవీ ఉన్న ఇంజెక్షన్ ఇచ్చి రోగిగా మారుస్తాడు' ఇదీ ఇటీవల వచ్చిన ఓ సినిమాలోని సంక్షిప్త సారాంశం. సరిగ్గా దీనిని పోలిన అమానుష ఘటనే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారంలో తాజాగా చోటుచేసుకున్నది. పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌జీకేలో నివాసం ఉంటున్న మనోహర్ (25), అతనికి సమీప బంధువైన యువతి (24) ఒకే చోట నివాసం ఉంటున్నారు. మనోహర్‌కు తన కూతురును ఇచ్చి వివాహం జరిపించాలని ఆ యువతి తండ్రి ఇటీవల నిర్ణయించుకున్నాడు. కొన్నిరోజుల్లోనే పెళ్లి ముహూర్తం ఉండగా, ఇరు కుటుంబాలు ఏర్పాట్లలో మునిగిపోయారు. ఈ సమయంలో పిడుగులాంటి వార్త వారికి చేరింది. మనోహర్ తల్లిదండ్రులు హెచ్ఐవీతో బాధపడుతున్నారన్న అనుమానం ఆ యువతి తండ్రికి కలిగింది. వెంటనే మనోహర్‌కు కూడా ఉప్పల్‌లోని ఓ దవాఖానలో హెచ్ఐవీ పరీక్ష చేయించాడు. దీంతో ఫలితం పాజిటివ్‌గా రావడంతో ఆ పెళ్లిని రద్దుచేసుకున్నారు.

ఉన్మాదిలా మారిన యువకుడు

తనకు దక్కని ఆ యువతి మరెవరికీ దక్కకూడదని భావించిన మనోహర్ ఉన్మాదిలా మారిపోయాడు. పక్కా ప్రణాళిక ప్రకారం ఈ నెల 11న ఆ యువతి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో వారింటికే వెళ్లి ఎరుపు రంగుతో ఉన్న ఇంజెక్షన్‌ను బలవంతంగా ఎక్కించాడు. అనంతరం యువతికి జ్వరం, ఒళ్లు నొప్పులు రావడంతో ఆ యువతిని ఆమె తండ్రి ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లాడు. ఇదే సమయంలో మనోహర్‌ను యువతి తండ్రి, స్థానికులు, పోలీసులు సహా నిలదీయగా హెచ్ఐవీ ఇంజెక్షన్ ఇచ్చానని ఒప్పుకొన్నాడు. ఈ ఘటనపై బాధిత యువతి తండ్రి పోచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొన్ని పోలీసులు మనోహర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రక్తాన్ని ఎక్కడి నుంచి సేకరించాడు.. ఇది అతని రక్తమా? లేదా? వేరేవరిదైనా తీసుకొచ్చాడా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

పెండ్లిరోజును భర్త పట్టించుకోలేదని దారుణం

- మనస్తాపంతో ఇద్దరు పిల్లల గొంతునులిమి తల్లి ఆత్మహత్య
- ఐదేండ్ల కుమారుడి మృతి.. ప్రాణాపాయస్థితిలో కుమార్తె
- బోరబండ పెద్దమ్మనగర్ బస్తీలో పెను విషాదం



రుద్రాన్ష్ | తన్విక | సత్యవేణి(ఫైల్)

వెంగళరావునగర్, మార్చి 14: పెండ్లిరోజును భర్త తనను, బిడ్డలను పట్టించుకోలేదని భావించిన ఆ ఇల్లాలు క్షణికావేశానికి లోనైంది. పేగు తెంచుకొని పుట్టిన ఆ బిడ్డల గొంతునులిమి, ఆ తర్వాత ఆమె ఆత్మహత్య చేసుకొన్నది. హైదరాబాద్ బోరబండ పెద్దమ్మనగర్‌లో జరిగిన ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం అలుముకున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఏపీ అమలాపురానికి చెందిన మురళీవేణు (33) 20 ఏండ్ల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చి పెద్దమ్మనగర్‌లో స్థిరపడ్డారు. విద్యుత్తు శాఖ కాంట్రాక్ట్ పద్ధతిలో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మందమర్రి, మంచిర్యాల జిల్లాకు చెందిన సత్యవేణి (33)తో ఏడేండ్ల క్రితం అతనికి వివాహమైంది. వారికి రుద్రాన్ష్ (5), తన్విక (2) సంతానం కలిగారు. గత కొంతకాలంగా మురళీవేణు తన తండ్రి కిడ్నీలకు రెండు రోజులకోసారి డయాలసిస్ చేయిస్తున్నాడు.

మురళీవేణు, సత్యవేణి దంపతుల పెళ్లిరోజైన శుక్రవారం సంబురంగా జరుపుకోవాలని ఆమె భావించింది. పిల్లలతో కలిసి ఆ రోజంతా గడుపుదామని భర్త వేణును ఆ ఇల్లాలు కోరింది. అదేరోజు తండ్రికి డయాలసిస్ చేయించేందుకు దవాఖానకు తీసుకెళ్లాలని, మరో రోజు చేసుకుందామని చెప్పి దవాఖానకు వెళ్లిపోయాడు. భర్త నిరాదరిస్తున్నాడని కన్నీటి పర్యంతమైన ఆ మహిళ ఐదేండ్ల కుమారుడైన రుద్రాన్ష్, రెండేండ్ల తన్విక గొంతు నులిమింది. అమ్మా.. అమ్మా.. అని ఏడుస్తున్నా ఆ బిడ్డల రోదలను పెడచెవిన పెట్టిన తల్లి కర్కశంగా వ్యవహరించింది. బిడ్డలు చనిపోయి ఉంటారని భావించిన సత్యవేణి ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె అత్త ఇంటికొచ్చి చూసేసరికి కోడలు సత్యవేణి విగతజీవిగా మిగిలింది. పిల్లలను దవాఖానకు తరలించగా, రుద్రాన్ష్ చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన్వికకు చికిత్స చేస్తున్నారు. బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి తల్లీకొడుకులు మృతి

ఏపీలోని గార్గేయపురంలో విషాద ఘటన

అలంపూర్, మార్చి 14 : తల్లి, ఇద్దరు కొడుకులు చెరువులో పడి మృతి చెందిన ఘటన అలంపూర్‌లో విషాదాన్ని నింపింది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా గార్గేయపురం గ్రామానికి చెందిన రాజేశ్వరి (35)కి జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరువాసి రాజుతో పదేండ్ల కిందట వివాహమైంది. వీరికి సుకుమార్ (6), అబ్రహం(3) సంతానం ఉన్నారు. అనారోగ్య సమస్యల దృష్ట్యా రాజేశ్వరి.. పిల్లలతో కలిసి తల్లిగారి ఊళ్లోనే ఉంటుంది. శుక్రవారం ఉదయం అలంపూర్‌కు వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి పిల్లలతో కలిసి బయలుదేరింది. సాయంత్రమైనా అత్తగారి ఊరికిగానీ.. తల్లిగారి ఊరికిగానీ చేరలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం గార్గేయపురం సమీపంలోని చెరువులో ముగ్గురు విగత జీవులుగా ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కర్నూల్ పోలీసులు చేరుకొని పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

ముగ్గురిని మింగిన సాగు బావి

- పూడికతీత తీస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడిన క్రేన్
- మృతుల్లో పదో తరగతి విద్యార్థి
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొర్కిశాలలో విషాదం



పైడి, దేవరావు, అభిలాష్ (ఫైల్)

జయశంకర్ భూపాలపల్లి, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ బావిలో పూడిక తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు క్రేన్ బావిలో పడటంతో ముగ్గురు మృతిచెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొర్కిశాలలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కొర్కిశాలకు చెందిన సుకినె దేవరావు, మోహన్‌నావు అన్నదమ్ములు. తమ వ్యవసాయ బావిలో నీరు రాకపోవడంతో ఇటీవల క్రేన్‌తో పూడికతీత పనులు చేపట్టారు. శనివారం బకెట్‌లో పెద్ద బండతో పాటు మట్టిని నింపారు. ఈ క్రమంలో బకెట్‌లో బరువు ఎక్కువై క్రేన్ బావిలో పడిపోయింది. దీంతో బావిలో ఉన్న భూయజమాని సుకిమె దేవరావు (48), కూలీ సరిగొమ్ముల పైడయ్య (53)తో పాటు పదోతరగతి విద్యార్థి బండారి అభిలాష్ అక్కడికక్కడే మృతి చెందారు. బావి యజమాని సోదరుడు మోహన్‌రావుకు సైతం తీవ్రగాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

ప్రాణం తీసిన సరదా..

కొర్కిశాల గ్రామానికి చెందిన బండారి అభిలాష్ (16) పదో తరగతి పరీక్ష రాసి ఇంటికి చేరుకుని పక్కనే క్రేన్‌తో బావి పూడికతీత పనులు జరుగుతుండగా చూసేందుకు వెళ్లాడు. సరదాగా క్రేన్‌పై కూర్చుని పూడికతీతను చూస్తున్నాడు. క్రేన్ హఠాత్తుగా బావిలో పడిపోవడంతో అభిలాష్ సైతం బావిలో పడి మృత్యువు ఒడిలో చేరాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను చిట్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చిట్యాల సీఐ మల్లేశ్, మొగుళ్లపల్లి, గణపురం ఎస్సైలు సురేశ్, అశోక్ పరిశీలించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

పింఛన్ లబ్ధిదారులకు కాంగ్రెస్ మొండిచెయ్యి

- కొత్తవి ఇవ్వరూ..పింఛన్ పెంచరూ!
- కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కి రెండేండ్లు దాటినా నెరవేరని ఎన్నికల హామీ
- ప్రభుత్వంపై లబ్ధిదారుల్లో ఆగ్రహం
- అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పింఛన్లు రూ. 6వేలకు పెంచుతాం.. అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేస్తాం..అంటూ కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు అవుతున్నా ఆ హామీ ఊసే ఎత్తడం లేదు. పైగా ఉన్న పింఛన్లలో భారీగా కోత పెట్టారు. దీంతో పింఛన్లు పెరగకపోగా, వచ్చే పింఛన్ కూడా రాకుండా చేశారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి ఓట్లు వేసి మోసపోయామని వాపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన ఈ 27 నెలల్లో ఒక్క పింఛన్ మంజూరు చేయలేదు, కానీ ఏకంగా 1.5 లక్షల మందికి పింఛన్లు తొలగించింది. గత సీఎం కేసీఆర్ పాలనలో 43,72,784 మంది లబ్ధిదారులకు పింఛన్లు ఇవ్వగా, ప్రస్తుతం 42.50 లక్షల మందికే ఇస్తున్నారు. అది కూడా పాత పద్ధతిలో వృద్ధులు, బీడీ కార్మికులు, గీతన్నలు, నేతన్నలు, ఒంటరి మహిళలు, డయాలసిస్, ఎయిడ్స్ పేషెంట్లు, ఫైలేరియా బాధితులకు రూ. 2,016 చొప్పున, దివ్యాంగులకు రూ. 4,016 చొప్పున ఇస్తున్నారు. పైగా 2024 ఆగస్టు, 2025 జనవరి నెలలకు సంబంధించిన పింఛన్లను సైతం ఎగ్గొట్టింది.

రెండేండ్లుగా ఎదురుచూపులు

కొత్త పింఛన్ల మంజూరు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించగా, సుమారు 25 లక్షలమంది దరఖాస్తు చేసుకున్నారు. త్వరలోనే కొత్తవారికి మంజూరు చేస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు సైతం ప్రకటనలు చేశారు. కానీ నేటికి ఏ ఒక్క లబ్ధిదారుడికి పింఛన్ మంజూరు చేసిన దాఖలాలు లేవు. పైగా పింఛన్ గురించి ప్రజాప్రతినిధులను ప్రశ్నించగా, సమాధానం చెప్పకుండా ముఖం చాటేస్తున్నారు. దీంతో పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల మంజూరు కోసం మండల పరిషత్ ఆఫీసులు, అధికారుల చుట్టూ రోజూ చక్కర్లు కొడుతున్నారు.

పోరుబాటలో లబ్ధిదారులు

పింఛన్ల పెంపు, కొత్తవాటి కోసం 27 నెలలుగా నిరీక్షించిన లబ్ధిదారులు కాంగ్రెస్ సర్కార్‌పై పోరుబాటకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఇక ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు కురుసనెల్లి వెంకట్ హెచ్చరించారు. ఇప్పటికే వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప చేతలు మాత్రం గడప దాటంలేదని మండిపడ్డారు. వచ్చే శాసన బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీని ముట్టడించేందుకు వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఇందుకు సంబంధించి ఒకటి రెండురోజుల్లో కలిసివచ్చే పార్టీలు, సంఘాలతో కలిసి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

27 నెలల్లో రూ. 24వేల కోట్లు బాకీ

కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు పింఛన్ల లబ్ధిదారులకు ప్రతినెలా రూ. 4వేల చొప్పున (దివ్యాంగులకు 6వేల చొప్పున) ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు ప్రతినెలా రూ.900 కోట్లు ఖర్చు చేస్తుండగా, మరో రూ.900 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 27 నెలలకు సంబంధించి ఒక్కో లబ్ధిదారుకు రూ. 54 వేల చొప్పున రూ. 24వేల కోట్లకు పైగా బాకీ పడ్డది.



దండేపల్లి మండలం తాళ్లపేటలో డాగ్ హంటర్‌తో సోదాలు చేస్తున్న అటవీశాఖాధికారులు

వేటగాళ్ల ఉచ్చుకు చిరుత బలి

ముగ్గురు నిందితుల అరెస్టు

దండేపల్లి, మార్చి14 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట రేంజ్ పరిధిలో ఉచ్చు పెట్టి చిరుతను హతమార్చిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు జన్నారం అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. దండేపల్లి మండలానికి చెందిన కొంతమంది వన్యప్రాణులను చంపి, వ్యాపారం చేస్తున్నారన్న సమాచారం మేరకు శనివారం అటవీశాఖాధికారులు డాగ్ హంటర్‌తో దాడులు నిర్వహించారు. ఊట్ల గ్రామానికి చెందిన మొడితె వెంకటేశ్, శ్రీనివాస్, మామిడిపెల్లికి చెందిన వనపర్తి శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకొని, 13 చిరుతపులి గోర్లు, ఇతర వన్యప్రాణులకు చెందిన అవయవాలను స్వాధీనం చేసుకున్నారు. ఊట్ల శివారులోని అటవీ ప్రాంతంలో వైరుతో చేసిన ఉచ్చులతో చిరుతపులిని చంపి, గోర్లను తొలగించి, మృతదేహాన్ని కాల్చివేసినట్టు దర్యాప్తులో తేలిందని ఎఫ్‌డీవో తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరుస్తామని, ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఖర్గ్ ఐలాండ్‌పై భీకర దాడి

- ఇరాన్ ఆర్థికాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా దాడులు
- ప్రతిగా సౌదీలోని అమెరికా బేస్‌పై విరుచుకుపడ్డ ఇరాన్
- ఐదు యూఎస్ రీఫ్యూయలింగ్ విమానాల ధ్వంసం
- ఇరాక్‌లోని అమెరికా ఎంబసీపై కూడా క్షిపణుల వర్షం
- యూఏఈలోని ఫుజైరా చమురు క్షేత్రంపై డ్రోన్ల దాడి
- యూఎస్ చమురు హబ్‌లను బూడిద చేస్తామని వార్నింగ్
- పశ్చిమాసియాలో యూఎస్ 10 వేల డ్రోన్ల మోహరింపు



ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఖర్గ్ ద్వీపం(ఫైల్), ఇన్‌సెట్‌లో అమెరికా దాడి చిత్రం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు జీవనాడిగా చెప్పుకొనే చమురు ద్వీపం ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా భీకర దాడులు జరిపింది. దీనిపై తీవ్రంగా మండిపడ్డ ఇరాన్.. అమెరికా, దాని మిత్ర దేశాల చమురు కేంద్రాలను బూడిద చేస్తామని హెచ్చరించింది. సౌదీలోని అమెరికా ఎయిర్‌బేస్‌పై ఇరాన్ జరిపిన దాడుల్లో అమెరికాకు చెందిన ఐదు రీఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసమయ్యాయి. దుబాయ్‌లోని ఆర్థిక భవనంతో పాటు ఇరాక్‌లోని అమెరికా ఎంబసీపై కూడా ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. ఇదే సమయంలో పశ్చిమాసియాలో అమెరికా ఏఐ ఆధారిత డ్రోన్ల దండును మోహరించింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా గురించి సమాచారం ఇస్తే, రూ. 93 కోట్లు ఇస్తామని ప్రకటించింది.

ఇరాన్ చమురు హబ్ 'ఖర్గ్' ధ్వంసం

ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమైన చమురు ద్వీపం 'ఖర్గ్'పై తమ దేశానికి చెందిన యూఎస్ సెంట్రల్ కమాండ్ దాడులు జరిపిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. పశ్చిమాసియా చరిత్రలోనే అత్యంత శక్తిమంతమైన దాడుల్లో ఇదొకటిగా అభివర్ణించిన ఆయన.. ఈ దాడుల్లో దీవిలోని సైనిక కేంద్రాలు అన్నీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు. ప్రస్తుతానికైతే దీవిలోని చమురు మౌలిక సదుపాయాలపై దాడి చేయలేదన్న ట్రంప్.. హార్ముజ్ జలసంధి వద్ద నౌకలను అడ్డుకొంటే వాటిని కూడా పేల్చేస్తామని ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. హార్ముజ్ గుండా ప్రయాణించడానికి చమురు నౌకలకు ఎస్కార్ట్ సౌకర్యాన్ని త్వరలోనే కల్పిస్తామని పునరుద్ఘాటించారు. ఖర్గ్ ద్వీపంపై జరిగిన దాడులను ఇరాన్ ఖండించింది. ఖర్గ్‌లోని చమురు మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అమెరికా, దాని మిత్రపక్షాలకు చెందిన చమురు కేంద్రాలను బూడిద కుప్పలుగా మార్చేస్తామని హెచ్చరించింది.

ఏమిటీ ఖర్గ్? ఎందుకంత ప్రాధాన్యం??

పశ్చిమాసియాలోని పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ తీరానికి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో 'ఖర్గ్' ఉంటుంది. 20 చదరపు కిలోమీటర్ల అతి తక్కువ వైశాల్యంతో ఉన్నప్పటికీ.. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు ఇది వెన్నెముకగా చెప్తారు.



ఇరాన్ డ్రోన్ దాడిలో ధ్వంసమైన యూఏఈలోని ఫుజైరా చమురు క్షేత్రం

ఇరాన్ చమురు ఎగుమతుల్లో 90 శాతం వాటా దీనిదే. అమెరికా ఆంక్షలు విధించినప్పటికీ, 2024లో ఈ ద్వీపం నుంచి చమురు ఎగుమతుల ద్వారా ఇరాన్ 78 బిలియన్ డాలర్లను ఆర్జించింది. దీన్ని బట్టి ఇరాన్ ఆర్థిక వ్యవస్థ నడవాలంటే ఇక్కడి చమురు ఎగుమతులే కీలకమన్న విషయం అర్థమవుతున్నది. ఖర్గ్‌లోని లోడింగ్ టెర్మినళ్లు రోజుకు ఏడు మిలియన్ బ్యారెళ్ల చమురును హ్యాండిల్ చేయగలవని నివేదికలు చెప్తున్నాయి. అందుకే, ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బకొట్టాలన్న ఉద్దేశంతో ఖర్గ్‌పై ట్రంప్ సర్కార్ దాడులకు పాల్పడింది.

ఇరాన్ ప్రతీకార దాడులు

ఖర్గ్‌పై అమెరికా దాడులకు బదులుగా ఇరాన్ ప్రతిదాడులను ముమ్మరం చేసింది. సౌదీ అరేబియాలోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. ఈ క్రమంలో యూఎస్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఐదు రీ-ఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసం అయినట్టు సమాచారం. మరోవైపు, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ మిస్సైల్స్‌తో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతంలో పెద్దయెత్తున పొగ వ్యాపించింది. ఈ దాడిలో హెలిప్యాడ్ ధ్వంసమైనట్టు సమాచారం. ఇంకోవైపు, దుబాయ్‌లోని ఓ ఫైనాన్షియల్ బిల్డింగ్‌పై ఇరాన్ డ్రోన్ దాడి చేసినట్టు మీడియాలో కథనాలు వచ్చాయి. యూఏఈలోనే అతిపెద్ద చమురు కేంద్రమైన ఫుజైరా పోర్టు లక్ష్యంగా చేసుకొని ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఖర్గ్‌లోని తమ చమురు కేంద్రాలపై దాడులు చేస్తే, అమెరికా సేనలను కిడ్నాప్ చేస్తామని హెచ్చరించింది. యూఏఈలోని పోర్టులకు పౌరులు దూరంగా ఉండాలని ఇరాన్ ఓ ప్రకటనలో తెలిపింది.

అమెరికా డ్రోన్ల దండు

ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియాలో అమెరికా 10 వేల డ్రోన్లను మోహరించింది. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో పనిచేసే ఈ 'మెరోప్స్' ఇంటర్‌సెప్టర్ డ్రోన్లకు.. శత్రువుల డ్రోన్లను వేటాడి కూల్చేసే సామర్థ్యం ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. ఇరాన్ ప్రయోగిస్తున్న షాహెద్ డ్రోన్లను అడ్డుకోవడానికే అమెరికా ఈ డ్రోన్లను వినియోగిస్తున్నట్టు సమాచారం. ఒక్కో షాహెద్ డ్రోన్ ఖర్చు 20 వేల డాలర్లు ఉండగా.. మెరోప్స్ డ్రోన్ తయారీ ఖర్చు 15 వేల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా. మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఆచూకీ చెప్పిన వారికి 10 మిలియన్ డాలర్లు (రూ. 93 కోట్లు) ఇస్తామని అమెరికా ప్రకటించింది. ఖమేనీతో పాటు, ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ అలీ అస్గర్ హెజాజీ, ఇరాన్ భద్రతాధికారి అలీ లారిజాని, ఇరాన్ సీనియర్ మేజర్ జనరల్ యాహ్యా రహీమ్ సఫావీ, ఇరాన్ మంత్రులు ఎస్కాందర్ మొమేనీ, ఇస్మాయిల్ ఖాటిబ్‌పై కూడా నజరానా ప్రకటించినట్టు అమెరికా తెలిపింది.

నెతన్యాహు బతికే ఉన్నారా?

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. అయితే, ఆ వీడియోలో ఆయన కుడి చెయ్యికి ఆరు వేళ్లు ఉన్నట్టు స్పష్టమవుతున్నది. దీంతో ఇది నిజమైన వీడియోనేనా? ఏఐతో చేశారా? అసలు నెతన్యాహు ప్రాణాలతో ఉన్నారా? అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్ శుద్ధిచేసిన యురేనియాన్ని రష్యాకు తరలిస్తామని ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ తీసుకొచ్చిన ప్రతిపాదనను ట్రంప్ తోసిపుచ్చినట్టు సమాచారం.

మీ యుద్ధనౌకలను హార్ముజ్‌కు తరలించండి

ప్రపంచ దేశాలకు ట్రంప్ పిలుపు



న్యూఢిల్లీ, మార్చి 14: గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో హార్ముజ్ జలసంధికి తమ యుద్ధ నౌకలను పంపాలని ప్రపంచంలోని అగ్ర దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. కీలకమైన నౌకా మార్గం ఏదో ఒక విధంగా తెరిచి ఉండేలా అమెరికా చర్యలు తీసుకుంటుందని తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్ పోస్టులో ట్రంప్ శనివారం హెచ్చరించారు. ఇరుకైన జలమార్గం ద్వారా నౌకల రవాణాకు అంతరాయం కలిగించడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలకు ప్రభావితమైన అనేక దేశాలు ఈ జలమార్గాన్ని పరిరక్షించుకునేందుకు అమెరికాతోపాటు పనిచేయడానికి తమ యుద్ధ నౌకలను పంపుతాయని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కృత్రిమ అడ్డంకులకు ప్రభావితమైన చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్ తదితర దేశాలు తమ యుద్ధ నౌకలను హార్ముజ్ జలసంధి వద్దకు పంపుతాయని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. పూర్తిగా శిరచ్ఛేదానికి గురైన దేశం వల్ల హార్ముజ్ జలసంధితో ఇక ఎలాంటి ముప్పు ఉండబోదని ట్రంప్ పేర్కొన్నారు. హార్ముజ్ జలసంధి చుట్టూ ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ దాడులకు వెరసి వివిధ దేశాల నౌకలు జలసంధిని దాటేందుకు ప్రయత్నించకపోవడంతో సుదీర్ఘకాలం సైనిక ఉద్రిక్తతలు కొనసాగిన పక్షంలో అది ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభాన్ని తీవ్రతరం చేయగలదన్న భయాందోళనలు నెలకొంటున్నాయి.

అఫ్ఘాన్‌పై పాక్ దాడులు తీవ్రతరం

- **48 గంటల్లో 270కు పైగా రాకెట్ల ప్రయోగం**
- **పాక్ మిలిటరీ కేంద్రాలపై అఫ్ఘానిస్థాన్ దాడులు**

ఇస్లామాబాద్, మార్చి 14: పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రతరం అవుతున్నాయి. గత 48 గంటల్లో అఫ్ఘాన్‌లోని కునార్ ప్రాంతంపై పాక్ 270కు పైగా రాకెట్లు, ఫిరంగి గుండ్లను ప్రయోగించిందని సీఎన్ఎన్-న్యూస్ 18 తెలిపింది. పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న తూర్పు అఫ్ఘాన్ ప్రావిన్స్‌లోని అనేక జిల్లాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఈ ఏడాది ఆరంభంలో ఇరు దేశాల మధ్య ఘర్షణ ప్రారంభమైన తర్వాత ఇది అత్యంత తీవ్రమైన దాడుల్లో ఒకటిగా భావిస్తున్నారు. కాగా, కునార్‌లోని పలు ప్రాంతాపై దాడులు జరిగాయని అఫ్ఘాన్ ప్రతినిధి జియాఉర్రేహాన్ స్పిన్‌ఘర్ వెల్లడించారు. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ఆయన చెప్పారు. మిలిటెంట్ స్థావరాల నాశనం పేరుతో గత వారం రోజులుగా పాకిస్థాన్ వాయు సేనలు అఫ్ఘాన్‌లోని పలు ప్రాంతాపై విస్తృతంగా దాడులు చేస్తున్నాయి. పాక్‌లో ఉగ్రవాద చర్యలకు పాల్పడిన అఫ్ఘాన్ తాలిబన్, తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) మిలిటెంట్ గ్రూపుల అంతానికి తాము దాడులు నిర్వహిస్తున్నామని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ తెలిపింది. కాగా, పాక్ వాదనను తిరస్కరించిన అఫ్ఘాన్, తమ దేశంలోని అమాయక పౌరులను పాకిస్థాన్ చంపుతున్నదని విమర్శించింది. పాక్ మిలిటరీ కేంద్రాల లక్ష్యంగా తాము దాడులు జరిపినట్టు పేర్కొన్నది.

వార్ ఎఫెక్ట్.. పాక్ ఉద్యోగుల జీతాల్లో కోత

ఇరాన్ యుద్ధం, చమురు సంక్షోభం పాకిస్థాన్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. పొదుపు చర్యల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో కోతలు విధిస్తూ ప్రధాని షెహబాజ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ యాజమాన్యం, స్వతంత్ర సంస్థల్లో ఉద్యోగుల జీతాల్లో 5 నుంచి 30 శాతం వరకు కోతలు విధిస్తున్నట్టు ప్రధాని కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాబోయే రెండు నెలలపాటు క్యాబినెట్ సభ్యులు, ఇతర మంత్రులు, సలహాదారులు, ప్రత్యేక సహాయకుల జీతాలను ప్రజా సంక్షేమం కోసం వినియోగిస్తున్నట్టు తెలిపింది. మంత్రులు, ప్రభుత్వ అధికారుల విదేశీ పర్యటనలపై, ప్రభుత్వ సంస్థల్లో కొత్త వాహనాల కొనుగోలుపై నిషేధం విధించింది. ఇరాన్ యుద్ధం మూడో వారానికి చేరిందని, ఇప్పటికే దీని ప్రభావం పాక్‌పై ఉందని ప్రధాని షెహబాజ్ ప్రకటించారు. తాజాగా ఆర్థిక పర్యవసనాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. ప్రభుత్వ వాహనాల ఇంధన వ్యయంలో 50% కోత విధించారు.

మోదీజీ.. ఇదేనా మీ దౌత్యం?!

- **99 విదేశీ పర్యటనలతో మనకు ఒరిగిందేంటి?**
- **గ్యాస్ కొరతపై ప్రధానికి నెటిజన్ల చురకలు**



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): దేశంలో ఎల్పీజీ సంక్షోభం అంతకంతకూ తీవ్రమవుతున్నది. ఖాళీ సిలిండర్లతో మండుటెండలో గంటల తరబడి వేచిచూసే వారి సంఖ్య వందల్లోకి చేరింది. దేశమంతటా ఇదే పరిస్థితి తలెత్తుతున్నది. అయితే, క్షేత్రస్థాయి పరిస్థితులకు భిన్నంగా గ్యాస్ కొరత లేదంటూ కేంద్రం చేస్తున్న ప్రకటనలపై నెటిజన్లు మండిపడుతున్నారు. 99 ఫారిన్ ట్రిప్స్‌తో మొత్తంగా 79 దేశాల్లో పర్యటించిన ప్రధాని మోదీ.. గ్యాస్ సమస్యను పరిష్కరించలేకపోవడంపై పలువురు విరుచుకుపడుతున్నారు. మోదీ దౌత్యంలో విఫలమయ్యారంటూ.. పలు కారణాలను చెప్తున్నారు. ప్రస్తుతం ఈ చర్చ వైరల్‌గా మారింది.

వెళ్లడం.. రావడం.. అంతేనా?!

ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గడిచిన 12 ఏండ్లలో 99 విదేశీ పర్యటనలు చేసిన మోదీ మొత్తంగా 79 దేశాలను చుట్టి వచ్చారు. మోదీ పర్యటించిన దేశాల్లో చమురు నిల్వలకు కేరాఫ్‌గా నిలిచే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతర్, ఒమన్, బహ్రెయిన్, నైజీరియా, ఘనా, బ్రెజిల్ కూడా ఉన్నాయి. ఇక ఎల్పీజీ, సీఎన్‌జీకి హబ్‌గా పిలిచే ఖతర్, సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, అర్జెంటీనాలోనూ మోదీ పర్యటించారు. ఉద్రిక్తతలు కొనసాగుతున్న కారణంగా గల్ఫ్ దేశాలను పక్కనబెడితే, యుద్ధానికి దూరంగా ఉన్న అర్జెంటీనా, నైజీరియా, ఘనా, బ్రెజిల్ నుంచి భారత్ గ్యాస్, చమురును దిగుమతి చేసుకోవచ్చు. అయితే, ఈ దిశగా మోదీ సర్కారు చర్యలు చేపట్టడం లేదని నెటిజన్లు మండిపడుతున్నారు. దేశంలో గ్యాస్ కొరత పెచ్చరిల్లినప్పటికీ, కేంద్రం ప్రకటనలకే పరిమితమయినట్టు చెప్తున్నారు. విదేశీ పర్యటనలకు వెళ్లడం.. ఫొటోలు దిగడం.. తిరిగి రావడం తప్ప.. మోదీకి దౌత్య విజయాలేమీ లేవని ఎద్దేవా చేస్తున్నారు.

ఎల్పీజీ కొరత లేనే లేదు!

2 ఎల్పీజీ నౌకలు హార్ముజ్ దాటాయి ▪ కేంద్ర ప్రభుత్వం ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 14: ప్రస్తుతం ఎల్పీజీపై ఆందోళన నెలకొని ఉందని కేంద్రం శనివారం తెలిపింది. అయితే ఏ ఎల్పీజీ పంపిణీ కేంద్రం వద్ద నిల్వలు నిండుకోలేదని కేంద్రం స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో యుద్ధం పెరుగుతున్న దృష్ట్యా భయంతో ఎల్పీజీ బుకింగ్‌లు వేగంగా పెరిగాయని ప్రభుత్వం పేర్కొన్నది. ప్రస్తుతం ఇరాన్ జలసంధిని మూసివేయడంతో ఇంధన నౌకల రవాణా నిలిచిపోయింది. అయితే కేంద్రం మాత్రం ముడి చమురు సరఫరా సమృద్ధిగా ఉందని, డీజిల్, పెట్రోల్ నిల్వలకు కొరత లేదని స్పష్టం చేసింది. ఎల్పీజీ కోసం భయాందోళనతో ప్రజలు అధికంగా బుక్ చేసుకుంటున్నారని, అవసరమైనపుడే రీఫిల్ కోసం బుక్ చేసుకోవాలని పెట్రోలియం మంత్రిత్వశాఖ ఉన్నతాధికారి ఒకరు ప్రజలకు సూచించారు. ఇలా భయాందోళనతో దాదాపు 88 లక్షల మంది సిలిండర్ కోసం బుకింగ్ చేశారని చెప్పారు. వాణిజ్య సిలిండర్లను సరఫరా చేయడంపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. వాణిజ్య సిలిండర్ల కోసం బుకింగ్‌లు ఇప్పటికే అన్ని రాష్ట్రాల్లో ప్రారంభమయ్యాయని ఆ అధికారి తెలిపారు. సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌ని అడ్డుకోవడానికి నిరంతరాయంగా దాడులు నిర్వహించడం జరుగుతున్నదని చెప్పారు.

హార్ముజ్ దాటిన 2 నౌకలు

గల్ఫ్ దేశాల నుంచి ఎల్పీజీతో రవాణా అవుతున్న రెండు భారతీయ నౌకలు శనివారం ఉదయం సురక్షితంగా హార్ముజ్ జలసంధిని దాటాయని షిప్పింగ్ మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. శివాలిక్, నందా దేవి అనే రెండు ఎల్పీజీ నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కండ్లా రేవులకు పయనిస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా చెప్పారు. 92,700 టన్నుల ఎల్పీజీని తీసుకువస్తున్న ఈ రెండు నౌకలు ఈ నెల 19/17 తేదీల్లో భారతీయ రేవులను చేరుకోవచ్చని ఆయన తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి హార్ముజ్ జలసంధికి పశ్చిమ వైపున నిలిచిపోయిన 24 నౌకల్లో ఈ రెండు నౌకలు ఉన్నాయని ఆ అధికారి చెప్పారు.

- గ్యాస్ కొరత తీవ్రతరం.. జనానికి తప్పని తిప్పలు
- దేశవ్యాప్తంగా హోటళ్లపై తీవ్ర ప్రభావం
- పనులు కోల్పోయి వలస కార్మికుల ఇంటిబాట
- యూపీలో గ్యాస్ ఏజెన్సీ వెలుపల వృద్ధుడి మృతి
- ఇండక్షన్ వాడకంపై స్టాలిన్ ప్రభుత్వం రాయితీలు
- కొరత లేదంటూనే ఆంక్షలు విధిస్తున్న కేంద్ర సర్కార్
- పీఎన్‌జీ కనెక్షన్ ఉన్న వారికి డొమెస్టిక్ ఎల్పీజీ బంద్



లక్నోలో ఎల్పీజీ కోసం బారులుతీరిన జనం

ముదురుతున్న సంక్షోభం

న్యూఢిల్లీ, మార్చి 14: దేశంలో గ్యాస్ సంక్షోభం ముదురుతున్నది. సమస్యను అధిగమించేందుకు హోటళ్లు, రెస్టారెంట్లు తమ మెనూను తగ్గించుకోవడం, ఆహార పదార్థాల రేట్లను పెంచడం వంటి చర్యలు చేపట్టగా కొన్ని రెస్టారెంట్లు బొగ్గు, కట్టెల పొయ్యి వంటి సంప్రదాయ వంట పద్ధతులకు మరలాయి. దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో చిన్న హోటళ్లు మూతపడుతుండగా ఉత్తరప్రదేశ్, కర్ణాటకలో అక్రమంగా నిల్వచేసిన ఎల్పీజీ స్థావరాలపై అధికారులు దాడులు నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీలోని రెస్టారెంట్లలో కార్పొరేట్ విందు సమావేశాలు, గ్రూపు పార్టీలు నిలిచిపోయాయి. ఎల్పీజీ కొరత కారణంగా పెద్ద సంఖ్యలో అతిథులకు విందును సమకూర్చడం తమకు సాధ్యం కాదని నిత్యం రద్దీగా ఉండే కన్నాట్ ప్లేస్‌లోని రెస్టారెంట్ల యజమానులు చేతులెత్తేస్తున్నారు. తక్కువగా గ్యాస్ ఖర్చయ్యే వంటకాలనే తమ మెనూలో ఉంచినట్లు ఫ్లేవర్స్ ఆఫ్ చైనా హోటల్ యజమాని పరంజీత్ కౌర్ చెప్పారు. మరోవైపు గ్యాస్ కోసం పడిగాపులు కాస్తూ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. పంజాబ్‌లో శుక్రవారం ఒకరు ప్రాణాలు కోల్పోగా, తాజాగా యూపీలో ఓ వృద్ధుడు మరణించాడు.

అక్రమ నిల్వలపై దాడులు

వివిధ రాష్ర్టాల్లో ఎల్పీజీని అక్రమంగా నిల్వ చేసిన స్థావరాలపై అధికారులు దాడులు చేసి పలువురిని అరెస్ట్ చేశారు. వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించేందుకు అక్రమంగా గృహ వినియోగ ఎల్పీజీని నిల్వచేసిన స్థావరంపై దాడి చేసిన కర్ణాటక ఆహార, పౌర సరఫరాల శాఖ అధికారులు 316 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గ్యాస్ సిలిండర్లను అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్న కోలార్ జిల్లాలోని కేజీఎఫ్‌లో ఓ గ్యాస్ ఏజెన్సీపై అధికారులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్ ఆహార, పౌర సరఫరాల శాఖ 1,483 ప్రదేశాలపై దాడులు చేసి వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసింది. మొత్తం 24 ఎఫ్ఐఆర్‌లు రాష్ట్రంలో నమోదయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని అనేక జిల్లాల్లో ఎల్పీజీ కోసం ప్రజలు గ్యాస్ ఏజెన్సీల ముందు బారులు తీరి నిలబడ్డారు. గ్యాస్ స్టాకును తనిఖీ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు 25 కేంద్రాలను తనిఖీ చేశాయి. సిలిండర్ల కొరతకు నిరసనగా కోల్‌కతాలోని కామర్హటి మున్సిపల్ కౌన్సిలర్ బిమల్ సాహా ఓ గ్యాస్ ఏజెన్సీ వెలుపల నిలబడిన ప్రజలకు పిడకలను పంపిణీ చేశారు. బెంగాల్‌లోని అనేక హోటళ్లు, రెస్టారెంట్లు మెనూను తగ్గించడంతోపాటు కట్టెలు, బొగ్గుల పొయ్యిని ఆశ్రయిస్తున్నారు. ఎల్పీజీతో నడిచే ఆటోలు చాలా జిల్లాల్లో కనుమరుగయ్యాయి. తమిళనాడులోని చెన్నైతోపాటు ఇతర నగరాల్లో రెస్టారెంట్లు ప్రత్యామ్నాయ వంట పద్ధతులను పాటిస్తున్నాయి. ఇండక్షన్ స్టవ్‌లతో వంటకాలను తయారుచేస్తున్నట్లు చెన్నైకు చెందిన ఓ ప్రముఖ హోటల్ చెయిన్ యజమాని తెలిపారు. మధ్యప్రదేశ్‌లో ఆతిథ్య, ఆహార సేవా రంగం పూర్తిగా మూతపడకుండా నివారించేందుకు వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల సరఫరాను వెంటనే పరిమితంగానైనా పునరుద్ధరించాలని భోపాల్‌లోని అఖిల భారత వర్తకుల సమాఖ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని అర్థించింది.



జైపూర్‌లో గ్యాస్ రీఫిల్లింగ్ కోసం వరుస కట్టిన ఆటోలు

కేరళలో వలస కార్మికుల ఇంటిబాట

కేరళలో ఎల్పీజీ సంక్షోభం వలస కార్మికులు తమ స్వస్థలాలకు తిరుగు ప్రయాణమయ్యే పరిస్థితిని కల్పించింది. పెద్ద సంఖ్యలో వలస కార్మికులు సొంత ఇంటి బాట పడుతున్నారు. రంజాన్ పండుగ దగ్గరపడుతుండడం, పశ్చిమ బెంగాల్, అస్సాంలో అసెంబ్లీ ఎన్నికలు వస్తుండడంతో అక్కడి వలస కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు.

తమిళనాడు ప్రభుత్వం ఆఫర్

ఎలక్ట్రిక్ స్టవ్‌లు వాడే రెస్టారెంట్లు, హోటళ్లు, టీ షాపులకు యూనిట్ విద్యుత్తుకు రూ. 2 చొప్పున సబ్సిడీ ఇస్తామని తమిళనాడు ప్రభుత్వం శనివారం ప్రకటించింది. కేంద్రం ప్రకటించిన వాణిజ్య ఎల్పీజీ ఆంక్షలు కొనసాగినంత కాలం ఈ సబ్సిడీ అమల్లో ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. హైవేలు, నగరాల్లో ఉండే అనేక ధాబాలు, చిన్న హోటళ్లు సంప్రదాయ బొగ్గుతో మండే భట్టీలకు మరలుతున్నాయి. బొగ్గుకు మళ్లీ డిమాండు పెరిగిందని ఢిల్లీకి చెందిన బొగ్గు వ్యాపారి దీపక్ ఖండేల్వాల్ తెలిపారు.

ఢిల్లీలో ఎల్పీజీ కోసం బారులు

దేశ రాజధాని ఢిల్లీలో వంటగ్యాస్ కోసం ప్రజలు గ్యాస్ ఏజెన్సీల వెలుపల బారులు తీరారు. ఎల్పీజీ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు వదంతులు వ్యాపించడంతో భయాందోళన చెందిన ప్రజలు భారీ సంఖ్యలో ఏజెన్సీల వద్దకు ఖాళీ సిలిండర్లతో చేరుకున్నారు. ప్రజలను అదుపు చేసేందుకు పోలీసులు రంగ ప్రవేశం చేయవలసి వచ్చింది. గంటల కొద్దీ నిలబడాల్సి రావడంతో అసహనానికి గురైన ప్రజలు ఏజెన్సీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడం ఢిల్లీ గేటులోని ఎల్పీజీ ఏజెన్సీ వద్ద కనిపించింది. ఆన్‌లైన్ బుకింగ్ విధానం పనిచేయడం లేదని, పంపిణీదారులకు ఫోన్ చేసినా స్పందన లేదని ప్రజలు ఫిర్యాదు చేశారు.

యూపీలో 70 ఏండ్ల వృద్ధుడి మృతి

ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ జిల్లాలో ఓ గ్యాస్ ఏజెన్సీ గిడ్డంగి వద్ద ఎల్పీజీ సిలిండర్ కోసం ఎదురుచూస్తూ ఓ 70 ఏండ్ల వృద్ధుడు గుండెపోటుకు గురై మరణించాడు. గర్వ ఖాన్ ఖానా ప్రాంతానికి చెందిన ముఖ్తియార్ అహ్మద్ అనే ఎంబ్రాయిడరీ కార్మికుడు శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో గ్యాస్ ఏజెన్సీ గిడ్డంగి వెలుపల ఎల్పీజీ సిలిండర్ కోసం ఎదురుచూస్తూ హఠాత్తుగా ఛాతి నొప్పితో కూలిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు సీపీఆర్ నిర్వహించి ఆ వృద్ధుడిని దవాఖానకు తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు డాక్టర్లు ప్రకటించారు. మృతుడికి ఐదుగురు కుమార్తెలు సహా ఏడుగురు పిల్లలు, భార్య ఉన్నారు.



మహారాష్ట్రలోని కరద్‌లో ఎల్పీజీ సిలిండర్ కోసం ప్రజలపాట్లు

కాశీ ఆలయంలో వంటశాల మూసివేత

ఎల్పీజీ కొరత కారణంగా కాశీలోని మాతా అన్నపూర్ణ వంటశాల మూతపడినట్లు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజయ్ రాయ్ శనివారం వెల్లడించారు. వేలాదిమంది కడుపునింపే కాశీ అన్నపూర్ణ భోజనశాల పేదలకు ఆకలిని మిగిల్చిందని ఆయన పేర్కొన్నారు. శతాబ్దాల సంప్రదాయానికి ఎల్పీజీ కొరత గండి కొట్టిందని, మాతా అన్నపూర్ణ వంటశాల మూతపడిందని ఆయన తెలిపారు. ఆకలితో ఎవరూ ఇంతవరకు ఆ తలుపుల నుంచి బయటకు వెళ్లలేదని, నేడు సాధువులు, స్వామీజీలు, భక్తులు సైతం భోజనం చేయకుండా వెనుదిరగవలసిన దుస్థితి ఏర్పడిందని ఎక్స్ పోస్టులో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పాలకుల వైఫల్యం మాత్రమే కాదని, పవిత్ర కాశీ విశ్వనాథుని నగరంపై భక్తులకు ఉన్న విశ్వాసంపై జరిగిన దాడని ఆయన పేర్కొన్నారు.

వారికి ఎల్పీజీ సిలిండర్లు ఇవ్వొద్దు: కేంద్రం

పైపుల ద్వారా సహజవాయువు కనెక్షన్లు కలిగి ఉన్న వినియోగదారులు డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్లు పొందకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వినియోగదారులు తమ ఎల్పీజీ సిలిండర్లను తిరిగి నింపుకోవడాన్ని, కొత్తవి పొందడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు జారీచేసింది. దేశంలోని రిటైల్ ఔట్‌లెట్లలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు శనివారం ఒక అడ్వైజరీ జారీ చేస్తూ వినియోగదారులు చమురును లూజ్‌గా, కంటైనర్లలో నిల్వ చేయవద్దని, అది భద్రతాపరంగా కూడా ప్రమాదకరమని పేర్కొన్నది. రిటైల్ ఔట్‌లెట్లు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

కేయూ మాజీ వీసీ లింగమూర్తి మృతి


లింగమూర్తి (ఫైల్)

హనుమకొండ చౌరస్తా, మార్చి 14 : వరంగల్ నగరంలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఎకానమిక్స్ విభాగానికి చెందిన విశ్రాంత ఆచార్యులు, మాజీ వైస్ చాన్స్‌లర్ ఎన్ లింగమూర్తి(75) శనివారం కన్నుమూశారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హనుమకొండ భీమారంలోని తన నివాసంలో మరణించారు. లింగమూర్తి కాకతీయ విశ్వవిద్యాలయం 10వ వైస్‌చాన్స్‌లర్‌గా నవంబర్ 2007 నుంచి నవంబర్ 2010 వరకు సేవలందించారు. విశ్వవిద్యాలయంలో క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, యూజీసీ యూనిట్ సమన్వయ అధికారిగా, దూర విద్య కేంద్ర సంచాలకుడిగా, ఎకానమిక్స్ విభాగాధిపతిగా, సోషల్ సైన్సెస్ విభాగాల డీన్‌గా, పరీక్షల నియంత్రణాధికారిగా, ఖమ్మంలోని పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2011లో ఆయన ఉద్యోగ విరమణ చేశారు.

ఏప్రిల్ 26న కులరహిత సాంస్కృతిక ఉత్సవాలు

హైదరాబాద్, మార్చి 14(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏప్రిల్ 26, 27న రాష్ట్రస్థాయి కుల రహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు శనివారం వెల్లడించారు. ఏప్రిల్ 11న జ్యోతిబాపూలే, ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని ఏప్రిల్ నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా పాటించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 200 గ్రామాల్లో వీడీసీల పేరిట అట్టడుగు తరగతులపై దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

అబ్బాయిలు ప్రైవేట్‌కు.. అమ్మాయిలు సర్కార్ బడికి

21వ శతాబ్దంలోనూ లింగ వివక్ష • పాఠశాల విద్యలో అసమానతలు • వివక్ష ప్రదర్శిస్తున్న తల్లిదండ్రులు

వెల్లడించిన 2026 యూ డైస్ నివేదిక

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 21వ శతాబ్దంలోనూ లింగ వివక్ష కనిపిస్తున్నది. అబ్బాయిల పట్ల ఒకరకంగా.. అమ్మాయిల పట్ల ఒక రకంగా వ్యవహరించే తల్లిదండ్రులు ఇంకా ఉన్నారు. పాఠశాల విద్యలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ లింగ వివక్షకు నిదర్శనంగా నిలుస్తున్నది. కొందరు తల్లిదండ్రులు అబ్బాయిలను ప్రైవేట్ స్కూళ్లకు, అమ్మాయిలను సర్కార్ బడులకు పంపిస్తున్నారు. సర్కార్ బడుల్లో 52% అమ్మాయిలుంటే.. ప్రైవేట్ స్కూళ్లల్లో 54% అబ్బాయిలున్నారు. రాష్ట్రంలో లింగ వివక్ష ఇంకా పూర్తిగా తొలగిపోలేదనేందుకు ఈ గణాంకాలే తార్కాణంగా నిలుస్తున్నాయి. 2026 యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్) నివేదికలో ఈ అంశం వెలుగుచూసింది.

అబ్బాయిలు 4 లక్షల మంది ఎక్కువ...

సర్కార్ బడుల్లో (గురుకులాలు, కేజీబీవీలు, మాడల్ స్కూల్స్) అన్ని కలిపితే విద్యార్థుల సంఖ్య 26,81,580 ఉండగా, వీరిలో 13.94 లక్షలు (52%) అమ్మాయిలున్నారు. సర్కార్ బడుల్లో అబ్బాయిల సంఖ్య 12,87,158(48%) మాత్రమే. అదే ప్రైవేట్ స్కూళ్లల్లో మొత్తం 47,51,692 లక్షల మందికి అబ్బాయిలు 26.73(54%) లక్షలుండగా, అమ్మాయిలు 22.77(46%) లక్షలు మాత్రమే. అంటే రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్లల్లో అమ్మాయిలతో పోల్చితే అబ్బాయిలు 4 లక్షల మంది ఎక్కువగా చదువుతున్నారన్నమాట. అన్ని రకాల సర్కార్ బడులు 28,033 ఉండగా, వీటిల్లో విద్యార్థుల సంఖ్య 26 లక్షలుండగా, ప్రైవేట్ స్కూళ్లు 13,244 ఉండగా, వీటల్లో ఏకంగా 49.51లక్షల మంది విద్యార్థులున్నారు. యాజమాన్యాలవారీగా తీసుకొంటే సర్కార్ బడుల్లో 35% విద్యార్థులుంటే, ప్రైవేట్ స్కూళ్లల్లో 65% విద్యార్థులున్నారు.



డిగ్రీ సైన్స్‌లో అమ్మాయిలు.. ఆర్ట్స్‌లో అబ్బాయిలు

రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల ఎంపికలోనూ లింగ సమానత్వం కనిపించడంలేదు. ఈ కోర్సుల్లో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. సైన్స్ కోర్సుల్లో అమ్మాయిలు అధికంగా చేరుతుండగా, ఆర్ట్స్ కోర్సుల్లో అబ్బాయిలు ఎక్కువగా అడ్మిషన్లు పొందుతున్నారు. బీఎస్సీ గ్రూపులో 64% మంది అమ్మాయిలుంటే, అబ్బాయిలు కేవలం 36% మాత్రమే ఉన్నారు. ఇక బీకాం కోర్సుల్లో అబ్బాయిలు 54శాతముంటే, అమ్మాయిల వాటా 46% మాత్రమే. బీఏ కోర్సుల్లో అబ్బాయిలు 58% అడ్మిషన్లు పొందితే, అమ్మాయిలు 42% మాత్రమే ఉన్నారు.

కారణాలు

- అబ్బాయిల భవిష్యత్తు కోసం మంచి చదువులు అవసరమన్న భావనలో ఉండే కుటుంబాలు ఇంకా ఉన్నాయి.
- ప్రైవేట్ స్కూళ్లల్లో చదువులు ఖరీదైనవి కావడంతో ఫీజులు భరించలేక కొన్ని కుటుంబాలు అబ్బాయిలను ప్రైవేట్‌కు పంపించి, అమ్మాయిలను సర్కార్ బడులకు పంపిస్తున్నారు.
- ఇంకా కొన్ని సమాజాలు అమ్మాయిల విద్యకు తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. అమ్మాయిలకు ఖరీదైన చదువులెందుకు అన్న భావనలో ఉన్నవారింకా ఉన్నారు. అమ్మాయిలు ఇంటి పనులు నేర్చుకోవాలనే అభిప్రాయం ఇంకా ఉంది.
- తరగతులవారీగా మొత్తం ఎన్‌రోల్‌మెంట్ (శాతం) వివరాలను పరిశీలిస్తే 1-5 తరగతుల్లో సర్కార్ బడుల్లో 8,58,106 (32%)విద్యార్థులుంటే, 6-12 తరగతుల్లో 18,23,474 (48%) విద్యార్థులున్నారు.
- ప్రైవేట్ బడుల్లో 1-5 తరగతుల్లో 33,67,150 (68%) విద్యార్థులుండగా, 6-12 తరగతుల్లో 15,84,542 (52%) విద్యార్థులున్నారు.

సామాజిక వర్గాలవారీగా..

- ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థుల్లో అత్యధికులు బీఏ కోర్సుల్లో చేరుతున్నారు. 36% మంది బీఏ కోర్సుల్లో అడ్మిషన్లు పొందారు.
- ఎస్సీ, బీసీ కులాలకు చెందిన వారు బీఎస్సీ కోర్సును ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ కోర్సుల్లో ఏకంగా 45% ఎస్సీలు, బీసీలే ఉన్నారు.
- ఓసీ కులాలకు చెందిన వారు బీకాం కోర్సుల్లో చేరుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 40% మంది ఓసీలు బీకాం కోర్సుల్లో చేరడం విశేషం.

టెన్త్ పరీక్షల్లో సెల్ఫ్ సెంటర్ వివాదం

సొంత స్కూల్లో 81 మందికి ఎగ్జామ్
- ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలు
- తొలిరోజు 99% మంది విద్యార్థుల హాజరు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి భాష పేపర్‌కు పరీక్ష నిర్వహించారు. అయితే సొంత స్కూల్లో సెంటర్ల కేటాయింపు వివాదాస్పదమైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో సెల్ఫ్ సెంటర్‌లో విద్యార్థులను ఎక్కువగా కేటాయించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మాస్ కాపీయింగ్ కోసమే ఇలా చేశారని, పరోక్షంగా అధికారులు సహకరించారన్న ఆరోపణలొచ్చాయి. కూకట్‌పల్లిలోని న్యూ ఎరా పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఒక్క స్కూల్ నుంచే 337 మంది పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. ఈ జోన్‌లో కేవలం నాలుగు సెంటర్లు మాత్రమే ఏర్పాటు చేయగా... 13 పాఠశాలలకు చెందిన 857 మంది పరీక్షలు రాస్తున్నారు. ఈ 857 మందిని నాలుగు సెంటర్లకు కేటాయించగా, న్యూ ఎరా పాఠశాల సెంటర్‌లో అదే స్కూల్‌కు చెందిన 80 మంది విద్యార్థులకు సెల్ఫ్ సెంటర్ కేటాయించారు. విషయం బయటికి పొక్కడం, మీడియాలో వార్తలు రావడంతో విద్యాశాఖ అప్రమత్తమైంది. ఈ సెంటర్‌లో నలుగురు సిట్టింగ్ స్క్వాడ్‌ను, రెవెన్యూ సిబ్బందిని మోహరించారు. ఈ అంశంపై డీఈవో విజయకుమారి స్పందిస్తూ సాఫ్ట్‌వేర్ ఆధారంగానే సెంటర్ల కేటాయింపు జరిగిందని తెలిపారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. పరీక్షల తొలిరోజే రెండు వేల మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 5,17,197 మంది రెగ్యులర్ విద్యార్థులకు 5,15,374 మంది పరీక్షకు హాజరుకాగా 1,823 మంది గైర్హాజరయ్యారు. 786 మంది ప్రైవేట్ విద్యార్థులకు 626 మంది పరీక్షకు హాజరుకాగా, 160 మంది గైర్హాజరయ్యారు. 1,240 సెంటర్లలో ఫ్లైయింగ్ స్క్వాడ్, అధికారులు తనిఖీలు నిర్వహించినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ పీవీ శ్రీహరి తెలిపారు.



దుఃఖాన్ని దిగమింగి పరీక్షకు..

పదో తరగతి తొలిరోజు విద్యార్థులకు పరీక్ష

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 14 : ఓ వైపు పదోతరగతి పరీక్షలు ప్రారంభం.. మరోవైపు తల్లిదండ్రుల మరణంతో పుట్టెడు దుఃఖంలోనూ విద్యార్థులు పరీక్షలు రాసిన ఘటన శనివారం పలు చోట్ల చోటుచేసుకున్నది. సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన న కే అపర్ణ స్థానిక నియో వివేకానంద పాఠశాలలో పదోతరగతి చదివి పరీక్షలకు సిద్ధమైంది. విద్యార్థిని తల్లి భానుప్రియ గురువారం అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం అంత్యక్రియలు పూర్తిచేశారు. శనివారం వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా.. కుటుంబసభ్యులు, స్నేహితులు నచ్చజెప్పడంతో అపర్ణ పరీక్ష రాసింది. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పాంబండకు చెందిన కుమ్మరి నాగరాజు (45), అతడి భార్యతో కలిసి శుక్రవారం రాత్రి బైక్‌పై వస్తుండగా రోడ్డు ప్రమాదంలో నాగరాజు మృతిచెందగా, అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు ధనూష్ శనివారం తీవ్ర విషాదంలోనూ తూప్రాన్‌లోని కేంద్రానికి వెళ్లి పరీక్షరాశాడు. అనంతరం తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన కూరెళ్ల ఎల్లయ్య గుండాల మండలం వాస్తాకొండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఎల్లయ్యకు గుండెపోటు రావడంతో రాత్రి మృతి చెందారు. పుట్టెడు దుఃఖంలోనూ ఎల్లయ్య కుమారుడు హర్షవర్ధన్ పట్టణంలోని సెక్రేడ్ హార్ట్ హైస్కూల్‌లో జరిగిన తెలుగు పరీక్షకు హాజరయ్యాడు. హర్షవర్ధన్ స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో విద్యనభ్యసించాడు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం బత్తులపల్లికి చెందిన గరిడేపల్లి మణికంఠ అదే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మణికంఠ తండ్రి కొండల్‌రావు అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. తండ్రి చనిపోయిన దుఃఖంలో ఉన్న మణికంఠ బాధాతప్త హృదయంతో పదోతరగతి పరీక్షకు హాజరయ్యాడు.

10 బాలిస్టిక్ మిస్సైల్స్‌ను ప్రయోగించిన ఉ.కొరియా

జపాన్ సముద్ర జలాల్లో పడిన మిస్సైల్స్!

ప్యాంగ్యాంగ్, మార్చి14: పశ్చిమాసియాలో యుద్ధం పతాక స్థాయికి చేరిన వేళ మరో టెన్షన్ మొదలైంది. ఉత్తర కొరియా శనివారం జపాన్ సముద్ర జలాల్లోకి 10 బాలిస్టిక్ మిస్సైల్స్ ప్రయోగించింది. జపాన్ సముద్ర జలాల్లో అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలకు సమాధానంగా..ఉత్తర కొరియా ఈ చర్యకు దిగినట్టు వార్తలు వెలువడ్డాయి. శనివారం తమ దేశ సముద్ర జలాల్లోకి ఉత్తర కొరియా వరుసగా 10 బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించిందని, జపాన్ ఆర్థిక మండలి వెలుపల ఒక మిస్సైల్ పడిపోయినట్టు ఆ దేశ ప్రభుత్వ మీడియా 'ఎన్‌హెచ్‌కే' పేర్కొన్నది. తమ దేశ తూర్పు తీర సముద్ర జలాల్లోకి ఉత్తర కొరియా మిస్సైల్స్ ప్రయోగించినట్టు దక్షిణ కొరియా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ప్రకటనలో తెలిపారు. అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలు పూర్తిగా రక్షణాత్మకమైనవిగా చెబుతున్నప్పటికీ, ఈ చర్యలను ఉత్తర కొరియా తీవ్రంగా ఖండిస్తున్నది.

వైద్య శాఖ అవినీతిపై ఇంటెలిజెన్స్ ఆరా

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): వైద్యాశాఖలో హద్దుమీరిన అవినీతిని వెలికితీస్తూ 'నమస్తే తెలంగాణ'లో శనివారం ప్రచురితమైన 'వైద్యశాఖలో అవినీతి తిమింగలం' కథనంపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీసినట్టు తెలిసింది. యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్న ఇద్దరు అధికారుల వివరాలు సేకరించినట్టు సమాచారం. మరోవైపు ఈ కథనం మీద సదరు శాఖలో దుమారం రేపింది. ఉద్యోగుల మధ్య ఈ కథనంపై పెద్దఎత్తున చర్చ నడిచినట్టు తెలుస్తున్నది. ఆరోగ్యశాఖ అధికారులు, డాక్టర్ల వాట్సాప్ గ్రూప్‌ల్లో నమస్తే కథనం చక్కర్లు కొట్టింది.

ఆస్తిపన్ను వసూళ్లలో జమ్మికుంట రికార్డు

రెండోసారి వందశాతం పన్ను వసూలు

జమ్మికుంట, మార్చి 14: ఆస్తి పన్ను వసూళ్లలో కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ రికార్డు సృష్టించింది. వరుసగా రెండోసారి వందశాతం పన్ను వసూలు చేసింది. ఈ నెల 31 వరకు పన్ను వసూళ్ల టార్గెట్ పూర్తి చేయాల్సి ఉండగా.. 14వ తేదీ వరకే వసూలు చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్‌తోపాటు అధికారులు, సిబ్బందికి సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో వందశాతం పన్ను వసూలు చేయించిన కమిషనర్.. సీడీఎంఏ నుంచి అభినందనలతోపాటు రూ.3 కోట్ల ప్రత్యేక నిధులు పొందారు. 2025-26లో వందశాతం పన్ను వసూళ్లు ఈ నెల 31లోగా చేయాల్సి ఉండగా మున్సిపాలిటీలోని 12,668 ఇండ్లకు సంబంధించిన రూ.3,24,44,000 పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని ఈ నెల 14వ తేదీ వరకే పూర్తి స్థాయిలో వసూలు చేసి అన్ని మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచింది.

పాత రాతియుగం పనిముట్టు లభ్యం

ఇది హైదరాబాద్ చరిత్రలో మైలురాయి : శ్రీరామోజు హరగోపాల్



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో కొత్త చరిత్ర ఆనవాళ్లు లభించినట్టు తెలంగాణ కొత్త చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ శివారు ప్రాంతంలో మంచిరేవుల బీరప్ప గుడి గుట్ట మీద వేల ఏండ్ల నాటి రాతి పనిముట్టును గుర్తించినట్టు పేర్కొన్నారు. గుర్తించిన ఆ రాతి పనిముట్టు 7 సెంటిమీటర్ల పొడవు, 11 సెంటిమీటర్ల చుట్టుకొలతతో ఉన్నదని తెలిపారు. రాతి పనిముట్టు ఫొటోను చూసిన ప్రొఫెసర్ రవి కొరసెట్టర్ (ధార్వాడ్ యూనివర్సిటీ) పరిశీలించి అది ఎగువ పాత రాతియుగం నాటిదని చెప్పినట్టు వివరించారు. పాత రాతియుగం పనిముట్టు లభించడం హైదరాబాద్ చరిత్రలో ఒక మైలు రాయి అని హరగోపాల్ అభిప్రాయపడ్డారు. క్లైమెట్ ఫ్రంట్ తెలంగాణ వైస్ ప్రెసిడెంట్‌తో కలిసి నాటి ఆనవాలు గుర్తించినట్టు ఆయన వెల్లడించారు.

'బెస్ట్ అవైలబుల్ బకాయిలు విడుదల చేయాలి'

హైదరాబాద్, మార్చి14 (నమస్తే తెలంగాణ): దళిత, గిరిజన నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు దోహదపడుతున్న బెస్ట్ అవైలబుల్ స్కీమ్ (బాస్)కు సంబంధించిన బకాయిలు ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని తెలంగాణ బాస్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాతంగి అమర్, సటావత్ రమేశ్‌నాయక్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కీమ్‌కు సంబంధించిన బకాయిలు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు.





కొరియా.. ఒంటరిగా!

మేడ్ ఇన్ కొరియా

నెట్‌ఫ్లిక్స్: స్ట్రీమింగ్ అవుతున్నది
తారాగణం: ప్రియాంక మోహన్, రిషికాంత్, పార్క్ హే జిన్, జే హ్యాన్ జాంగ్ తదితరులు
దర్శకత్వం: రా కార్తీక్

ఓటీటీ హిట్



కొరియన్ సినిమాలపైనా మనవాళ్లు ఆసక్తి చూపిస్తుంటారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కే కె-డ్రామాలను బాగానే ఆదరిస్తుంటారు. కె-పాప్ మ్యూజిక్ అన్నా చెవి కోసుకుంటారు. ఈ క్రమంలోనే పవన్ కల్యాణ్ ఓజీ హీరోయిన్ ప్రియాంక మోహన్ కీలకపాత్రలో కొరియా నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కింది. నేరుగా నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తెలుగు సహా తమిళం, కన్నడ, మలయాళం, హిందీలో స్ట్రీమింగ్ అవుతూ.. రికార్డ్ వ్యూస్ సాధిస్తున్నది. కథలోకి వెళ్తే.. తమిళనాడులోని ఓ పల్లెటూరికి చెందిన అమ్మాయి.. షన్బా (ప్రియాంక మోహన్). ఆమెకు చిన్నప్పటి నుంచీ కొరియన్ సినిమాలు, కొరియన్ పాప్ మ్యూజిక్ అంటే పిచ్చి. అందుకే, ఎలాగైనా కొరియా వెళ్లాలని అనుకుంటుంది. పాఠశాల రోజుల నుంచే కొరియన్ భాష నేర్చుకుంటుంది. కొరియన్లలా తినడం కూడా అలవాటు చేసుకుంటుంది. పెద్దయ్యాక తనే మారుతుందని తల్లిదండ్రులు అనుకుంటారు. కానీ, వారికి షాక్ ఇస్తూ.. ఓ అనూహ్య నిర్ణయం తీసుకుంటుంది షన్బా. ప్రియుడితో కలిసి దక్షిణ కొరియాకు బయల్దేరుతుంది. కానీ, విమానం ఎక్కిన తర్వాత తన బాయ్‌ఫ్రెండ్ హ్యాండ్ ఇస్తాడు. అయినా ఒంటరిగానే సౌత్ కొరియా రాజధాని సియోల్‌లో అడుగుపెడుతుంది. ఈ క్రమంలో షన్బాకు ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? చేతిలో ఉన్న డబ్బులు అయిపోయిన తర్వాత ఆమె ఏం చేస్తుంది? తమను కాదనుకుని వెళ్లిన షన్బా విషయంలో.. ఆమె తల్లిదండ్రులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? కొరియాలో పరిచయమైన అబ్బాయి (పార్క్ హే జిన్) ఎవరు? తిరిగి ఆమె ఇండియాకు వస్తుందా? అక్కడే ఉండిపోతుందా? అనే విషయాలు తెలియాలంటే.. మేడ్ ఇన్ కొరియా వీక్షించాల్సిందే!

నమస్తే తెలంగాణ
జిందగీ
ఆదివారం | 15 మార్చి 2026
హైదరాబాద్ | www.ntnews.com




'రాకుమారి నీ వశమవుతుందిరా..' అని ఎస్వీయార్ కన్నింగ్ కండ్లు తిప్పుతూ అనేసరికి! అంతటి ఎన్టీయార్.. ప్రేమ కోసమై నేపాల మాంత్రికుడి వలలో పడిపోయాడు. సాహసం శాయడానికి సిద్ధమయ్యాడు! ఆ సాహసమే.. 'పాతాళ భైరవి'గా వెండితెరపై బంగారు కాంతులీనింది. 'నిజం చెప్పమంటారా! అబద్ధం చెప్పమంటారా!' పాతాళ భైరవి గురించి కొన్ని నిజాలు చెబితే.. ఎహె అబద్ధం అనుకుంటారు ఇప్పటికీ! కానీ, ఈ సినిమా వెనుక నమ్మలేని నిజాలు కొన్నున్నాయి! ఆ నిజానిజాలు ఇప్పుడెందుకు? అంటారా!! మన తోటరాముడు వెండితెర సంచలనంగా మారి అచ్చంగా నేటికి 75 ఏండ్లు పూర్తయింది. తోటలో హీరో.. కోటలో హీరోయిన్ హిట్ ఫార్ములాకూ సెవంటీ ఫైవ్ ఇయర్స్ నిండాయి. తెలుగు హీరోకు 'మాస్ ఇమేజ్' అనే మానియా పుట్టి కూడా ఇన్నేండ్లయింది. మొత్తంగా టాలీవుడ్‌లో కమర్షియల్ సినిమాకు తొలిగా నిర్వచనం ఇచ్చిన మన 'పాతాళ భైరవి' వజ్రోత్సవ సంబురం జరుపుకొంటున్నది. ఆ చిత్ర రాజం విశేషాలను తెలుచుకోవడం.. జనం కోరేది మనం ఇవ్వడమే అవుతుంది.

జై పాతాళభైరవి

75 Years


ప్రస్తుతం వస్తున్న మాస్ హీరోలంతా తోటరాముడి సంతతే అన్నారు ముళ్లపూడి వెంకటరమణ. ఆయన అన్నమాటలో అక్షరం కూడా తప్పులేదు. సాధారణమైన తోటమాలి కొడుకు యువరాణిని ప్రేమించడమేంటి? కోట బురుజులు దూకి మహారాజుకు సవాలు విసరడమేంటి? నేపాల మాంత్రికుడి చెర నుంచి రాజకుమారిని విడిపించి ధీరోదాత్తుడిగా నిలవడమేంటి? నిజంగా తెలుగు తెరపై తోటరాముడు లాంటి హీరోని అప్పటివరకూ జనం చూడలేదు. నేటికీ ఓ మాస్ హీరోని ఎస్టాబ్లిష్ చేయాలంటే తోటరాముడు ఫార్ములాని ఫాలో అవ్వాల్సిందే! హీరోయిజం పర్ఫెక్ట్‌గా ఎలివేట్ అవ్వాలంటే, హీరోకంటే విలన్ శక్తిమంతుడై ఉండాలి అనేది కమర్షియల్ ఫార్ములా. 'పాతాళభైరవి' సినిమా విషయంలో కేవీ రెడ్డి అనుసరించింది ఇదే. ఓ వ్యక్తి జీరోగా మొదలై.. హీరోగా మారే పరిణామక్రమమే 'పాతాళభైరవి'.

'జనం మెచ్చింది మనం శాయవలెనా.. మనం మెచ్చింది జనం చూడవలెనా..' అనేది పాతాళభైరవి సినిమాలో పింగళి రాసిన డైలాగ్. నిజానికి ఈ డైలాగ్ వెనుక పెద్ద కథే ఉంది. 'పాతాళభైరవి'కి ముందు విజయా సంస్థ తీసిన చంద్రహారం, షావుకారు సినిమాలు పెద్దగా ఆడలేదు. ముఖ్యంగా 'చంద్రహారం' సినిమాకు నాగిరెడ్డి, చక్రపాణి డబ్బు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చుపెట్టారు. కానీ, ఏ మాత్రం గిట్టుబాటు కాలేదు. దాంతో మనం మెచ్చిన కథలతో కాదు, జనం మెచ్చే కథలతోనే సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నారు విజయాధినేతలు. కస్తూరి శివరావ్ హీరోగా 'గుణసుందరి కథ' అనే జానపద చిత్రాన్ని తీసి, అఖండ విజయాన్ని అందుకున్న కేవీ రెడ్డిని దర్శకుడిగా ఎంచుకున్నారు. రచయితగా పింగళి ఎలాగూ ఉన్నారు. కేవీ రెడ్డి, పింగళి కలిసి రామాయణం, అల్లావుద్దీన్ కథల ప్రేరణతో 'పాతాళభైరవి' కథ వండారు. అంతా బాగానే ఉంది. మరి ఇందులో నటించే తారలెవరు? అప్పటివరకూ జానపద కథానాయకుడంటే ఏఎన్నార్‌రే. ఆయన హీరోగా, అంజలి హీరోయిన్‌గా, గోవిందరాజుల సుబ్బారావు నేపాల మాంత్రికుడిగా సినిమా చేద్దామనేది నిర్మాతల ఉద్దేశం. కానీ దర్శకుడు కేవీ రెడ్డి ఆలోచన వేరేలా ఉంది. 'నా తోటరాముడు ఏఎన్నార్ కాదు..' అని కరాఖండీగా చెప్పేశారట. ఆడిషన్స్ నిర్వహించారు. ఒడ్డూపొడుగూ బావుండటంతో రాజారెడ్డి అనే కుర్రాడ్ని హీరోగా అనుకున్నారు. కానీ.. అతనికి కాస్త నత్తి. దాంతో కథ మొదటికి వచ్చింది. సమయం గడిచిపోతున్నది. నిర్మాతలకు చిరాకు మొదలైంది. ఆ రోజు సాయంత్రం చెన్నై విజయా గార్డెన్స్‌లో జరిగింది ఆ అద్భుతం.



నిర్మాతలు నాగిరెడ్డి, చక్రపాణి, దర్శకుడు కేవీ రెడ్డి, రచయిత పింగళి కూర్చొని తీరిగ్గా మాట్లాడుకుంటున్నారు. ఆ పక్కనే కూతవేటు దూరంలో ఇద్దరు యువకులు షటిల్ అడుకుంటున్నారు. ఆ యువకులెవరో కాదు.. ఎన్టీయార్, ఏఎన్నార్. వారి ఆటను గమనిస్తూ ఈ నలుగురు పెద్దలూ మాట్లాడుకుంటున్నారు. ఆటలో ఏఎన్నార్‌దే పైచేయి. ఎన్టీఆర్ ఓడిపోతూ అసహనానికి లోనవుతున్నారు. చూస్తున్న నలుగురిలో ముగ్గురి దృష్టి గెలుస్తున్న ఏఎన్నార్‌పై ఉంటే, ఒక్క కేవీ రెడ్డి చూపు మాత్రం ఓడిపోతున్న ఎన్టీఆర్‌పై ఉంది. ఆ బ్యాట్‌ని ఒడిసి పట్టుకునే తీరు, కత్తిలా దాన్ని కదిలించే విధానం, ఆ కదలికలు, ఆ ఉద్రేకం, ఆ శారీరక భాష.. ఎలాగైనా గెలవాలనే ఆ కసి.. వీటన్నింటినీ గమనిస్తున్నారు కేవీ రెడ్డి.. ఆయన చూస్తున్నది ఎన్టీఆర్‌ని కాదు.. తన కథానాయకుడు తోటరాముడ్ని. ఈ విషయాన్నే నిర్మాతలకు చెప్పారు. వారిద్దరూ పెదవి విరిచారు. కానీ కేవీ రెడ్డి మాత్రం పట్టు విడువలేదు. ఎన్టీయార్‌ని ఇస్తేనే సినిమా చేస్తానని నిక్కచ్చిగా చెప్పేశారు. దాంతో అప్పటివరకూ భారీ కాస్టింగ్ అనుకున్న సినిమాను కాస్తా తక్కువ కాస్టింగ్‌తో చేసేద్దామని నిర్మాతలు ఫిక్స్ అయ్యారు. ఏఎన్నార్ ప్లేస్‌లోకి ఎన్టీయార్ రాగా, అంజలి స్థానంలోకి మాలతి వచ్చి చేరింది. అసలు ఎన్టీయార్ ఈ పాత్రకు న్యాయం చేయగలరా? లేదా? అనేది చూసుకునేందుకు ఇందులోని కీలమైన 'బొడ్డుదేవర సన్నివేశాన్ని' తొలుత చిత్రీకరించారు. ఆయన సింగిల్ టేక్‌తో ఆ సీన్ చేయడంతో తోటరాముడిగా ఎన్టీయార్ ఖరారైపోయారు. అప్పటికి ఎన్టీయార్ విజయా సంస్థలో నట ఉద్యోగి. ఆయన జీతం నెలకు రూ.250. ఈ సినిమా తర్వాత ఆయన స్థాయి అమాంతం పెరిగిపోయింది. ఇక గోవిందరాజుల సుబ్బారావు చేయాల్సిన నేపాల మాంత్రికుడి పాత్రకు అప్పటివరకూ చిన్నచిన్న వేషాలు చేస్తున్న ఎస్వీ రంగారావుని ఎంపిక చేశారు.

పాతాళభైరవిలో 'ఇతిహాసం విన్నారా.. ఆ అతిసాహసులే ఉన్నారా..' అనే ఓ పాట ఉంటుంది. టీజీ కమలాదేవి స్వయంగా పాడుతూ నటించిన పాట అది. ఆ పాట చివరిలో 'ఘాటు ఘాటుగా కథ నడిపించగా.. నేటికెవరు మన కథానాయకుడు? నీవా? నీవా? నీవా?' అని ప్రశ్నిస్తుందామె. జనాల్లో కూర్చొని ఉన్న వల్లం నరసింహారావు లేచి.. 'ఇంకెవరు మన తోటరాముడు' అంటాడు. ఇంతలో రాణిగారి తమ్ముడు రేలంగి రావడం.. తోటరాముడు అతని భరతం పట్టడం.. ఆ ఊరి జనాలంతా తోటరాముడి తలపై కిరీటం పెట్టడం.. తెరపై జరుగుతున్న ఈ తతంగం అంతా చూస్తుంటే.. అది తెలుగు సినీసామ్రాట్టుగా ఎన్టీయార్‌కి జరిగిన పట్టాభిషేకంగా అనిపిస్తుంది. నాటి నుంచి 33ఏండ్ల పాటు మకుటం లేని మహారాజుగా తెలుగు సినిమాను శాసించారు ఎన్టీయార్. అంతేకాదు, అంతకుముందు 'షావుకారు' సినిమాలో 'సున్నపు రంగడు' వంటి చిన్న పాత్ర చేసిన ఎస్వీ రంగారావు ఈ సినిమాతో టాలీవుడ్‌లో టాప్ విలన్‌గా అవతరించారు. తర్వాతి కాలంలో మహానటుడిగా తెలుగు, తమిళ ప్రజల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించారు. ఆ విధంగా ఇద్దరు మహానటులకు గట్టి పునాదిగా 'పాతాళభైరవి' నిలిచింది.



> *హాస్యనటుడిగా రేలంగికి 'పాతాళభైరవి' పెద్ద బ్రేక్, సదాజపుడిగా పద్మనాభం, అంజిగా వల్లూరి బాలకృష్ణ ఈ సినిమాతో బిజీ అయిపోయారు. 'పాతాళభైరవి'గా టైటిల్‌రోల్ పోషించిన గిరిజ.. ఈ సినిమా తర్వాత లేడీ కామెడీ స్టార్‌గా తెలుగుతెరను ఏలారు. ఇక తెలుగుప్రేక్షకుల ఆరాధ్యనటి మహానటి సావిత్రి తెరపై కనిపించిన తొలి సినిమా కూడా ఇదే. ఈ సినిమాలో 'నేను రానంటే రానే.. రానూ..' అంటూ సాగే ఓ నృత్య రూపకంలో ఓ మూడు నిమిషాల పాటు తళుక్కున మెరిసి మాయమవుతారు సావిత్రి. ఆ విధంగా ఎందరో టాలీవుడ్ లెజెండ్లు 'పాతాళభైరవి' దీవెనలతో వెలుగులోకి వచ్చారు. అప్పటివరకూ తిరుగులేని జానపద కథానాయకుడిగా వెలిగిన అక్కినేని నాగేశ్వరరావు... 'పాతాళభైరవి'లో ఎన్టీఆర్‌ని చూశాక, జానపద చిత్రాలకు దూరం జరిగి, సోషల్ పాత్రలపై శ్రద్ధ పెట్టారు. టాలీవుడ్‌లో మొత్తం 58 జానపద చిత్రాల్లో నటించి, అత్యధిక జానపద చిత్రాల్లో నటించిన కథానాయకుడిగా ఎన్టీయార్ చరిత్ర సృష్టించారు.*

'పాతాళభైరవి' అనగానే కేవీ రెడ్డి తర్వాత చెప్పుకోవాల్సింది.. రచయిత పింగళి నాగేంద్రరావు గురించే. 'ఎవరూ పుట్టించకపోతే మాటలెలా పుడతాయ్' అన్నట్టు.. అప్పటివరకూ వాడుకలో లేని కొత్తకొత్త పదాలను సృష్టించి.. ఈ సినిమా ద్వారా జనబాహుల్యంలో వాటిని మమేకం చేసేశారాయన. 'రేయ్.. డింగరి..', 'మోసం గురూ...', 'సాహసం సేయరా డింభకా..', 'నరుడా.. ఏమి నీ కోరిక'.. ఇలా చెప్పుకొంటూ పోతే ఈ సినిమాలో పింగళివారి మెరుపులు అన్నీ ఇన్నీ కాదు. ఇద్దరు స్నేహితులు కలిస్తే.. 'ఏం గురూ..' అని పిలుచుకోవడం ఇప్పుడు సర్వసాధారణం. అది మొదలైంది 'పాతాళభైరవి' నుంచే.

ఇక ఘంటసాల సంగీత దర్శకత్వంలో ప్రతి పాటా ఒక ఆణిముత్యమే.. 'కలవరమాయే మదిలో..', 'ప్రేమ కోసమై వలలో పడెనే పాపం పసివాడు..', 'కనుగొనగలనో లేనో..', 'ఎంతఘాటు ప్రేమయో..', 'తీయని ఊహలు హాయిని గొలిపే..', 'వినవే బాలా నా ప్రేమ గోలా..' ఇలా చెప్పుకొంటూపోతే అన్నీ మేలిముత్యాలే. 'పాతాళభైరవి'లో ఘంటసాల నేపథ్య సంగీతం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ముఖ్యంగా పాతాళ భైరవి గుహ నేపథ్యంలో వచ్చే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ప్రేక్షకులను విస్మయానికి గురిచేస్తుంది.

తెలుగులో 1951 మార్చి 15న విడుదలైన ఈ సినిమా.. మొత్తం 30 థియేటర్లలో వందరోజులు ఆడింది. తమిళంలో అదే ఏడాది మే 17న విడుదలై అక్కడ కూడా విజయఢంకా మోగించింది. ఇక విజయ, జెమినీ సంస్థలు సంయుక్తంగా 1952 మే 17న ఈ సినిమాను హిందీలో విడుదల చేయగా.. బాలీవుడ్‌లోనూ ఘన విజయాన్ని అందుకుంది. హిందీలో కొన్ని పాటలు కలర్‌లో చిత్రీకరించడం విశేషం. ఓ విధంగా టాలీవుడ్‌లో తొలి పానిండియా సినిమాగా 'పాతాళభైరవి' సినిమాను చెప్పొచ్చు. అలాగే.. ఈ సినిమా అయినన్ని రీ-రిలీజులు టాలీవుడ్ చరిత్రలో ఇప్పటివరకూ ఏ సినిమా కాలేదు. విడుదలైన నాటి నుంచి 60 ఏండ్ల పాటు తెలుగునేలపై ఏదో ఒకచోట ఈ సినిమా ప్రదర్శితమవుతూనే ఉంది. దీన్నిబట్టి 'పాతాళభైరవి' స్టామినా ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఈ విధంగా తెలుగు సినిమా స్థాయిని, గౌరవాన్ని పెంచిన చిత్రరాజం 'పాతాళభైరవి'. 75 ఏండ్లు కాదు, వందేళ్లు పూర్తి చేసుకున్నా.. ఈ సినిమా వైభవం విజయావారి బావుటాలా రెపరెపలాడుతూనే ఉంటుంది.

... నరసింహ బుర్రా

గుర్తింపు ఇక్కడినుంచే రావాలి

'ఇంట గెలిచి.. రచ్చ గెలవాలి' అంటారు. కానీ, తమ విషయంలో ఇందుకు భిన్నంగా జరుగుతున్నదని అస్సాం నటి సుకన్య బోరువా వాపోతున్నది. తాము బయట గుర్తింపు దక్కించుకున్నా.. స్వదేశంలో మాత్రం నిరాధరణే లభిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ముఖ్యంగా, సినీ పరిశ్రమలో ఈశాన్య రాష్ట్రాలకు రావాల్సినంత గుర్తింపు దక్కడంలేదని ఆరోపిస్తున్నది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సుకన్య.. తమ ప్రాంతాలపై చిన్నచూపు వద్దని కోరింది. ''ఈశాన్య రాష్ట్రాలకు దేశవ్యాప్తంగా గౌరవం లభించాలంటే.. అంతర్జాతీయ గుర్తింపు అవసరం లేదు. అది ఇంట్లోనే ప్రారంభం కావాలి. కానీ, ఇక్కడ అలా జరగడం లేదు. ఈ విషయమే మమ్మల్ని నిరాశకు గురిచేస్తున్నది. సిగ్గుచేటుగా అనిపిస్తున్నది'' అంటూ ఆవేదన వ్యక్తంచేసింది. రిమాదాస్ దర్శకత్వంలో వచ్చిన 'నాట్ ఏ హీరో' సినిమాలో కీలకపాత్రలో కనిపించింది సుకన్య బోరువా. ఈ సినిమా 2026 బెర్లిన్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో క్రిస్టల్ బేర్ అవార్డును గెలుచుకున్నది. ఒక అస్సామీ చిత్రానికి అంతర్జాతీయంగా గుర్తింపు దక్కినా.. స్వదేశంలో మాత్రం పట్టించుకోవడం లేదని సుకన్య చెప్పుకొచ్చింది. తమ ప్రతిభను గుర్తించడం లేదని వెల్లడించింది. ''ఎవరు ఎంత పక్షపాతం చూపినా.. 'కళ'ను మాత్రం అడ్డుకోలేరు. అది నిత్యం ప్రయాణిస్తూనే ఉంటుంది. స్వరాలు ఖండాలు దాటి వినిపిస్తాయి. మన గుర్తింపును ఎవరూ అడ్డుకోలేరని నిరూపిస్తాయి'' అంటూ చెప్పుకొచ్చింది. ఈశాన్య రాష్ట్రాల కళాకారులు ప్రపంచ వేదికలపై గుర్తింపు పొందడం గర్వకారణమనీ, అదే సమయంలో ఒక పెద్ద వాస్తవిక తనూ ఈ సంఘటన గుర్తుచేస్తుందని వెల్లడించింది.



''తరతరాలుగా మా ప్రాంతం ప్రధాన స్రవంతి కథనాలలో విస్మరణకు గురవుతూ వస్తున్నది. అదే సమయంలో ఈశాన్య ప్రాంతాలు శక్తివంతమైన కథలు, సంగీతం, సినిమాలలో ప్రతిభను చూపుతూనే ఉన్నాయి. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. మాకు రావాల్సిన గుర్తింపు అదే వస్తుంది'' అంటూ ఆశాభావం వ్యక్తం చేసింది. అస్సాం రాష్ట్రానికి చెందిన సుకన్య బోరువా.. నటి, మోడల్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది. పలు హిందీ ప్రాజెక్టులలోనూ పాలుపంచుకున్నది. 2021లో వచ్చిన 'నిమా డెంజోంగ్పా' చిత్రంతో పరిశ్రమలోకి అడుగుపెట్టింది. 'నాట్ ఏ హీరో'తో మంచి గుర్తింపు అందుకున్నది.

ఫాలో అవ్వాల్సిన పనిలేదు



సినీ పరిశ్రమను పీడిస్తున్న పలు సమస్యలపై బాలీవుడ్ సీనియర్ నటి షబానా ఆజ్మీ గళం విప్పింది. మహిళలు, అణగారిన వర్గాల హక్కులపై తరచుగా మాట్లాడే షబానా.. తాజాగా, సినిమాల్లో ఐటమ్ సాంగ్స్, అందులో మహిళలను చూపించే విధానంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రస్తుతం కొందరు నటులు సినిమాల్లో ఓ వస్తువుగా మారడానికి ఇష్టపడుతున్నారనీ, మహిళా నటులు వారిని ఫాలో అవ్వాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చింది. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రత్యేక గీతాల వల్ల సమాజంపై పడుతున్న ప్రభావం గురించి ఆందోళన వ్యక్తం చేసింది. ''ఐటమ్ సాంగ్స్‌లో మహిళా నటులు తమ శరీరాన్ని ఒక వస్తువులా ప్రదర్శిస్తుండటం బాధాకరమైన విషయం! కొందరు దర్శకులు కెమెరా కదలికల ద్వారానే తమ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తుంటారు. నటీమణుల శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చూపిస్తుంటారు. ఎద భాగాలు, నడుమును ప్రత్యేకంగా ఫోకస్ చేస్తుంటారు. ఇలా మహిళల శరీర భాగాలను చిత్రీకరించడం.. వారి స్వయంప్రతిపత్తిని దెబ్బతీయడమే!'' అంటూ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇక ఐటమ్ సాంగ్స్‌లోని సాహిత్యంపైనా షబానా విమర్శలు గుప్పించింది. అందులోని అర్థాలు తనను తీవ్ర అసహనానికి గురిచేస్తాయని చెప్పింది. ''చిన్నపిల్లలు 'చోళీ కే పీచే క్యా హై' పాటలు పాడుతున్నారు. పాపం.. అందులోని పదాల అర్థం వారికి తెలియదు కదా! ఇది సమాజానికి ఏమాత్రం మంచిది కాదు'' అంటూ దుయ్యబట్టింది. ''నిజానికి చాలా సినిమాల్లోని ఐటమ్ సాంగ్స్‌కు, కథకూ ఎలాంటి సంబంధం ఉండదు. కేవలం ప్రేక్షకులను ఆకర్షించడానికి మాత్రమే వీటిని పెడుతున్నారు. ఇక కొందరు.. 'మగవాళ్లు చేస్తున్నప్పుడు మహిళలు చేస్తే తప్పేంటి?' అని అంటున్నారు. కానీ, మగవారిలా సినిమాల్లో ఓ వస్తువుగా మారాల్సిన అవసరం మహిళా నటీమణులకు లేదు'' అంటూ చెప్పుకొచ్చింది. భారత్‌లో అత్యంత ప్రతిభావంతమైన నటీమణులలో షబానా ఆజ్మీ ఒకరు. 1974లో 'అంకుర్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. అద్భుతమైన నటనతో తొలి సినిమాతోనే ప్రేక్షకుల మనసుల్లో చోటు దక్కించుకున్నది. జాతీయ అవార్డునూ అందుకున్నది. విలక్షణమైన నటన, అసాధారణమైన పాత్రలతో దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నది. 160కి పైగా సినిమాల్లో నటించిన షబానా.. ఉత్తమ నటిగా ఐదు జాతీయ అవార్డులు కైవసం చేసుకున్నది. వీటితోపాటు ఐదు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, అంతర్జాతీయ స్థాయిలోనూ అనేక ప్రశంసలు అందుకున్నది. ఆమె చివరిసారిగా నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమైన 'డబ్బా కార్టెల్'లో కనిపించింది.

అంగీకరించి స్వీకరిస్తే..

బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్.. కొన్నేళ్లుగా మూర్ఛ వ్యాధితో పోరాడుతున్నది. ఈ విషయాన్ని ఆమె చాలాసార్లు బహిరంగంగానే వెల్లడించింది. ఈ నాడీ సంబంధిత అనారోగ్యంపై అవగాహన కల్పించడానికీ కృషి చేస్తున్నది. ఈ క్రమంలో తాజాగా, ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఫాతిమా.. తన అనారోగ్యం, ఇతర విషయాల గురించి పంచుకున్నది. ఈ ఆరోగ్య సమస్యను అంగీకరించి, సంపూర్ణంగా స్వీకరిస్తేనే.. జీవితంలో ముందుకు సాగగలమని అభిప్రాయపడింది. ఇక తాను మొదటిసారి మూర్ఛ వ్యాధితో బాధపడిన సందర్భాన్నీ గుర్తు చేసుకున్నది. ''చిన్నతనంలోనే రెండుమూడు సార్లు నాకు మూర్ఛ వచ్చింది. ఆ తర్వాత 'దంగల్' కోసం శిక్షణ పొందుతున్న సమయంలోనూ మూర్ఛతో ఇబ్బంది పడ్డా! వర్కౌట్స్ చేస్తున్నప్పుడు అకస్మాత్తుగా స్పృహ తప్పి పడిపోయాను. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అమీర్ సర్, సన్యా నా పక్కనే ఉన్నారు. నన్ను సకాలంలో ఆసుపత్రికి తరలించారు'' అంటూ చెప్పుకొచ్చింది. అయితే, వ్యాధి నిర్ధారణ అయినప్పటికీ కొన్నిరోజులపాటు ఆ నిజాన్ని అంగీకరించలేకపోయానని చెప్పింది. ''మందులు వాడితే నా కెరీర్ దెబ్బతింటుందేమోనని, ఇతరులు నన్ను బలహీనంగా చూస్తారేమోనని భయపడ్డా! మెడికేషన్ కూడా సరిగ్గా తీసుకోలేదు. దాంతో, మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఒకసారి అమెరికా వెళ్తున్నప్పుడు విమానంలో మూర్ఛ వచ్చింది. అత్యవసరంగా విమానాశ్రయ ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది'' అంటూ మరో సందర్భాన్నీ పంచుకున్నది. అయితే, ఆ సంఘటన ఫాతిమాను తీవ్రంగా భయపెట్టిందట. అప్పటి నుంచే తన అనారోగ్యాన్ని సీరియస్‌గా తీసుకుని, క్రమం తప్పకుండా మందులు వాడటం ప్రారంభించినట్లు వెల్లడించింది. ''ఇది కేవలం ఒక ఆరోగ్య సమస్య మాత్రమే! దీనిని అంగీకరించి, తగిన జాగ్రత్తలు తీసుకుంటే సాధారణ



జీవితం గడపవచ్చు'' అంటూ మూర్ఛ బాధితులకు భరోసా ఇస్తున్నది. ఇక సినిమాల విషయానికి వస్తే.. ఫాతిమా తన తదుపరి చిత్రం 'న్యాయ'లో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నది.

బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు

టీవీకే వెల్లడి

చెన్నై, మార్చి14: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమితో పొత్తు ప్రసక్తే లేదని తమిళ నటుడు విజయ్ నేతృత్వంలోని 'టీవీకే' (తమిళగ వెట్రి కజగం) ప్రకటించింది. బీజేపీతో ఎన్నికల పొత్తు ఉందంటూ వస్తున్న వార్తలను కేవలం మీడియా ఊహాగానాలుగా టీవీకే కొట్టివేసింది. ఈ విషయాన్ని పార్టీ జిల్లా కార్యదర్శులతో నిర్వహించిన వర్చువల్ మీటింగ్‌లో టీవీకే జాయింట్ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల పొత్తుపై ఎన్డీయేతో సంప్రదింపులు జరుగుతున్నాయంటూ వస్తున్న వార్తల్ని ఆయన ఖండించారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకు టీవీకేపై రోజూ మీడియా, సోషల్‌మీడియాలో వదంతులు వెలువడుతున్నాయని, వీటిని నమ్మవద్దని పార్టీ నేతలకు ఆయన సూచించారు.

మెటాలో 16,000 మందిపై వేటు!

దాదాపు 20 శాతం మందిని తొలగించేందుకు సంస్థ యోచన



వాషింగ్టన్, మార్చి14: ప్రముఖ సోషల్ మీడియా వేదిక 'ఫేస్‌బుక్' మాతృసంస్థ 'మెటా' 2026 ఏడాది ప్రారంభంలోనే భారీ ఎత్తున ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. కృత్రిమ మేధ (ఏఐ) విభాగంలో పెట్టుబడులను పెంచేందుకు, పాత విభాగాల్లో ఖర్చులను తగ్గించుకునే క్రమంలో వేలాది మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తున్నది. 'మెటా' మొత్తం సిబ్బందిలో దాదాపు 20 శాతం మందిని తొలగించే ప్రణాళికలో ఉందని, దీంతో సుమారుగా 16,000 మంది ఉద్యోగులపై ప్రభావం చూపుతుందని 'రాయిటర్స్' వార్తా కథనం పేర్కొన్నది. దీని ప్రకారం, లేఆఫ్ ప్రక్రియకు సిద్ధం కావాలంటూ సంస్థకు చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ టీమ్ లీడర్స్‌కు తెలియజేశారు. జనరేటివ్ ఏఐ, ఏఐ ఆధారిత ఆపరేషన్స్‌తో సామర్థ్యాల పెంపుదల, డాటా సెంటర్ల విస్తరణపై మార్క్ జుకర్‌బర్గ్ ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. దీనికోసం భారీగా నిధులు కేటాయిస్తున్నారు. జనవరి 2026లో మెటా తన రియాలిటీ ల్యాబ్స్ విభాగం నుంచి 1,500 మందికి ఉద్వాసన పలికింది. గత కొన్నేండ్లుగా రియాలిటీ ల్యాబ్స్ విభాగంలో నష్టాలు, ఏఐ అభివృద్ధికి అధిక వ్యయం లేఆఫ్‌లకు ప్రధాన కారణాలుగా తెలిసింది. మెటా తన ఏఐ బృందాలను బలోపేతం చేయడానికి కొత్త నియామకాలను చేపడుతూనే, పాత విభాగాల్లో ఖర్చులను తగ్గిస్తున్నది.

'నెట్‌ఫ్లిక్స్'లోనూ ఉద్యోగాల కోత

అంతర్గత పునర్వ్యవస్థీకరణలో భాగంగా 'నెట్‌ఫ్లిక్స్' దాని ప్రొడక్ట్, క్రియేటివ్ టీమ్స్‌లో పెద్ద సంఖ్యలో ఉద్యోగుల్ని ఇంటికి పంపింది. ప్రపంచవ్యాప్తంగా 16,000 మంది పనిచేస్తున్న 'నెట్‌ఫ్లిక్స్'లో ఇటీవల భారీగా ఉద్యోగులను తొలగించినట్టు తెలిసింది. క్రియేటివ్ స్టూడియో యూనిట్‌లోని డిజైనర్లు, ప్రొడ్యూసర్లు తదితరులపై తొలగింపుల ప్రభావం పడినట్టు వార్తలు వెలువడ్డాయి. ఏఐ సాధనాలు, ఆటోమేషన్ వైపు పలు టెక్ కంపెనీలు దృష్టిసారిస్తున్న వేళ 'నెట్‌ఫ్లిక్స్' పెద్ద ఎత్తున లేఆఫ్‌లను చేపట్టింది. సంస్థ ఇటీవల వివిధ విభాగాల్లో లీడర్‌షిప్ మార్పులను చేపట్టింది. సీటీవో ఎలిజబెత్ స్టోన్ పదోన్నతి పొందిన వెంటనే డజన్ల సంఖ్యలో ఉద్యోగుల తొలగింపును చేపట్టడం గమనార్హం.

'నావిక్'కు ఎదురుదెబ్బ!

ఐఆర్ఎన్ఎస్ఎస్ ఉపగ్రహం విఫలం



న్యూఢిల్లీ: భారత స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ నావిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టెలేషన్(నావిక్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నావిక్‌లోని నాలుగు కార్యాచరణ ఉపగ్రహాల్లో ఒకటి విఫలమైనట్లు ఇస్రో తెలిపింది. దీన్ని ప్రయోగించిన 10 సంవత్సరాల తర్వాత ఇది విఫలమైనట్లు ఇస్రో పేర్కొన్నది. 2016 మార్చి 10న ప్రయోగించిన ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్‌కు చెందిన ఐఆర్ఎన్ఎస్ఎస్ 1-ఎఫ్ చివరి నిర్వాహక ఆటమిక్ క్లాక్(అణు గడియారం) పనిచేయకపోవడంతో అది విఫలమైనట్లు ఇస్రో వర్గాలు తెలిపాయి. దాని లోపల ఉన్న మూడు అణు గడియారాల్లో ఒకదానితో మాత్రమే ఉపగ్రహం పనిచేస్తున్నదని వారు చెప్పారు. నావిక్ వ్యవస్థ ప్రజలకు, రైల్వేలు, సైన్యం వంటి ప్రభుత్వ సంస్థలకు నావిగేషన్ సేవలను అందించడానికి కనీసం నాలుగు స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహాలు పూర్తిగా పనిచేయాల్సి ఉంటుంది.

ఫాస్టాగ్ వార్షిక పాసు మరింత ప్రియం

ఏప్రిల్ 1 నుంచి 2.5% పెంపుదల

న్యూఢిల్లీ : ఏప్రిల్ 1 నుంచి జాతీయ రహదారులపై ప్రయాణం కాస్త భారం కానున్నది. ఫాస్టాగ్ వార్షిక పాసు ధరను 2.5 శాతం పెంచాలని కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం వార్షిక పాసుకు రూ. 3,000 చెల్లిస్తుండగా ఏప్రిల్ 1నుంచి అది రూ. 3,075 కానున్నది. ఈ పాసు తీసుకున్న వాహన యజమానులు దేశవ్యాప్తంగా 200 టోల్ ప్లాజాల వద్ద ఆగకుండా ప్రయాణించవచ్చు. ఫాస్టాగ్ వార్షిక పాసును ప్రవేశపెట్టినపుడు నోటిఫికేషన్‌లోనే చార్జీల సవరణపై వార్షిక సమీక్ష ఉంటుందన్న నిబంధనను ప్రభుత్వం చేర్చింది. వార్షిక సవరణ ప్రక్రియలో భాగంగానే 2.5 శాతం పెంపు నిర్ణయాన్ని మంత్రిత్వశాఖ తీసుకుంది. దేశంలో 52 లక్షల మందికిపైగా ప్రజలు ఫాస్టాగ్ వార్షిక పాసును ఉపయోగిస్తున్నారు. గత ఏడాది ఆగస్టు 15న ఈ ప్రత్యేక వార్షిక పాసును ప్రభుత్వం ప్రారంభించింది. ఎన్నిసార్లయినా రీచార్జింగ్ చేసుకునే సౌలభ్యం ఉండడం ఈ పాసు ప్రధాన ఆకర్షణ. తరచూ వాహనాల్లో దూర ప్రయాణాలు చేసే వారికి ఈ పాసు చాలా లాభదాయకంగా ఉంది.

నిర్బంధం నుంచి వాంగ్‌చుక్‌కు విముక్తి

జైలు నుంచి విడుదల



న్యూఢిల్లీ, మార్చి 14: ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జోధ్‌పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద అతనిపై పెట్టిన కేసును కేంద్రం శనివారం ఎత్తివేసింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన మధ్యాహ్నం 1.30 గంటకు జైలు నుంచి విడుదలయ్యారు. లద్దాఖ్‌లో శాంతియుత వాతావరణం, స్థిరత్వం, పరస్పర విశ్వాసం పెంపొందించడానికి, నేతలతో అర్థవంతమైన చర్చలు జరపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హోం శాఖ తెలిపింది. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్ కింద రక్షణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేసిన ఆయనను కేంద్ర ప్రభుత్వం 2025, సెప్టెంబర్ 26న ఎన్ఎస్ఏ చట్టం కింద అరెస్ట్ చేసి నిర్బంధించింది. తర్వాత అతడిని జోధ్‌పూర్ జైలుకు తరలించారు. దీనిపై ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో గత ఏడాది అక్టోబర్ 6న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం అతని బెయిల్‌పై సుప్రీంలో విచారణ సాగుతున్నది.

అప్పు 5 లక్షలు.. కట్టింది 32.5 లక్షలు

- ఇంకా 25 లక్షలు చెల్లించాలని యువకుడి కిడ్నాప్
- అతడి రెండున్నర ఎకరాల భూమి కూడా స్వాధీనం
- మహారాష్ట్రలో బరితెగించిన వడ్డీ వ్యాపారులు

ముంబై, మార్చి 14 (నమస్తే తెలంగాణ): నిర్మాణ రంగ వ్యాపారం కోసం తీసుకున్న రూ.5 లక్షల రుణానికి. ఒక యువ సివిల్ ఇంజినీర్ అసలు, వడ్డీతో సహా మొత్తం రూ.31.50 లక్షలు తిరిగి చెల్లించినప్పటికీ వడ్డీ వ్యాపారులు సంతృప్తి చెందలేదు. ఆ యువకుడిని కిడ్నాప్ చేసి, అతని కుటుంబాన్ని నాశనం చేస్తామని బెదిరించి, అతని రెండున్నర ఎకరాల భూమిని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పుండలిక్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, లఖన్ రాజు సాబుల్(33), విక్కీ దేవిదాస్ షిండే (33) అనే ఇద్దరు వడ్డీ వ్యాపారులను అరెస్టు చేశారు. వారిని కోర్టు మార్చి 14 వరకు పోలీసు కస్టడీకి అప్పగించింది. ఇద్దరు నిందితులు వెంకటేశ్ రాజు ధాగే, ప్రశాంత్ బండు ధాక్నే పరారీలో ఉన్నారు.

కిడ్నాప్ చేసి.. కొట్టి..

ఛత్రపతి శంభాజీ నగర్‌కు చెందిన విశ్వజీత్ తన నిర్మాణ రంగ వ్యాపారం కోసం కారంజ్ ఖేడ్‌లో ఉన్న 2.5 ఎకరాల పొలం తనఖా పెట్టి లఖన్ సాబుల్, విక్కీ షిండే వద్ద రూ.5 లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ అప్పునకు వడ్డీతో కలిపి రూ.16 లక్షలు చెల్లించాడు. అయినా అప్పు తీరకపోవడంతో విశ్వజిత్ అత్త ప్రతిభా దేశ్‌ముఖ్ తన నగలు అమ్మి మరో రూ.15.5 లక్షలు చెల్లించారు. ఇలా మొత్తంగా ఇప్పటివరకు రూ.31.5 లక్షలు వడ్డీ వ్యాపారులకు ఇచ్చారు. అయినప్పటికీ అప్పు తీరలేదని భూమిని స్వాధీనం చేసుకున్న వ్యాపారులు.. ఇంకా రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2024 డిసెంబర్ 5న విశ్వజిత్‌ను కిడ్నాప్ చేశారు. అతని వద్ద డబ్బు లేకపోతే, ఆ భూమిని వెంకటేశ్ ధాగేకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వారు అతన్ని ఎంఐడీసీ చికల్తానా ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో బెదిరించి కొట్టారు. తన కుటుంబం, తన ప్రాణాలకు భయపడి, విశ్వజిత్ కారంజ్ ఖేడ్‌లోని తన రెండున్నర ఎకరాల భూమిని వెంకటేశ్ ధాగేకు బదిలీ చేశాడు. వేధింపులతో విసిగిపోయిన దేశ్‌ముఖ్ కుటుంబం చివరకు పుండలిక్ నగర్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

వైరముత్తుకు జ్ఞానపీఠ్

తమిళ రచయితకు ప్రతిష్ఠాత్మక పురస్కారం

అభినందించిన ముఖ్యమంత్రి స్టాలిన్





న్యూఢిల్లీ, మార్చి 14: భారత దేశంలో సాహిత్య రంగంలో ఇచ్చే అత్యున్నత పురస్కారం జ్ఞానపీఠ్ అవార్డును తమిళనాడుకు చెందిన ప్రముఖ కవి, గీత, నవలా రచయిత వైరముత్తుకు ప్రకటించారు. 2025 సంవత్సరానికి సాహిత్య సేవకు ఇచ్చే ఈ అవార్డును ఎంపిక కమిటీ శనివారం ప్రకటించింది. గత 20 ఏండ్ల కాలంలో ఈ అవార్డు అందుకుంటున్న తమిళులలో వైరముత్తు మూడోవారు. సినీ పాటలు, కవిత్వం, నవలా రచనలలో వైరముత్తు చేసిన సాహిత్య సేవలకు గుర్తింపుగా ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు కేంద్రం తెలిపింది. ఈ సందర్భంగా వైరముత్తును అభినందిస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'ఈ రోజు ఉదయమే ఆ కవితో నేను సమావేశమయ్యా. దాని తర్వాతే ఈ శుభవార్త తెలిసింది. తమిళనాడులో అఖిలన్, జయకాంత్ తర్వాత ఈ అత్యున్నత పురస్కారం ఆయనకు దక్కడం మాకెంతో సంతోషదాయకం.' అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నటుడు, నేత కమల్‌హాసన్ కూడా వైరముత్తును అభినందించారు. కాగా, ఉత్తమ సినీ గేయ రచయితగా ఏడుసార్లు జాతీయ చలనచిత్ర అవార్డును అందుకున్న ఏకైక భారతీయుడిగా ఇప్పటికే వైరముత్తు ప్రసిద్ధి పొందారు. 2023లో ఆయన రాసిన 'కల్లికట్టు ఇతికాసం' నవలకు సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. సాహిత్యానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఇప్పటికే కేంద్రం ఆయనను పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులతో సత్కరించింది.

విద్యార్థి దశ నుంచే..

తమిళనాడులో తేని జిల్లా మెట్టూరులో 1953లో జన్మించిన వైరముత్తు కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన 'వైకరై మేఘంగల్' కవితా సంకలనం అప్పట్లోనే ఒక మహిళా కళాశాలకు పాఠ్యాంశంగా మారింది. తమిళనాడు ప్రభుత్వ అధికారిక భాషా కమిషన్‌లో పనిచేస్తుండగా, దర్శకుడు భారతీరాజా తెరకెక్కించిన 'నిళ్లగళ్' చిత్రం ద్వారా 1980లో ఆయన సినీ గీత రచయితగా పరిచయం అయ్యారు. ఆయన సినిమాల్లో 7,500 పాటలు రాయగా, కవితలు, నవలలు తదితర 40 పుస్తకాలు రచించారు. సాహిత్య అకాడమీ, సాధన సమ్మాన్‌తో పాటు ఉత్తమ గేయ రచయితగా ఆరుసార్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పురస్కారాలు అందుకున్నారు. తమిళనాడు నుంచి ఇప్పటివరకు జ్ఞానపీఠ్ పురస్కారాలను అఖిలన్ (1975), జయకాంతన్ (2022) అందుకోగా, వైరముత్తు మూడోవారు.

కొరియాలో కనకరాజు



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'. ఇండియన్-కొరియన్ నేపథ్యాలతో క్రాస్ కల్చరల్ బ్లెండ్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకుడు. ఇందులో వరుణ్‌తేజ్ మునుపెన్నడూ చూడని విధంగా కొత్త పంథాలో కనిపిస్తారని మేకర్స్ అంటున్నారు. తాజాగా దక్షిణ కొరియాలో ఈ సినిమా చివరి షెడ్యూల్ మొదలైంది. వారం రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. సౌత్ కొరియాలోని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరణ జరుపుతామని, ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించిందని, త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని చిత్రబృందం వెల్లడించింది. రితికా నాయక్, సత్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాణం: యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రచన-దర్శకత్వం: మేర్లపాక గాంధీ.

కథపై సస్పెన్స్ వీడేనా?



రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా షూటింగ్‌ను పూర్తి చేశారు. ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాపై ఇప్పటికే కావాల్సినంత హైప్ క్రియేట్ అయింది. పాటలు మొదలు ప్రచార చిత్రాలు సోషల్‌మీడియాలో ట్రెండ్‌ని సృష్టించాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రామ్‌చరణ్ అన్ని ఆటల్లో ప్రవేశం కలిగిన ఆటకూలీ పాత్రలో కనిపించనున్నారు. ఏప్రిల్ 30న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్నది. ఓ వైపు 'పెద్ది' ప్రీరిలీజ్ మానియా కొనసాగుతుండగానే..మరో వైపు సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ చేయనున్న తదుపరి సినిమా అప్‌డేట్ గురించి అభిమానులు ఎదురుచూస్తున్నారు. సుకుమార్-రామ్‌చరణ్ కాంబోలో 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ రావడంతో తాజా ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి పెరిగిపోయింది. తాజా సమాచారం ప్రకారం రామ్‌చరణ్ పుట్టినరోజైన ఈ నెల 27న ఈ సినిమా తాలూకు బిగ్ అప్‌డేట్ వెలువడనుందట. సినిమా కాన్సెప్ట్‌తో పాటు ప్రీలుక్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలిసింది. ఈ సినిమా కోసం దర్శకుడు సుకుమార్ క్లాస్, మాస్ జోనర్‌లో రెండు స్క్రిప్టులు సిద్ధం చేశారని ఫిల్మ్‌నగర్ టాక్. మరి వీటిలో ఆయన దేనిని ఎంచుకుంటారన్నది ఆసక్తిని రేకెత్తిస్తున్నది. మొత్తానికి రామ్‌చరణ్ బర్త్‌డే రోజున ఈ క్రేజీ ప్రాజెక్ట్ బిగ్ అప్‌డేట్ ఖాయమని అంటున్నారు.

చిత్రం

బాలీవుడ్‌లో మరో ఆఫర్



'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది కీర్తి సురేష్. ఆ సినిమా ఫెయిల్యూర్‌గా నిలిచినా ఈ భామ అభినయానికి మంచి మార్కులు పడ్డాయి. తాజాగా కీర్తి సురేష్ బాలీవుడ్‌లో మరో బంపరాఫర్‌ను దక్కించుకుంది. రాజ్‌కుమార్ రావుతో కలిసి ఆమె 'రాప్తార్' అనే చిత్రంలో నటించనుంది. ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహించనున్నారు. శనివారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. షూటింగ్ ప్రారంభించామని, జూలైలో చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. విద్యా వ్యవస్థ నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని, ప్రేమకథకు కూడా ప్రాధాన్యత ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో కీర్తి సురేష్ పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్‌లో కనిపిస్తుందని, బాలీవుడ్‌లో ఆమె కెరీర్‌కు బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుందని మేకర్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కీర్తి సురేష్ తెలుగులో విజయ్ దేవరకొండ సరసన 'రౌడీ జనార్ధన' చిత్రంలో నటిస్తున్నది.

ఈసారి పర్‌ఫార్మెన్స్ బద్దలైపోద్ది!



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ పోలీస్ యాక్షన్ డ్రామా ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. పవర్‌ఫుల్ యాక్షన్, పంచ్ డైలాగ్‌లు, చక్కటి వినోదంతో ట్రైలర్ ఆసాంతం ఆకట్టుకుంది. పవన్‌కల్యాణ్ తన ట్రేడ్ మార్క్ మేనరిజం, డైలాగ్స్‌తో అదరగొట్టాడు. 'సంతోషంగా ఉండటం అంటే మన జీవితాన్ని మనం లైక్ చేయడం.. మన జీవితానికి ఎవడెవడో లైక్‌లు కొట్టడం కాదు', 'ఉస్తాద్ భగత్‌సింగ్...ఇచ్చిపడేసే గోత్రం, ఇరగదీసే నక్షత్రం', 'ఈసారి పర్‌ఫార్మెన్స్ బద్దలైపోద్ది..' అంటూ పవన్‌కల్యాణ్ చెప్పిన సంభాషణలు హైలైట్‌గా నిలిచాయి. మాస్, కమర్షియల్ అంశాలను పర్‌ఫెక్ట్‌గా కలబోసి దర్శకుడు ఈ సినిమాను రూపొందించారని ట్రైలర్‌ను బట్టి అర్థమవుతున్నది. శ్రీలీల, రాశీఖన్నా, పార్థిబన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, నేపథ్య సంగీతం: తమన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, రచన-దర్శకత్వం: హరీశ్‌శంకర్ ఎస్.

33 వేలతో సినిమా

'తుంబాడ్' దర్శకుడి సంచలనం



ఇప్పుడు సినీ నిర్మాణం అంటే కోట్లతో కూడుకున్న వ్యవహారం. కొత్త ఆర్టిస్టులతో ఓ చిన్న సినిమా తీయాలన్నా కోటి రూపాయలకుపైగా ఖర్చు చేయాల్సిందే. అలాంటిది కేవలం 33 వేలతో సినిమా తీసి చూపించారు బాలీవుడ్ దర్శకుడు రాహి అనిల్ బార్వే. ఈ బడ్జెట్‌తో షార్ట్‌ఫిల్మ్ తీయడం కష్టతరమైన నేటి పరిస్థితుల్లో ఆయన ఏకంగా ఫీచర్ ఫిల్మ్ తీసి అందరినీ ఆశ్చర్యపరిచారు. రాహి అనిల్ బార్వే ఎవరో కాదు..'తుంబాడ్' వంటి మిస్టరీ థ్రిల్లర్‌తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడాయన. ఇప్పుడు 'మన్-పిశాచ్' పేరుతో కేవలం ఇద్దరు నటులతో ఆయన ప్రయోగం చేశారు. ఈ సైకలాజికల్ హారర్ డ్రామాను యానియా భరద్వాజ్, దీపక్ దమ్లే అనే ఇద్దరు నటులతో 80 నిమిషాల నిడివితో తెరకెక్కించారు. 'మన్-పిశాచ్' స్క్రిప్ట్ 60 పేజీలు. ఈ సినిమా కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయం తీసుకున్నారు. చేతితో గీసిన స్టోరీ బోర్డులు, ఐఫోన్‌లో తీసిన వీడియో రికార్డింగ్స్, ఫొటోషాప్, జనరేటివ్ ఏఐ ఉపయోగించిన ఈ సినిమాను పూర్తి చేశారు.

కథ గురించి..

పురావస్తు శాఖకు చెందిన అధికారి సదాశివ రావ్..హడమ్‌గాన్ అనే ఒక ఊరికి వెళతాడు. కొండలోంచి బయటపడ్డ పెద్ద గుమ్మటం రహస్యం తెలుసుకునేందుకు పరిశోధన మొదలుపెడతాడు. అక్కడ సావిత్రి అనే వితంతువు ఇంట్లో ఆశ్రయం పొందుతాడు. రాత్రి కాగానే ఆ గ్రామంలో చోటుచేసుకునే భయానక అనుభవాలే 'మన్-పిశాచ్' కథ. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్ చూసి అందరూ ఆశ్చర్యపోయారు. కేవలం 33 వేలతో ఆ స్థాయి క్వాలిటీతో సినిమా తీయడం అద్భుతమని ప్రశంసిస్తున్నారు. భవిష్యత్తులో కృతిమ మేధ (ఏఐ) సినిమా నిర్మాణాన్ని ఏ స్థాయిలో ప్రభావితం చేస్తుందనడానికి ఈ సినిమా ఒక ఉదాహరణ అని చెబుతున్నారు. పట్టుదల, తపన ఉంటే ఓ కళాకారుడు శూన్యం నుంచి కూడా అద్భుతాలు సృష్టించగలడని, అందుకు ఈ సినిమా ప్రయోగమే సాక్ష్యమని దర్శకుడు అనిల్ బార్వే తెలిపారు. ఈ చిత్రాన్ని యూట్యూబ్‌లో విడుదల చేయబోతున్నారు.

గోదారి గట్టుపై బంగారు బొమ్మ



సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ జంటగా నటిస్తున్న గ్రామీణ ప్రేమకథా చిత్రం 'గోదారి గట్టుపైన'. సుభాష్‌చంద్ర దర్శకుడు. రెడ్‌పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నది. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ని ముమ్మరం చేశారు. శుక్రవారం ఈ సినిమా నుంచి మూడో పాట 'బంగారు బొమ్మ'ను విడుదల చేశారు. నాగవంశీ స్వరపరచిన ఈ గీతాన్ని బాలాజీ రచించారు. వింటేజ్ ఫీల్‌తో సాగిన ఈ పాట ప్రేమికుల మదిలోని మధురభావాలను ఆవిష్కరించింది. ప్రేయసిని 'బంగారు బొమ్మ' అని పిలిచే కథానాయకుడు ఆమెపై ఉన్న అనురాగాన్ని ఈ పాట ద్వారా వ్యక్తం చేశారు. జగపతిబాబు, రాజీవ్ కనకాల, లైలా, దేవిప్రసాద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: నాగవంశీకృష్ణ, నిర్మాత: అభినవ్ రావు, రచన-దర్శకత్వం: సుభాష్‌చంద్ర.



94వ గ్రాండ్‌మాస్టర్‌గా..

ఢిల్లీ: భారత యువ చెస్ ఆటగాడు మయాంక్ చక్రవర్తి చరిత్ర సృష్టించాడు. 17 ఏండ్ల ఈ అసోం చిన్నోడు.. భారత 94వ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచి, ఈశాన్య రాష్ర్టాల నుంచి ఈ ఘనత సాధించిన తొలి చెస్ ప్లేయర్‌గా రికార్డులకెక్కాడు. స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో జరిగిన చెస్ టాలెంట్స్ టోర్నమెంట్‌ను కైవసం చేసుకోవడంతో అతడికి జీఎం హోదా దక్కింది. జీఎంగా అర్హత సాధించడానికి గాను ఈ టోర్నీలో 6.5 పాయింట్లు సాధించాల్సి ఉండగా మయాంక్ ఏకంగా 7 పాయింట్లతో సత్తాచాటి టైటిల్‌తో పాటు జీఎం హోదానూ సాధించాడు.

తరుణ్ నిష్క్రమణ

ముగిసిన భారత పోరాటం

బాసెల్: స్విస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత పోరాటం ముగిసింది. ఈ టోర్నీలో భారత ఆశలు మోస్తున్న హైదరాబాదీ షట్లర్ తరుణ్ మన్నెపల్లి క్వార్టర్స్‌లో నిష్క్రమించాడు. శనివారం జరిగిన మెన్స్ సింగిల్స్ క్వార్టర్స్ పోరులో తరుణ్.. 19-21, 21-19, 13-21తో అంథోని గింటింగ్ చేతిలో పోరాడి ఓడాడు. తొలి రెండు గేమ్స్‌లో ఇరువురూ హోరాహోరీగా పోరాడి తలా ఒకటి గెలుచుకున్నా నిర్ణయాత్మక మూడో గేమ్‌లో మాత్రం తరుణ్ ఆరంభం నుంచే వెనుకబడి ఓటమి వైపు నిలిచాడు.

ముజారబనికి పీఎస్‌ఎల్ బెదిరింపులు

లాహోర్: తమతో ముందుగా ఒప్పందం కుదుర్చుకుని తర్వాత ఐపీఎల్ (కేకేఆర్ తరఫున) ఆడేందుకు వచ్చిన జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజారబనిపై పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్) చట్టపరమైన చర్యలకు దిగేందుకు సిద్ధమైంది. ఈ జింబాబ్వే బౌలర్ గతంలో పీఎస్‌ఎల్ ఫ్రాంచైజీ ఇస్లామాబాద్ యునైటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నా అతడు దానిని ఉల్లంఘించి కోల్‌కతా నైట్ రైడర్స్‌తో కలిశాడు. దీనిపై ఇస్లామాబాద్ ఫ్రాంచైజీ.. అతడిపై చట్టపరమైన చర్యల కోసం ఉపక్రమిస్తున్నట్టు ఆ జట్టు వర్గాలు తెలిపాయి.

భారత్ రన్నరప్

ఫైనల్‌లో ఇంగ్లండ్ చేతిలో ఓటమి

ముగిసిన వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ

నవ్‌నీత్ కౌర్‌కు బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ ఆసాంతం అపజయమెరుగని ఆటతో అదరగొట్టిన భారత మహిళల జట్టు ఫైనల్‌లో తడబడింది. నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన తుది పోరులో భారత్.. 0-2తో ఇంగ్లండ్ చేతిలో అపజయం పాలై రన్నరప్‌తో సరిపెట్టుకుంది. లీగ్‌తో పాటు కీలక నాకౌట్ దశలోనూ సత్తాచాటిన భారత అమ్మాయిలు.. కీలక ఫైనల్ పోరులో మాత్రం ప్రపంచ ఆరో ర్యాంకు జట్టైన ఇంగ్లండ్ ఆట ముందు తేలిపోయి రజతంతో సంతృప్తి పడ్డారు. ఇంగ్లండ్ తరఫున తొలి క్వార్టర్‌లోనే గ్రేస్ బల్స్‌డన్ (13వ నిమిషంలో) గోల్ కొట్టగా మూడో క్వార్టర్‌లో నీల్ ఎలిజిబెత్ (43వ నిమిషంలో) రెండో గోల్ సాధించింది. నాలుగు క్వార్టర్స్‌లోనూ భారత జట్టుకు నాలుగుసార్లు పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్ కొట్టే అవకాశమొచ్చినా మన అమ్మాయిలు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. మరో మ్యాచ్‌లో స్కాట్లాండ్.. 1-0తో ఇటలీని చిత్తు చేసి మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ ఏడాది ఆగస్టు 15-30 మధ్య బెల్జియం, నెదర్లాండ్స్ ఆతిథ్యమివ్వనున్న హాకీ ప్రపంచకప్‌నకు ఈ టోర్నీలో టాప్-3లో నిలిచిన జట్లు (ఇంగ్లండ్, భారత్, స్కాట్లాండ్) అర్హత సాధించాయి.

టోర్నీలో ఇప్పటికే ప్రపంచకప్ బెర్త్‌ను ఖరారు చేసుకున్న భారత్.. టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగింది. కానీ ఫైనల్‌లో మాత్రం పటిష్ఠ ఇంగ్లండ్ సమష్టి ఆట ముందు భారత్ తేలిపోయింది. రెండో నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ అవకాశం దక్కినా నవ్‌నీత్ కౌర్ దానిని గోల్‌గా మలుచలేకపోయింది. తొలి క్వార్టర్ ముగింపు దశకు చేరుకుంటున్న సమయంలో దక్కిన పీసీని ఇంగ్లండ్ చక్కగా వినియోగించుకుని గోల్ చేసింది. ఆట అర్ధభాగం ముగిసేసరికే 1-0 ఆధిక్యంలో ఉన్న ఇంగ్లండ్.. భారత ఎదురుదాడిని నిలువరిస్తూనే 43వ నిమిషంలో రెండో గోల్‌తో ఆధిక్యాన్ని 2-0కు పెంచుకుంది. పటిష్ఠమైన ఇంగ్లండ్ డిఫెన్స్‌ను ఛేదించలేక ఆఖరి క్వార్టర్‌లోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. టోర్నీలో నాలుగు గోల్స్ చేసిన నవ్‌నీత్ కౌర్‌కు బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు లభించింది.






ముగ్గురికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్

బిన్నీ, ద్రవిడ్, మిథాలీకి పురస్కారాలు

బెస్ట్ క్రికెటర్‌గా గిల్, మంధాన


ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రతి యేటా అందజేసే 'నమన్' అవార్డులను శనివారం ప్రకటించింది. భారత క్రికెట్‌కు ఎనలేని సేవలు చేసిన దిగ్గజ క్రికెటర్లు రోజర్ బిన్నీ, రాహుల్ ద్రవిడ్ (కల్నల్ సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్), మిథాలీ రాజ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించనుంది. నిరుడు భారత మెన్స్ టెస్ట్, వన్డే జట్టు పగ్గాలు అందుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు 2024-25 ఏడాదికి గాను బెస్ట్ ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా పాలి ఉమ్రిగర్ అవార్డు దక్కగా అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా క్రికెటర్‌గా స్మృతి మంధాన ఎంపికైంది. తెలుగమ్మాయి శ్రీచరణి బెస్ట్ ఇంటర్నేషనల్ డెబ్యూ క్రికెటర్ అవార్డుకు ఎంపికవగా పురుషుల విభాగంలో ఈ అవార్డు హర్షిత్ రాణాను వరించింది. ఈ అవార్డులతో పాటు ఇటీవల ఐసీసీ ట్రోఫీలు గెలిచిన (2025లో చాంపియన్స్ ట్రోఫీ, మహిళల వన్డే ప్రపంచకప్ 2025, ఉమెన్స్ అండర్-19 టీ20 వరల్డ్ కప్, మెన్స్ అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్, మెన్స్ టీ20 వరల్డ్ కప్-2025) విజేతలను కూడా ఈ సందర్భంగా బీసీసీఐ ఘనంగా సత్కరించనుంది.

ఐపీఎల్‌కు హర్షిత్ దూరం?



కోల్‌కతా: ఐపీఎల్-19వ ఎడిషన్‌కు ముందే కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)కు గాయాల బెడద కలవరపెడుతున్నది. ఆ జట్టు ఎన్నో ఆశలు పెట్టుకున్న స్టార్ పేసర్ హర్షిత్ రాణా ఈ సీజన్‌కు దూరమైనట్టు వార్తలు వస్తున్నాయి. టీ20 ప్రపంచకప్‌నకు ముందు మోకాలిగాయంతో దూరమైన అతడు.. శస్త్రచికిత్స చేయించుకున్నా ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని, రాబోయే ఐపీఎల్ సీజన్‌లో అతడు ఆడేది అనుమానమేనని కేకేఆర్ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై కోల్‌కతా నుంచి అధికారిక ప్రకటనేమీ రాలేదు. ఇదిలాఉండగా వేలంలో ఆ జట్టు భారీ ధర వెచ్చించి కొనుగోలు చేసిన మతీశ పతిరానా కూడా గాయంతో బాధపడుతున్నాడు. అతడు కూడా సీజన్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అన్నది అనుమానమే!

మేమేమైనా చారిటీ మ్యాచ్ ఆడామా?



ఢాకా: బంగ్లాదేశ్, పాకిస్థాన్ మధ్య శుక్రవారం జరిగిన రెండో వన్డేలో పాక్ బ్యాటర్ సల్మాన్ అలీ అఘా రనౌట్ వివాదాస్పదమవడంతో అతడితో పాటు ఆ జట్టు క్రికెటర్లు, మాజీలు క్రీడా స్ఫూర్తి గురించి మాట్లాడుతున్న వేళ బంగ్లా బ్యాటర్ లిటన్ దాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తామేమీ చారిటీ మ్యాచ్ ఆడలేదంటూ ఘాటుగా సమాధానమిచ్చాడు. దాస్ స్పందిస్తూ.. 'ముందుగా నేను అందరికీ ఒక్కటే చెప్పదలుచుకున్నా. మేం ఇక్కడికి చారిటీ లీగ్ ఆడేందుకు రాలేదు. ఇది అంతర్జాతీయ మ్యాచ్. అది (అఘా రనౌట్) నిబంధనల ప్రకారమే జరిగింది. అందులో క్రీడాస్ఫూర్తి ఎక్కడుందో నాకు అర్థం కావడం లేదు ' అని స్పష్టం చేశాడు.

వరంగల్ పారా అథ్లెట్ల హవా

నాలుగు కాంస్యాలు సొంతం





హనుమకొండ చౌరస్తా, మార్చి 14: ఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మక వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో వరంగల్ జిల్లాకు చెందిన పారా అథ్లెట్లు ఏ. లోకేశ్, పీ. మమత అద్భుత ప్రతిభ కనబర్చారు. ఈ నెల 11 నుంచి 14 వరకు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన పోటీల్లో భాగంగా నర్సంపేటకు చెందిన లోకేశ్ (ఎఫ్-46) జావెలిన్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో రెండు కాంస్యాలు సాధించాడు. మరోవైపు మమత (ఎఫ్-55) షాట్‌పుట్, జావెలిన్‌త్రో క్యాటగిరీల్లో రెండు కాంస్యాలు గెలిచింది.

రవికిరణ్ డబుల్ ధమాకా



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ, జూనియర్ కాలేజీల ఫిజికల్ డైరెక్టర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ మాజీ విద్యార్థి రవికిరణ్ వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్‌ప్రిక్స్‌లో సత్తాచాటాడు. టీ-37 విభాగంలో అతడు.. 200 మీటర్ల పరుగు పందెంతో పాటు లాంగ్ జంప్ విభాగాల్లో రెండు కాంస్యాలు సాధించాడు. ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్‌లో మరిన్ని పతకాలు తీసుకొస్తాడని అసోసియేషన్ కోరింది.

సబలెంకా x రిబాకినా

టైటిల్ పోరుకు సై

సెమీస్‌లోనే ఓడిన బాంబ్రీ జోడీ

ఇండియన్ వెల్స్: ఈ ఏడాది టెన్నిస్ ఆరంభ సీజన్ టోర్నీ అయిన ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ఫైనల్‌లో ఢీకొన్న అరీనా సబలెంకా (బెలారస్), ఎలీనా రిబాకినా (కజకిస్థాన్) మరోసారి టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ ఇద్దరూ బీఎన్‌పీ పారిబాస్ ఓపెన్ (ఇండియన్ వెల్స్) టోర్నీలో ఫైనల్‌కు చేరారు. మహిళల సింగిల్స్ సెమీస్‌లో టాప్ సీడ్ సబలెంకా.. 6-3, 6-4తో లిండా నొస్కొవ (చెక్)పై సునాయస విజయం సాధించింది. గడిచిన నాలుగేండ్లలో ఆమెకు ఇది మూడో ఫైనల్ కావడం విశేషం. రెండో సెమీస్‌లో రిబాకినా.. 7-5, 6-4తో స్వితోలినా (ఉక్రెయిన్)ను చిత్తుచేసి సబలెంకాతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది. ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌లో ఈ ఇద్దరి మధ్య జరిగిన ఫైనల్‌లో రిబాకినానే అదృష్టం వరించిన విషయం తెలిసిందే. కాగా పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యూకీ బాంబ్రీ జోడీ పోరాటం సెమీస్‌కే పరిమితమైంది. తొలిసారి ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీలో సెమీస్‌కు చేరిన బాంబ్రీ, గొరన్సన్ (స్వీడన్) జోడీ.. 5-7, 7-6 (7/3) 5-10తో ఆర్థర్ రిండర్‌నెక్ (ఫ్రాన్స్), వాలెంటిన్ (మొనాకో) చేతిలో ఓడింది.







కోర్ కోర్సులు ఖతం!

- విద్యార్థుల నుంచి నో డిమాండ్
- ఐదేండ్లల్లో సగానికి పైగా తగ్గిన సీట్లు
- 178 ఇంజినీరింగ్ కాలేజీలు క్లోజ్
- ఏఐసీటీఈ అఫిలియేషన్ పెండింగ్
- ఈసారీ కోర్‌కు కోతేనా?

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : సివిల్, మెకానికల్ కోర్సుల్లో 52%, ఎలక్ట్రికల్‌లో 46% ఇలా రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కోర్ బ్రాంచీల్లో సీట్లకు కోతపడింది. ఈ కోర్సుల్లో భారీగా సీట్లు తగ్గిపోయాయి. ఇదేదో దశాబ్దకాలంలో అనుకుంటే పొరపాటు పడ్డట్టే. 2019 నుంచి 2025 మధ్య కాలంలోనే. అంటే ఐదేండ్ల కాలంలోనే దాదాపు 50% కోర్ ఇంజినీరింగ్ సీట్లకు కోతపడింది. కాలేజీలు, యాజమాన్యాలు ఈ కోర్సుల్లోని సీట్లను తగ్గించుకుంటున్నాయి. తగ్గిన ఈ సీట్ల స్థానంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్(సీఎస్‌ఈ) సీట్లు పెంచుకుంటున్నాయి. 2026-27 విద్యాసంవత్సరానికి ఇంజినీరింగ్ కాలేజీల అఫిలియేషన్ జారీ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఏప్రిల్‌లో అఖిల భారత సాంకేతిక విద్యామండలి అఫిలియేషన్(ఏఐసీటీఈ) అనుమతులిస్తుంది. అయితే ఈ సారి కూడా అదే జరుగుతుందా..? కోర్ కోర్సుల్లో సీట్లు మరిన్ని తగ్గుతాయా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. మే రెండో వారంలో ఫలితాలు విడుదలవుతాయి. ఆ తర్వాత ఇంజినీరింగ్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ మొదలవుతుంది. ఈ ఐదేండ్ల కాలంలో సీఎస్‌ఈ కోర్సుల్లో విద్యార్థుల చేరికలు 20% పెరిగాయి. ఐదేండ్ల క్రితం 42శాతమున్న ఎన్‌రోల్‌మెంట్ ఇప్పుడు 62శాతానికి పెరిగింది. 2019లో సీఎస్‌ఈ కోర్సుల్లో 29వేల సీట్లు నిండితే, 2025కు వచ్చేసరికి 48వేలు నిండాయి. సీఎస్‌ఈ తర్వాత అంతో ఇంతో డిమాండ్ ఉన్న ఏకైక కోర్సు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సు మాత్రమే. ఈ కోర్సులో చేరే వారి సంఖ్య కేవలం 5% మాత్రమే తగ్గింది. సీట్లు కూడా 8% లోపు తగ్గాయి. 2017లో 13,500 సీట్లు నిండితే.. 2025లో 12,600 మంది చేరారు. అంటే 5% మాత్రమే ప్రవేశాలు తగ్గాయన్నమాట.


ఎన్‌రోల్‌మెంట్ కూడా

- **సీట్లు తగ్గడమే కాదు.. కోర్ ఇంజినీరింగ్ బ్రాంచీల్లో సీట్ల భర్తీ, విద్యార్థుల నమోదు కూడా తగ్గుతున్నది. సివిల్ ఇంజినీరింగ్‌లో కోర్సులో 2017-18లో 8,300 మంది విద్యార్థులు చేరితే.. 2024-25కు వచ్చేసరికి కేవలం 6,200 సీట్లు మాత్రమే భర్తీఅయ్యాయి. అంటే 25% పడిపోయాయి.**
- **మెకానికల్ కోర్సులో 10,400 మంది చేరితే, ఐదేండ్ల తర్వాత చూస్తే 6,400కు పడిపోయింది. ఈ కోర్సులో ఎన్‌రోల్‌మెంట్ ఏకంగా 38% తగ్గింది.**
- **ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో 2019లో 9వేల సీట్లు భర్తీ అయితే, 2025కు వచ్చేసరికి 5వేలకు పడిపోయింది. అంటే 40% ఎన్‌రోల్‌మెంట్ తగ్గింది.**

50% ఇంజినీరింగ్ కాలేజీలు క్లోజ్..

రాష్ట్రంలో పలు ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు మూతపడుతున్నాయి. 2017-2025 మధ్య 50% మూతపడ్డాయి. ఐదేండ్ల క్రితం కాలేజీల సంఖ్య 353 ఉంటే, ఇప్పుడు 175కు చేరాయి. రాష్ట్రంలో ఒక కాలేజీ సగటు విద్యార్థుల సంఖ్య 611 మాత్రమే. జాతీయ సగటు 709గా ఉంది. విద్యార్థులు చేరకపోవడం, అధ్యాపకుల కొరత, ఏఐసీటీఈ నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాలతో యాజమాన్యాలు కాలేజీలను క్లోజ్ చేస్తున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు డీమ్డ్, ప్రైవేట్ వర్సిటీలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. దేశంలోని ఇంజినీరింగ్ హబ్‌ల్లో తెలంగాణ ఒకటి. 40% స్థూల నమోదు నిష్పత్తితో ఉన్నత విద్య భాగస్వామ్యంలో అగ్రగామి రాష్ట్రంగా ఉంది. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీలుండగా, వీటిలో 91% ప్రైవేట్ కాలేజీలే. వీటిల్లో 1.30 లక్షల సీట్లున్నాయి.

వాణిజ్య



ఓలా స్కూటర్లపై భారీ రాయితీ

ఎస్1, రోడ్‌స్టర్ మోటర్‌సైకిల్‌పై రూ.20 వేల వరకు

న్యూఢిల్లీ, మార్చి 14: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన సంస్థ ఓలా..కొనుగోలుదారులకు శుభవార్తను అందించింది. దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంస్థ.. దీంట్లోభాగంగా పలు వాహనాలపై భారీగా రాయితీ ఇస్తున్నట్టు ప్రకటించింది. నిర్వహణ ఖర్చులు పెరగడంతోపాటు పెట్రోల్ లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ఈవీల వాడకాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దీంట్లో భాగంగా నూతన ఓలా ఎస్1 స్కూటర్ మాడల్ లేదా రోడ్‌స్టర్ మోటర్‌సైకిల్‌ను కొనుగోలు చేసిన వారికి రూ.20 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. స్వల్పకాలం మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ సోమవారం ముగియనున్నది. ఈ ఆఫర్లలో భాగంగా రూ.10 వేల నగదు డిస్కౌంట్‌తోపాటు రూ.15 వేలు విలువైన ఎనిమిదేండ్ల బ్యాటరీ వ్యారంటీ ఉచితంగా అందిస్తున్నది.

రాంకీకి మరో భారీ ప్రాజెక్టు

హైదరాబాద్, మార్చి 14: రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మరో భారీ ప్రాజెక్టును చేజిక్కించుకున్నది. మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎంఐడీసీ) అభివృద్ధి చేస్తున్న మహా ఇంటిగ్రేటెడ్ లైఫ్ సైన్స్ సిటీ లిమిటెడ్ ప్రాజెక్టు లభించినట్టు కంపెనీ వెల్లడించింది. ఈ ఆర్డర్ విలువ రూ.3 వేల కోట్ల స్థాయిలో ఉంటుందని పేర్కొంది. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిన నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును డిజైనింగ్, నిర్మాణ, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్‌వోటీ) పద్ధతిన నిర్మించాల్సి ఉంటుందని రాంకీ వర్గాలు వెల్లడించాయి. ఐదేండ్లలో అందుబాటులోకి రానున్న ఈ పార్క్‌ను 90 ఏండ్లు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం కంపెనీ వద్ద రూ.13,500 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి.

కార్ల ధరలకు రెక్కలు!

రెండు శాతం వరకు పెంచిన లగ్జరీ కార్ల సంస్థలు

అదే బాటలో మరిన్ని ఆటోమొబైల్ కంపెనీలు



న్యూఢిల్లీ, మార్చి 14: కార్ల ధరలకు మళ్లీ రెక్కలురాబోతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దేశీయ కరెన్సీ విలువ పాతాళంలోకి పడిపోయింది. దీంతో దేశీయ, అంతర్జాతీయ ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలు తమ వాహన ధరలను పెంచడానికి మరోసారి సిద్ధమవుతున్నాయి. డాలర్, యూరోతో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం చెందడంతోపాటు ఉత్పత్తి వ్యయం అధికం కావడం వల్లనే వాహన ధరలు పెంచాల్సి వస్తున్నదని ఆటోమొబైల్ ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. వీటికి తోడు దేశవ్యాప్తంగా వంటగ్యాస్ కొరత కూడా తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నదని, ఈ ఇబ్బందికర పరిస్థితులు ఆటోమొబైల్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. సామాన్యుడికి ఊరట కల్పించాలనే ఉద్దేశంతో గతంలో కేంద్ర ప్రభుత్వం తక్కువ సీసీ సామర్థ్యం కలిగిన కార్లపై జీఎస్టీని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంతో వాహన సంస్థలు ధరలను భారీగా తగ్గించాయి.

క్రూడాయిల్ సెగ

అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు పదిహేను రోజుల్లో క్రూడాయిల్ ధరలు 40 శాతానికి పైగా పెరిగాయి. దీంతో క్రూడాయిల్‌తో ఉత్పత్తి అయ్యే ఇంజిన్ ఆయిల్ కోసం అధికంగా వెచ్చించాల్సి రానుండటం కూడా ధరలు పెరగడానికి మరో కారణం. గత నెల చివర్లో 73 డాలర్లుగా ఉన్న బ్యారెల్ ధర ప్రస్తుతం 103 డాలర్ల స్థాయిలో కదలాడుతున్నది. సుమారుగా 30 డాలర్ల మేర పెరిగింది. పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు రోజురోజుకూ ముదురుతుండటంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లో ఆందోళన నెలకొన్నది. సమీప భవిష్యత్తులో బ్యారెల్ ధర 200 డాలర్లకు చేరుకునే అవకాశం ఉన్నదని అంచనాలు కూడా వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో చమురు దిగుమతులపై ఆధారపడుతున్న భారత్ లాంటి దేశాల ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

బెంజ్ కార్లు...

లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ కూడా తన వాహన ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో వాహన ధరలను 2 శాతం పెంచుతున్నట్టు మెర్సిడెజ్-బెంజ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్(సేల్స్ అండ్ మార్కెటింగ్) బ్రెండన్ సిస్సింగ్ తెలిపారు. యూరోతో పోలిస్తే రూపాయి విలువ భారీగా పడిపోవడంతో పాటు ఉత్పత్తి వ్యయం అధికం కావడంతో సంస్థపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను స్వల్పంగా పెంచినట్టు చెప్పారు. పెరిగిన ధరలు వచ్చే నెల 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఆడీ కార్లు మరింత ప్రియం

లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ మరోసారి వాహన ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా వాహన ధరలను 2 శాతం వరకు సవరిస్తున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు కరెన్సీ తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థ రూ.43.23 లక్షల నుంచి రూ.2.34 కోట్ల లోపు ధర కలిగిన పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

టాంజానియాకు సహకరిస్తాం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



శనివారం రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుతో టాంజానియా మంత్రి ముద్రిక్ రమదాని సోరాగా

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): టాంజానియా దేశానికి డిజిటల్ ఎకానమీ సాంకేతిక సహకారాన్ని అందించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి సమగ్ర కార్యప్రణాళికను రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో టాంజానియా కమ్యూనికేషన్లు, ఐటీ శాఖల మంత్రి ముద్రిక్ రమదాని సోరాగా నేతృత్వంలోని అత్యున్నత స్థాయి బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఇరువురు తెలంగాణ-టాంజానియా మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై చర్చించారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సామాజిక, ఆర్థిక సమ్మిళిత వృద్ధికి బలమైన పునాదిగా మారిందన్నారు. ఆ దిశగా తెలంగాణ వేసిన అడుగులు ప్రపంచపటంలో ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేశాయన్నారు. ఇదే స్ఫూర్తితో డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారం, మెంటార్‌షిప్, నైపుణ్య మార్పిడి అందిస్తామన్నారు. అక్కడ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అంతేకాకుండా మహిళా సాధికారత, ఎమర్జింగ్ టెక్నాలజీస్, డిజిటల్ గవర్నెన్స్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకోసిస్టం, కెపాసిటీ బిల్డింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర కీలక రంగాల్లో టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి చర్యలు తీసుకుంటామన్నారు.

తెలంగాణ భాగస్వామ్యం అవసరం

టాంజానియా మంత్రి ముద్రిక్ రమదాని మాట్లాడుతూ.. డిజిటల్ ఎకానమీగా మారాలన్న మా లక్ష్య సాధనలో తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాల వ్యూహాత్మక భాగస్వామ్యం ఎంతో అవసరమని చెప్పారు. ఐటీ, హెల్త్ కేర్, మెడికల్ టూరిజం, డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకోసిస్టం, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతి, చేపట్టిన సంస్కరణలు తమకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



ఆకాశ కూడా..

న్యూఢిల్లీ, మార్చి 14: మరో విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్ కూడా తన విమాన టికెట్లపై ప్యూయల్ సర్‌చార్జీని విధిస్తున్నట్టు ప్రకటించింది. ఈ నెల 15 నుంచి అందుబాటులోకి రానున్న ఈ ప్యూయల్ సర్‌చార్జీ దేశీయ విమాన టికెట్లపై రూ.199, అంతర్జాతీయ రూట్లపై రూ.1,300 వసూలు చేస్తున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా విమాన ఇంధన ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో ఒక్కో విమానయాన సంస్థలు ప్యూయల్ సర్‌చార్జీని వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే ఇండిగో, ఎయిర్ ఇండియా, ఎయిర్‌ఎక్స్‌ప్రెస్‌లు ఇంధన సర్‌చార్జీని విధించిన విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా ఆకాశ ఎయిర్ కూడా విమాన ప్రయాణం బట్టి ప్యూయల్ సర్‌చార్జీ వసూలు చేస్తున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో గడిచిన పదిహేను రోజుల్లో ప్యూయల్ జెట్ ఏకంగా 40 శాతం వరకు ఎగబాకిందని, దీంతో సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ఈ సర్‌చార్జీని విధిస్తున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.